# గ్రంథాలయ సర్వస్వము

ఈశ్వర - చైత్రము - ఏప్రియల్ ౧౯౩౭



అజంతా చెక్కడములలోని యొక చిత్తరువు

సచిత్ర మాసపత్రిక

బెజవాడ

సంపుటము ౧౦

సంచిక ౧౧

# ఉత్తమగ్రంథములకానుక

ఆంధ్రదేశగ్రంథాలయ సంఘసభ్యులై, చందాలుచెల్లించిన గ్రంథాలయములవారికి మాత్రమే.

## I. గీతాభూమిక

౧౧౮ పుటలు - స్టిఫ్‌బైండు - మేలుకాగితము - అమూల్యగ్రంథము. శ్రీ అరవిందయోగీంద్రుని బంగాళి గ్రంథమునకు శ్రీ గొట్టిపాటి వెంకటసుబ్బయ్యాగారి తెనుగు అనువాదము. ఇది శ్రీ చల్లపల్లి రాజాగారి ఔదార్యమువలన లభించినది. పోస్టేజీ ఉచితము.

## II. వల్లూరి సూర్యనారాయణరావు, బి. ఏ., బి. ఎల్. గారిచే ప్రకటితములగు ఉత్తమ గ్రంథములు.

పై గ్రంథములు కానుకగా పొందగోరు గ్రంథాలయములవారు దిగువ చిరునామాకు వ్రాయవలెను.

కార్యదర్శి,
ఆంధ్రదేశ గ్రంథాలయసంఘము, బెజవాడ.

షరా:— "గీతాభూమిక:" భీమవరము - తణుకు - తాడేపల్లిగూడెము - రేపల్లె - తెనాలి - బెజవాడ ధర్మవరము తాలూకాలలోని గ్రంథాలయములవారు ఆయాతాలూకా గ్రంథాలయసంఘముల నుండియు, బెజవాడ-గుంటూరు, కాకినాడ, విశాఖపట్టణములలోని గ్రంథాలయములవారు ఆయా పట్టణగ్రంథాలయ సంఘముల నుండియు పై గ్రంథమును పొందగలుగుదురు.

---

# గ్రంథాలయ సర్వస్వము

చందా: ఆంధ్రదేశ గ్రంథాలయసంఘ సభ్యులకు సభ్యత్వపుచందాతో రు 3 లు మాత్రమే.
ప్రతినెల 5-వ తేదీని వెలువడును.

వ్యాసములు:-గ్రంథాలయశాస్త్రము - ఆంధ్ర వాఙ్మయము, ఆంధ్రాభ్యుదయము, జాతీయ పునర్నిర్మాణములను గూర్చిన అనుభవ పూర్వకములైన వ్యాసములు, గ్రంథాలయ సంఘముల యొక్క నివేదికలు, వృత్తాంతములు, గ్రంథముల విమర్శనములు ఇందు ప్రకటింపఁబడును.

పటములు:—గ్రంథాలయ భవనములయు, గ్రంథాలయ సభలయు, గ్రంథాలయసేవకులయు, సంస్థలయు పటములు ఇందు ముద్రింపఁబడును. ఫొటోలుపంపువారు బ్లాకులఖర్చులు తామే భరింపవలెను. లేదా బ్లాకులుచేయించి పంపవలెను.

### హెచ్చరిక

ఈ పత్రిక ప్రతినెల ౫-వ తేదీని వెలువడును; కావున వ్యాసములను పంపువారు ఏ నెల పత్రికయందు అవి ప్రకటింపవలెనో దాని వెనుకటినెల 15-వ తేదీకి పూర్వమే పంపవలయును. పటములను వెనుకటినెల 1-వ తేదీకి పూర్వమే పంపవలయును.

### ప్రకటనముల రేట్లు

| | |
|---|---|
| ఒకసారి 1 పుటకు | రు 20-0-0 |
| ఒకసారి ½ పుటకు | రు 12-0-0 |
| ఒకసారి ¼ పుటకు | రు 6-0-0 |

వివరములకు:—

మేనేజరు, గ్రంథాలయసర్వస్వము, బెజవాడ.

# విషయసూచిక


| విషయము. | | పుట. |
|---|---|---|
| ౧. | ఈశ్వర ... ... | ౪౦౩ |
| ౨. | గ్రామావసరములేవి ? ... ... | ౪౦౪ |
| ౩. | నృత్తము - నృత్యము - నాట్యము ... ... | ౪౦౭ |
| ౪. | నూతనరాజ్యాంగశాసనము - ఇండియాప్రభుత్వము ... | ౪౦౯ |
| ౫. | పుట్టెడుపత్తి : పట్టెడుఅన్నము ... ... | ౪౧౧ |
| ౬. | ఎముకల పరిశ్రమ ... ... | ౪౧౨ |
| ౭. | విద్యాగంధము ... ... | ౪౧౩ |
| ౮. | ఆంధ్రదేశ గ్రంథాలయసంఘము - విజ్ఞాపనము ... | ౪౧౬ |
| ౯. | లోకవార్తాలహరి ... ... | ౪౧౯ |
| ౧౦. | ఖద్దరుసంస్థానము - గుణదల (ఆదర్శగ్రంథాలయ ప్రారంభోత్సవము) | ౪౨౧ |
| ౧౧. | గ్రంథాలయ వృత్తాంతములు ... ... | ౪౨౩ |
| ౧౨. | ౩వ పశ్చిమగోదావరిజిల్లాసభ - ... ...<br>౪వ భీమవరముతాలూకా గ్రంథాలయమహాసభ ... | ౪౨౬ |
| ౧౩. | భీమవరంతాలూకా గ్రంథాలయ సంఘసభ<br>గ్రంథాలయయాత్ర ... | ౪౨౭ |
| ౧౪. | దీవితాలూకా ద్వితీయ గ్రంథాలయమహాసభ ... | ౪౨౯ |
| ౧౫. | తాడేపల్లిగూడెంతాలూకా గ్రంథాలయసంఘము<br>(గ్రంథాలయయాత్ర, త్రైమాసిక నివేదిక) ... | ౪౩౦ |
| ౧౬. | తూర్పు కృష్ణాజిల్లా గ్రంథాలయమహాసభ ... | ౪౩౧ |
| ౧౭. | ప్రపంచపుగుట్టు ... ... | ౪౩౩ |
| ౧౮. | శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారికి సన్మానము ... | ౪౩౪ |
| ౧౯. | సంపాదకీయములు ... ... | ౪౩౫ |

# గ్రంథాలయసర్వస్వము తప్పక చదువుఁడు!

ఇది ఆంధ్రదేశగ్రంథాలయసంఘపక్షమున ప్రకటితమగు

## సచిత్రమాసపత్రిక!!

పుక్కిటిపురాణములుగాక గ్రామ పునర్నిర్మాణమునకు అవసరమగు అన్ని సమస్యలును ఇందు చర్చింపఁబడును. ప్రపంచపరిస్థితు లిందు వివరింపఁబడును. ప్రత్యక్షముగ పనిచేయుచున్న ఆదర్శ గ్రామముయొక్కయు, ఆదర్శ గ్రంథాలయము యొక్కయు పరిశోధనఫలితములు ఇందు ప్రకటితములగును. ఇవిగాక,

గ్రంథాలయశాస్త్రము,

నిరుద్యోగనివారణము,

మతములు - వర్ణములు - సాంఘికవిషయములు - సంస్కరణములు - జీవకారుణ్యము,

భాష - విజ్ఞానము,

వ్యవసాయము - పశువులు - ఎరువులు - చేతి పరిశ్రమలు,

వస్తుమార్పిడివిధానము - ధరలు - వర్తకవిధానములు - ఆహారపదార్థములు,

ఆరోగ్యము,

స్త్రీలయు - పిల్లలయు సమస్యలు,

ప్రపంచ సమస్యలు,

వేయేల? అన్ని తెలుఁగులవారును, ఇప్పటి పరిస్థితులలో విధిగా తెలిసికొని యుండవలసిన అనేకవిషయములు - ఇందు ప్రకటింపఁబడును.

గ్రంథాలయసర్వస్వమును చదువుఁడు! గ్రామసమస్యలను తెలిసికొనుఁడు! సందర్భములు తెలిసికొనక శాసనసభ్యులచేతమాత్రము మీ రేమిపనిచేయించుకొందురు?

---

భావకవిత్వానికి మార్గదర్శకుడైన

## రాయప్రోలు సుబ్బారావుగారి గ్రంథరాజములు

జడకుచ్చులు రు 1—0—0          స్వప్నకుమారము 0—4—0

ఒక్కొక్క ఖండకావ్యము ఒక్కొక్క చెఱుకుతునక.

చదివినకొలది చవులూరుచుండును. కొలదిప్రతులే కలవు

## ఆంధ్ర బుక్ డిపో,

ఆంధ్రగ్రంథాలయ ప్రెస్, బెజవాడ.

RSVM01A/65

# గ్రంథాలయసర్వస్వము.

సంపుటము ౧౦ | ఈశ్వర - చైత్రము - ఏప్రియల్ ౧౯౩౭ | సంచిక ౧౧

సంపాదకులు:
గాడిచెర్ల హరిసర్వోత్తమరావు, ఎం. ఏ.
మారేపల్లి రామచంద్రశాస్త్రి.
అయ్యంకి వేంకటరమణయ్య.

## ఈశ్వర

శ్రీ గాడిచెర్ల హరిసర్వోత్తమరావుగారు, ఎం. ఎ.

యంత్రయుగమను పేరిటి యమునిమూర్తి
వస్తుకల్పన యను మేటిపాశరాజి
కట్టి భ్రమయించి బుద్ధిని మట్టి గలిపి
మనుజు రాక్షసు గావించి మాయ పెంచి
రుద్రరూపము దాలిచి రోజుచుండు.

* * * *

ఒండొరుల జూచి రాష్ట్రము లోర్వలేవు
సేనలను మీరి సేనలు సిద్ధపడెడు
మందుగుండులకొండల మహిమ మించె
సహజప్రేమలు లోకాన సమసిచనియె
ప్రళయగర్జలు జగమున ప్రబలిపోయె.

* * * *

దేవదానవకోటులు తివిరి కడలి
ద్రచ్చగా బుట్టి లోకంబు దవిలి కాల్ప
సిద్ధపడినట్టి విషమును జేర్చి మ్రింగి
మేలుచేసిన ఈశ్వరుమేటిపేరు
ఈశ్వరాబ్దమ! తాల్చితి వీవు సరిగ.

* * * *

వరము కోరినతోడనే పరమమైత్రి
క్రిందుమీదులు చూడక క్రీడనిచ్చు
భక్తసులభుడు భవు డను ప్రీతనుడిని
పేరుకతమున నీవు నిల్పినను గాదె
సార్థకంబగు నీజన్మచరిత మెంతో!

* * * *

పండునీలిమ యాకసం బది
పెండ్లిపందిరి యాచు వెలయగ
అరుణతరుణిను సమరుచివురులు
నలరు తోరణపంక్తి పన్నగ
వెండివెలుగులు తారసంహతి
దండి దీపావళులు కాగా
మావిపండులు మధువు నమరిచి
మన్ననంబును జూపగా
క్రొత్తబెల్లము క్రొత్తబియ్యము
కూర్మిసేసలు గూర్చగా
పూతవేములు సౌరభంబులు
పొదవి జల్లులు జల్లగా
కుహూకుహూ యని కూడి పాటల
కొమ్మ కోయిలపిండు పిలువగ
కమ్మతెమ్మెర నీకు తోడై
నెమ్మి నీతో క్రుమ్మరన్
రమ్ము ఈశ్వర! రమ్ము రమ్మిక
చిమ్ము శుభముల భూస్థలిన్.

---

# గ్రామావసరము లేవి?

శ్రీ గా. హరిసర్వోత్తమరావుగారు, ఎం. ఏ.

గ్రామపునర్నిర్మాణ సమస్య నేటిదినము ఏకైక సమస్యగా నాలోచింపబడుచున్నది. కాని గ్రామావసరములు ఇట్టివియని గ్రహింపక ఈ సమస్యను పూర్తిజేయుట సాధ్యముకానిపని. ఆయా ప్రాంతములకు సంబంధించి గ్రామావసరములు కొంతవరకు మారుననుట నిజమేయైనను మొత్తముమీద అన్ని గ్రామములకును సమానమైన అవసరములను నిరూపించుట కష్టముకాదు.

## వైజ్ఞానికము

ఏకార్యమునకైనను దానికి సంబంధించిన విజ్ఞానమును సమకూర్చుకొనకపోయినయెడల సంఘజీవనము సాధ్యమే కాదు. మనదేశములో నేటిదినము గ్రామములు దుస్థితియందు ఉన్నవంటే కారణము ముఖ్యమైనది అజ్ఞానమే. ఏవిషయమున ఎప్పుడు ఏమి చేసికొనిన మేలు కలుగునో అభివృద్ధియందుండు ప్రజాసమూహములు ఎట్టి సందర్భమున ఏ విధముగా నడుచుకొని కార్యసాధన చేయుచున్నవో అను సంగతులు మనప్రజలకు తెలియుట మొదటి యవసరము. దీనికి ఆధారము గ్రంథాలయము అగును గాని వేరుగాదని చెప్పనక్కరే లేదు. ముఖ్యముగా అక్షరజ్ఞతలేని మన ప్రజలకు గ్రంథాలయము చేత సూచితము కావలసినది వట్టి గ్రంథ సామగ్రి మాత్రము కాదు. దాని సారమును ప్రజలకు అందజేయు సర్వప్రయత్నములును చేయునట్టి సంస్థ. ఈ కార్యమునందు అధికారము చెలాయించుటకు అవకాశములేదు. ద్రవ్యము కూర్చుకొనుటకు మార్గము లేదు. పేరు ప్రతిష్ఠలు అఖండముగా సంపాదించుటకును తోవ యుండదు. కృష్ణార్పణమని సేవచేయగల మానవులే ఈ కార్యమును పూనుట కర్హులు. అనుభవశాలురే దీనికి తగినవారు. కావున అస్తి సంపాదనఇచ్ఛలేని ప్రజాసేవకులును, ఆర్జన వదలి విరామము గడింపనెంచు ౪౫ఏండ్లకు పైబడిన పెద్దలును నియమితులగుట శ్రేయస్కరము.

ఇట్టివారు గ్రామనాయకత్వము పూనుకొనిన యెడల వీరే నిజముగా గ్రామమునకు శాసన సభగా నుపకరింప గలరు. వ్యవసాయము, వృత్తులు, విద్య, గ్రామరక్షణ, పాడి, ఆర్థికావసరములు ఇన్ని విషయములలోను. వీరు గ్రామములోని యువకులకు సలహాలిచ్చుచు శిక్షణ పెంచగలరు.

## పరిపాలన

ఏగ్రామపు పరిపాలన ఆగ్రామమునకే విశేషభాగము ఊరిపెద్దలచేతనే జరుపబడునేని బయటి ఉద్యోగస్థులకు గ్రామములోనికి ఎక్కువగా ప్రవేశముండదు. వారి యల జడియు నుండబోదు. ప్రజలు చిన్నచిన్న విషయములలో సైతము వ్యయ ప్రయాసల కోర్చి బయటికి పరుగులిడ వలసిన పని ఉండదు. కాబట్టే, సర్వపరిపాలనకును పంచాయతీపరిపాలన పునాదికావలెనని నేటి రాజకీయవేత్తలు అంగీకరించినారు. అందులోను దేశమున ప్రజాపరిపాలనా సౌధమును కట్టనెంచిన ఈదినములలో దానితత్వమునందు ప్రజలను సుశిక్షితులను జేయుటకు పంచాయతీవంటి మంచి ఉపకరణము ఇంకొకటి లేదు. ఇప్పటి పంచాయతీ అధికారములైన రోడ్లు దీపాలు ఆరోగ్యము వగైరా విషయములందే గాక గ్రామమునకు సంబంధించిన అడవి, నీటివసతి, ధర్మాదాయములు, బందెలదొడ్లు మొదలగు సర్వపరిపాలనవిషయములందును, పంచాయితీకి ప్రాతిపదికమైన అధికారము సంక్రమింపజేయవలయును. ప్రతి గ్రామమునకు లేక కొన్ని గ్రామముల చిన్నసమూహమునకు పంచాయతులు నిర్బంధముగా ఏర్పడి పనిచేసే యెడల నేడు జిల్లాబోర్డులను గురించి యితరశాఖలలోని అధికారులను గురించి కలిగే అసంతృప్తియు వారి వలన సంభవించే ఇక్కట్టులును తగ్గిపోవును. నిజముగా పనికిమాలిన ఎలెక్షన్లు ఎన్నిసంస్థలకో పెట్టి దేశమును చిందరవందర జేయుటకంటె పంచాయతు లేర్పరచి వాని ప్రతినిధులు పంచాయతీ భాగమునకే కాక ఫిర్కా జిల్లా కార్యములకు బాధ్యులగునట్లు చేయుట చాల ఉపయోగకరముగా నుండును. ఈ పంచాయతులైనను పన్నులు పెంచుటకు బదులు ప్రజలచేత సమష్టి కార్యములు చేయించుటకు మైసూరులో వలె అధికారము కలిగియుండుట మేలు. గ్రామ విద్యాలయము వీరి యాజమాన్యమున నుండి గ్రంథాలయమునకు దానికి సన్నిహిత సంబంధము కల్పించునెడల గ్రంథాలయ నిర్వాహకులే పంచాయతీ కార్యనిర్వహణకు సహాయకులు కావచ్చును.

## న్యాయవిచారణ

గ్రామములోని న్యాయవిచారణకు ప్రజలచే నెన్నుకొనబడు పంచాయతీదారులైనను పనికిరారు. అందులోను

ఇప్పటి విధముగా మూకలచేత చేతులెత్తించుకొని అధికారము నధిష్ఠించు బలవంతులు అనర్థములను కల్పింతురు. గ్రామములో జరుగవలసిన న్యాయము గ్రామములోనే తీర్చుట నేటి మహావ్యయములను నశింపుఁజేయగలదు. దానికి వాదిప్రతివాదులు ఫిర్యాది ముద్దాయిలు విశ్వాసముంచి ఏర్పరచుకొను పంచాయతీ దారులే విచారణకర్తలు కావలెను. ప్రతి గ్రామములోను అన్నిమతముల కులముల ప్రజలలోనుండి పెద్దమనుష్యుల జాబితాలను సిద్ధపరచియుంచి కేసు దాఖలు చేసికొనుటకు మాత్రము గ్రామమునసబును రిజిష్ట్రారుగా నేర్పరచి పార్టీ లేర్పరచుకొను పంచాయితుల చేత విచారణ జరిపించుటకు ఏర్పాటులు వెంటనే జరుగవలయును. ఒక పంచాయితీ పొరపాటు చేతనో న్యాయము జరుపలేదని ఏపార్టీకైనను తోచినయెడల రెండవ పంచాయితీ ఏర్పరచి అప్పీలు పెట్టుకొనుటకు అవకాశముండవలయును. అంతకుపైన వ్యవహారమునకు వీలుండరాదు. ఎట్టి వ్యవహారములను ఈ పంచాయితీలు తీర్చవచ్చునను విశేషవిషయమును శాసనముచే నిర్ణయింపనగును. ఇంతటికిని ప్రాతకాలపు పంచాయతుల చరిత్ర తగినంత మార్గమును చూపగలదు. పంచాయతీకి పైదర్జాకోర్టు గ్రామాలకు తిరిగి స్థానికంగా న్యాయవిచారణ చేసి తీర్పులిచ్చి పోవుచుండవలెనే గాని రైతు పదే పదే బయటియూళ్ళకు పోవుపని యుండరాదు.

## గ్రామబ్యాంక్

గ్రామములోని ప్రజలను నేడు పట్టి వేధించు మహాపిశాచము ఆర్థిక దురవస్థ. ఈ దురవస్థ మనలను పైకొనిన దానికి ఇతర కారణాలెన్ని ఉన్నా రెంటిని మాత్రము ప్రముఖంగా ఆలోచింపక తప్పదు. మొదటిది ప్రతివ్యవహారానికి చలామణీ నాణ్యాలలో జరగడం, పన్నుకు నాణ్యం, కోర్టు వ్యవహారాలకు నాణ్యం, గుడ్డకొనడానికి నాణ్యం, కొరముట్టుకు నాణ్యం, పశువుల మేతకు నాణ్యం, ఉప్పుకు నాణ్యం, దీపపు నూనెకు నాణ్యం, అది యిది యననేల ? కూర్చుంటె నాణ్యం. లేస్తె నాణ్యం. తాను పండించే వస్తువును నాణ్యంలోనికి మార్చేవరకు రైతుకు తల ప్రాణం తోకకు రావడం. ఆమార్పయ్యే టప్పటికి కలిగేనష్టాలు కంటికి కనుపించవు గాని రైతును సగానికి తక్కువలేకుండా మింగేస్తున్నాయి. కాబట్టి ఊరిబైటి వ్యవహారముమాట ఎట్లున్నా రైతు ఊరిలో వ్యవహారాలన్నిటికీ వస్తువునే మార్చుకునే అలవాటేర్పరచటము మొదట జరగవలసిన గ్రామార్థిక సంస్కారం. కొన్ని గ్రామాలలో ఇప్పటి కింకా రైతు కూలీలు ధాన్యరూపకంగానే యిస్తున్నాడు. కాని ఆ మాత్రం చాలదు. గ్రామంలో నమ్మకమైన బ్యాంకీ యేర్పడి ధాన్యాన్నో, నూలునో, పాలనో, పరిమాణంగా పెట్టుకొని తనచీటీలు నేటి బ్యాంకిఆఫ్ ఇంగ్లండుచీటీలవలెరిజర్వుబ్యాంకీచీటీలవలె చలామణీ చేసిబియ్యం, గుడ్డ, కర్ర, చెప్పులు ఇత్యాదులు పరస్పరం ఊళ్లో మార్చుకునే ఏర్పాట్లు చేస్తే రైతుకు సగము బెడద తప్పిపోతుంది. దీనితో గ్రామవాసి బయటికిపోయి వస్తువులు కొనే అలవాటు కూడ ఎంత తక్కువ చేసుకోవలెనో అంతతక్కువ చేసుకొనే మార్గంకూడా అవుతుంది. ఈబ్యాంకే కో ఆపరేటివు బ్యాంకీగాకూడా ఏర్పడి రైతు వస్తువులను సమిష్టిమీద నిలవబెట్టుకోడానికి సరియైన గిరాకివచ్చేవరకు ఆగడానికి లాభాలకు అమ్ముకోడానికి సమిష్టిమీద అవసరమని తోచినయెడల క్రొత్తమార్గాలలోవ్యవసాయం చేయడానికి, భోజనముసదుపాయము మాత్రము మించని రైతు అప్పు పూర్తిగా తుడిచివేస్తూ మిగతవారు ౨౮ మొదలు ౬౦ సంవత్సరాలమీద కొద్దివడ్డీతో వీలైతే వస్తురూపకంగానే కిస్తీలిచ్చి ఉన్నఅప్పులు తీర్చుకోడానికి కాల మనుకూలమైనప్పుడు పన్నుకిస్తీలుకూడ ధాన్యాదిక రూపకంగా కట్టడానికి తోడ్పడితే మహోపకార మౌతుంది. ఊరిలోని వృత్తులయొక్కయు వృత్తివిద్యలయొక్కయు అభివృద్ధికి సర్కారు చేసే సహాయపు మొత్తములను నిజానికి సర్వ పబ్లికువ్యవహారాలకు వచ్చే సొమ్మంతా నిలవఉంచుకొని గ్రామాధికారులు అనగా పంచాయతీ, పాఠశాల, దేవాలయము, గ్రంథాలయము, పరిపాలన ఇత్యాదిసంస్థలు జరిపే అధికారులు, నియమాలప్రకారము కోరినప్పుడు ఇచ్చి పుచ్చుకోలు జరుపడానికి కూడ ఈ బ్యాంకు సిద్ధము కావలె.

## క్రొత్త ప్రభుత్వమువారికి గుణదల ఖద్దరు సంస్థానంవారు చేయు సలహాలు

ఈసర్వవిషయములకు సంబంధించినవి ఈక్రింద నిచ్చుచున్నాను. పైనవ్రాసిన గ్రామజీవితావసరములను దీర్చుటలో ఈసలహాలు చక్కగా నాలోచింపదగినవి యని యెవ్వరైనను అంగీకరింపక తప్పదు.

వచ్చిన అధికారంతో ఉన్నసొమ్మునుబట్టి ప్రజలకు తోడ్పడుటకు మూడుసంవత్సరముల కార్యక్రమముగా దీనిని భావించవలెను.

1. ప్రతిగ్రామములోను ఒక గ్రామసంఘము ఏర్పరచవలెను. ౧౮ సంవత్సరముల వయస్సుకు మించి ఆర్జన

వదలిన వారికిన్ని ఆస్తిసంపాదనేచ్ఛలేక ప్రజాసేవచేయు వారికిన్ని ఆసంఘములో ప్రజల ఎన్నికద్వారా ప్రాతినిధ్యము కలుగచేయవలెను. వారిసలహాతో గ్రామ వ్యవసాయం, వృత్తులు, విద్య, రక్షణ, పాడి, శిస్తువసూళ్లు, వివాదపంచాయితీలు, పొలిమేరలు, చెట్లు, గ్రామమార్గములకును సంబంధించిన పనులు నడుచునట్లు చూడవలెను. ఇట్టి సంఘములను క్రమముగా నడుపుటకు పై అర్హతను తగ్గని వారి ప్రాతినిధ్యముతో కూడిన ఫిర్కా, తాలూకా, జిల్లా సంఘములు యేర్పాటు చేయవలెను. ఈవిధానముక్రింద ప్రత్యక్షముగా పనిచేయువారలకు గ్రామజీవితమును గుర్తించి వేతనములు యేర్పరచవలెను. ఇందుకు ఖద్దరు సంస్థాన కార్యక్రమము పునాదిగా వేయవలెను.

2. పైవిధానము అమలులో పెట్టుటకు గ్రామసేవకులను తయారు చేయుటకు ఆశ్రమములకు సంస్థలకు ప్రోత్సాహమిచ్చి వారి తోడ్పాటుతో ప్రజలలో ఉచిత ప్రాథమికవిద్య ప్రారంభించవలెను. ఈ ఉద్యమము సాధ్యమగునంతవరకు స్వయంపోషణతో వృద్ధి అగుటకు ప్రోత్సాహపరచవలెను.

3. దేశీయులను ప్రోత్సాహపరచి దేవాలయములు సత్రములు ఉత్పత్తి అగుచున్నట్లే ఆరోగ్యముకొరకు ఆసుపత్రుల నిర్మాణమునకు ప్రయత్నించవలెను.

4. గ్రామ - పట్టణ - తాలూకా - ఫిర్కా - జిల్లాల వారీగా - శాంతిసేనానిర్మాణము ఏర్పాటు చేయవలెను. గ్రామాదులలో వీటి కేంద్రములు పెట్టవలెను.

5. మద్యపాన అదా, పూర్తిగా వదలివేయవలెను. హైస్కూళ్ళు - కాలేజీలు ఎత్తివేయించవలెను. అర్హత గమనించి ప్రభుత్వ ఆదరణక్రింద ఉన్నతవిద్య యిప్పించవలెను.

6. ప్రస్తుత శివిల్ కోర్టులు ఎత్తివేయించవలెను. గ్రామ - ఫిర్కా - తాలూకా - పంచాయితీల మీద నుంచి వచ్చే అప్పీళ్ళున్నూ ప్రత్యేక రకము కేసులున్నూ విచారించుటకు ప్రయాణంచేయు కోర్టులు యేర్పాటు చేయవలెను.

7. ప్రభుత్వరాబడిలోనుంచిమునిసిపాలిటీలకు కార్పొరేషనులకు యేవిధమగు ద్రవ్యము నీయరాదు.

8. గ్రామాదులలో పశుపోషణకు వుంచుబీళ్ళకుశిస్తులు తగ్గించవలెను. ప్రజోపయోగమునకు ఏర్పడు ఆస్తులకు పన్నులు తీసివేయవలెను. బావులను - చెరువులను త్రవ్వించుటకు ప్రోత్సాహము ఇవ్వవలెను.

9. గ్రామాదులలో వసూలుచేయు శిస్తుకు సరిపోవు మొత్తమునకు - పాలు - వడుకునూలు - పరిశ్రమలద్వారా సొమ్ముదిగుమతి అగు విధానము పెంపొందవలెను.

10. గ్రామావసరములు గమనించకుండా పండించు పంటలమీద రుసుములు వేయుటకు గ్రామ సంఘములకు అధికారం యివ్వవలెను.

11. దేశములో సరుకులు - గ్రామస్థులు - రాకపోకలను నావిగేషన్ అజమాయిషీ తీసుకోవలెను.

12. వస్తుమార్పుడి విధానము అమలులోకి తేవలెను. లోకల్ సర్వీసులన్ని వస్తుమార్పిడిద్వారా జరుగవలెను. వస్తుమార్పిడివిధానముక్రింద బ్యాంకులు - యిన్‌ష్యూరెన్సులు - సహకారసంఘములు - యేర్పడుటకు కృషి చేయవలెను. ఈబ్యాంకులు మొదలగు వాటిద్వారా - రయితులు - వర్తకులు - సరుకులు స్తంభింప చేయకుండా సర్క్యులేషన్‌లోకి వచ్చులాగు చేయవలెను.

13. ఏసంఘ సంస్కరణకయినా గ్రామసంఘములు అభిప్రాయము కోరుతుండవలెను. అవి తెలుసుకోకుండా ఏశాసనములు ప్రవేశపెట్టరాదు.

14. హరిజన పల్లెలను గ్రామములుగా మార్చవలెను. సవర్ణులు యితర మతములవారు హరిజనపల్లెలలో కాపురముండునట్టు చేయవలెను. హరిజనులు విడదీయబడి గూడెములుగా వుండు పద్ధతి రూపుమాపవలెను.

15. ఫిర్కాసంతలు యేర్పరచి నడిపించవలెను. కొమారునకు తప్ప మిగతా యెవరికి సంక్రమించినను ఆస్తులమీద Death duty వసూలుచేయవలెను.

16. కొత్తచట్టముద్వారా రక్షణపొందిన దేశీయపెద్ద ఉద్యోగస్థులకు భూములుగాగాని లేక బాండ్లద్వారాగాని కంపెనీలలో షేర్లద్వారాగాని Compensation ఇచ్చి వారి జీతములను తగ్గించుటకు ప్రయత్నించవలెను. ప్రకటనలు చేయవలెను.

17 ప్రస్తుతచట్టము ప్రకారం ఎదుర్కొనవలసిన క్లిష్ట పరిస్థితులు ప్రజలకు బోధించవలెను. కొత్తపన్నులు వేయకుండా ఆరోగ్యముసహా అన్ని ప్రజాసౌకర్యములు అక్కడకక్కడ తమంతటతామే చేసికొనవలసిన ఆవశ్యకతను గుర్తింపచేయవలెను. ఈ సదుపాయములు జరుగవలెనన్న ప్రజలను పీల్చివేయుచున్న విద్యావిధానము, కోర్టులు, మద్యపానము రూపుమాపవలెను.

18. ప్రజల సహకారముతో పై సూచనలద్వారా ఉత్పత్తిఅగు అన్నిసంస్థలు క్రమముగా వర్ధిల్లుటకు చేయుదగు అన్నిశాసనములు చేయించి అవి క్రమముగా అమలు జరిపించవలెను.

# నృత్తము - నృత్యము - నాట్యము

శ్రీ పింగళి లక్ష్మీకాంతముగారు, ఎం. ఏ.
(ఆంధ్రవిశ్వకళాపరిషత్కళాశాల - వాల్తేరు.)

ధార్వాడ కంపెనీవారు మనరాష్ట్రమునకు రాక పూర్వము మనకు దేశినాటకములైన యక్షగానములేకాని, మార్గనాటకములు లేవు. ఆయక్షగానముల పరిణామమే యీ నాటకములనికాని, వానికళ మంతరించినపిమ్మటనే వీని యావిర్భావమయ్యెననికాని తలపరాదు. ఆంధ్ర వాఙ్మయమున 'దేశి' 'మార్గ' యనెడి రెండు భిన్న శాఖలు కలవు. ఆరెండిటికిని ఒక్కొక్కయెడ కొంచెముగా అన్యోన్యగుణసంక్రమణ ముండిన నుండునుగాని జన్యజనకసంబంధముమాత్రము బొత్తుగా లేదు. ఆరెంటిలో దేశిశాఖకు చెందినది యక్షగానము; మార్గసరణికి జెందినది మననాటకము. నాట్యమనెడి సాధర్మ్యము తప్ప, రెంటికిని చాల భేద మున్నది. రచనయందును, ప్రదర్శనమునందును దానిప్రక్రియ వేరు; దీని ప్రక్రియ వేరు. కావున నవి వీనికి మాతృకలు కావు. అదియునుగాక ఆయక్షగానము లిప్పటికిని తమదారిని తాము సంచరించుచునేయున్నవి; కాని యంతరించిపోలేదు. మార్గకవిత్వమైన ప్రబంధముతోడి పోటీకి తాళజాలనంత మాత్రమున, దేశికవిత్వమైన పలనాటివీరచరిత్ర యస్తమించిపోవునా? కేవలప్రబంధపఠనమే చేసెడివారు పలనాటిపదములను విననొల్లకున్నను,పిచ్చుకుంటులచే దానిని పాడించి విని మైమరచిపోవు ప్రజలు పల్లెలలో ననేకు లున్నారు. అట్లే దేశినాటకములుచూచి యానందించుజనులును బహుసంఖ్యాకు లున్నారు. ఆజనులు వలదనుదనుక యక్షగానములు జీవించియుండును.

* * * *

సాహిత్యాంగముగా యక్షగానమును పరామర్శింతుమేని దాని చరిత్రలో నెన్నోదశలు గడచినవి; ఎన్నోమార్పులు జరిగినవి; ఎన్నో ప్రక్రియలు పుట్టినవి. ఆ విషయ మియ్యెడ నప్రస్తుతము కావున ప్రసంగింపను. నాట్యవస్తువుగా పరికించినప్పుడు మాత్రము దానిగుణము కొంతయైనను వివరించుట ప్రస్తుతమే యగును గాన మనవిచేసెదను.

నృత్తము, నృత్యము, నాట్యము - అనెడి మూడు పదములను సాధారణముగా లోకము సమానార్థములుగానే వాడుచుండును. అది పొరపాటు. ఈ మూడును పర్యాయపదములుకావు. ఇవి నిరూపించెడి యర్థములయందు సామ్యము కంటె భేదభావమే యెక్కువ కలదు. అయినను ఈ భిన్నార్థములు నాటకప్రదర్శనమున మిశ్రీభూతమై ప్రయోగింపబడుట ప్రాచీనమైన యాచారము. వీనిలో నృత్తము తక్కిన రెండింటికంటె ముందు పుట్టినది. తరువాత నృత్య నాట్యములు వెలసినవి.

శరీరావయవవిక్షేపమును లయాన్వితముచేయ నెంచిన ప్రాక్తన మానవుడు మొట్టమొదట సృష్టించుకొన్నకళ నృత్తము. ఏపటహవాద్యమో నెరపుచు తత్తాళమునకు ననుగుణముగాలయశుద్ధి యొప్పునట్లు ఆతడు చూపిన పాదన్యాసమే నృత్తమునకు ప్రారంభదశ. క్రమముగా దానిని అన్ని తాళములకును అన్నికాలములకును అనురూపముగా ప్రపంచించి పెంపుచేయవలెనని యాతడు యత్నించెను. ఎంతయత్నించినను పాదన్యాసము

తాళమును తుదముట్ట ననుగమింపలేదు. హస్తనాడులకుగల లాఘవము పాదనాడులకు నుండదు గనుక హస్తముతో వేయు తాళగతుల నన్నిటిని పాదముతో చేయు నృత్తగతులన్నియు ననుసరింపలేవు. కనుక నృత్తవిద్య తాళముతో కొంతదూరమే నడచినది. నృత్తము చేయునపుడు పూర్వాపరకాయములకు సమతకుదురుటకై వేరొకదశలో పాదవిక్షేపమునకు హస్తవిక్షేపము తోడైనది. ప్రారంభదశలోగాని యీదశలోగాని నృత్తమునకు శబ్దముతోడి సంబంధ మించుకయులేదు. అనగా నృత్తముచేయునప్పుడు తాళమే యపేక్షింపబడునుగాని గీతమపేక్షింపబడదు.

ఈగాత్రవిక్షేపవిద్య తాళ లయాన్వితముగా నుండుటయేకాక శబ్దార్థ సూచకముగా కూడ నుండవలెననెడియాశతో మానవుడు కల్పించిన ప్రక్రియాంతరము నృత్యము. నోటితో గీతము పాడుచు అందలి శబ్దములయర్థమును చేతితో ప్రదర్శించుట దాని ప్రధానాశయము. ఆపాడెడి గీతము తాళబద్ధముగా నుండునుగనుక తాళమునకు తగినట్లు కాలితో నృత్తముచేయుట దానికొక యంగము. కావుననే నృత్యమునందు అర్థసూచకమైన హస్తన్యాసమేకాక యొక్కొక్కయెడ తాళాశ్రయమైన నృత్తముకూడ ప్రకటితమగుచున్నది. కృష్ణలీలాతరంగ నృత్యమును చూచినపుడు మన కిది తార్కాణ యగును. నృత్యము, నృత్తముకంటె గుణాధికమై, శాస్త్రనిబద్ధమైనది. అందుచేతనే దానిని 'మార్గ' యనియు, నృత్తమును 'దేశి'యనియు ఆలంకారికులు పేర్కొనిరి. గీతి పాడకయే యర్థవంతముగా నృత్యము సల్పుట తరువాత క్రమముగా కలిగిన పెంపులలో నొకవిశేషము. భారతీయ నృత్యమునకు విజయపతాకగా నేడు ఖండాంతరముల సంచరించుచున్న ఉదయశంకరునినృత్యమే ఈవాక్యమునకు దృష్టాంతము. మిశ్రకళలలోని యంగకళలకు నెంతసామరస్యమున్నదో, యంత స్పర్ధయున్నది. సంగీతమునకు శబ్దసాహచర్యము లేకున్నను లోటులేదని చూపుటకే జంత్రగానము పుట్టినది. అట్లే కవివాక్యరచన లేకున్నను నాట్యము నిల్వగలదని చూపుటకే కథాకళి వంటి మూకాభినయము యత్నించినది.

మరికొంతకాలమునకు నృత్యమున శబ్దార్థమునేకాక భావాశ్రయమైనవాక్యార్థమునుసయితము ప్రదర్శింపవలెనని మానవు డింకొక సంస్కారము చేసెను. తత్ఫలముగా గాత్రవిక్షేపవిద్య కొంత యవస్థానుకృతియై, అభినయమను పేరు తాల్చినది. క్షేత్రయపదములు, జావళీలు లోనగునవి ప్రదర్శితము లగునప్పుడు దాని స్వరూపమును ప్రత్యక్షముగా చూడగలము.

ఈ యభినయమునకు మీదిమెట్టే నాట్యము. రెండిటికిని గల సన్నిహితత్వమునుబట్టియే అభినయశబ్దము నాట్యపరముగా సయిత ముపయోగింపబడినది. వ్యస్తములైన పదములను, జావళీలను మాత్రమేకాక నిబద్ధకావ్యములయిననాటకములనుగూడ ప్రదర్శించుటవలన అభినయము నాట్యమైనది. కాగా, భావగీతమువంటిది పదములయభినయము; ప్రబంధమువంటిది నాట్యము.

# నూతన రాజ్యాంగ శాసనము – ఇండియా ప్రభుత్వము

శ్రీ గా. హరిసర్వోత్తమరావుగారు, ఎం. ఏ.

పరిపాలనవిశేషములను బట్టి ఇండియాదేశము ఇదివరలో రెండుభాగములుగా ఆలోచింపదగియుండినది. బ్రిటిషుభాగము, భారతీయసంస్థానములు. బ్రిటిషుభాగపు పరిపాలనకూడ బ్రిటనుదేశపు రాజ్యాంగచరిత్రలో ముడిపెట్టబడియుండినది. కంపినీప్రభుత్వమునాడు సంక్రమించిన వేరువేరు రాజకీయాధికారములతోసహా గవర్నరుజనరలు, గవర్నరులు, బ్రిటిషుపార్లమెంటుకు లోబడియిచ్చట రాజ్యమేలుచుండినారు. ఈ నెలమొదటితేదీవరకు ప్రచారమందుండి యిప్పుడు అంతరించిన ద్వంద్వప్రభుత్వము గవర్నరు జనరలు, ఇండియాకార్యదర్శి మొదలగువారు వేరువేరుగా సంక్రమింపజేసిన అధికారములను చలామణిచేయుచుండినది.

* * * *

నేడు ఈ పరిస్థితి పూర్తిగా మారినది. ఇప్పుడేర్పడియుండు రాష్ట్రప్రభుత్వములును ఇండియాప్రభుత్వమును ఒండొంటినుండి తమకు సంక్రమించిన అధికారములమీద ఆధారపడలేదు. నూతనరాజ్యాంగశాసనము ఇదివరలో నుండిన సర్వాధికారములను రద్దుచేసి, ఇండియారాజ్యమును పూర్ణముగా ఇంగ్లీషురాజునకు స్వాధీనముజేసినది. ఇంగ్లీషురాజనగా వట్టి జార్జిప్రభువని మాత్రమే కాదు. అతడును ఇంగ్లండులోని పార్లమెంటులును రాజశబ్దముచే సూచితములు. ఈ రాజువద్దనుండి ప్రత్యక్షముగా విడివిడిగా ఇండియాప్రభుత్వమువారును, రాష్ట్రప్రభుత్వములవారును, తుదకు స్వదేశసంస్థానాధీశ్వరులును, తమ తమ అధికారములను ఈ నూతనశాసనముల చేత సంపాదించువారగుచున్నారు. స్వదేశసంస్థానాధీశ్వరుల విషయములో మాత్రము ఇంగ్లీషురాజు ఇదివరలో ఏర్పడిన సమాధానములు సంధులు సన్నదులను గౌరవింపగలడు. ఇండియాలోని బ్రిటిషు ప్రాంతములకు సంబంధించిన క్రొత్తరాజ్యాంగశాసనమును అమలులోపెట్టగలడు. ఇది మొదటి భేదము.

* * * *

ఇదివరలో స్వదేశ సంస్థానములకును బ్రిటిషుప్రాంతీయ ప్రభుత్వములకును ఏవిధమైన సంబంధమును ఉండలేదు. వీరికి సమష్టికార్యక్రమమును ఏర్పడియుండలేదు. ఇప్పుడు ఇండియాప్రభుత్వము బ్రిటిషు భాగమునకు చెందినది మాత్రమేకాక స్వదేశ సంస్థానములనుగూడ చేర్చుకొనుట కేర్పడినది. సంస్థానాధీశ్వరులు తమంతట తామే ఈసంయోగములోనికివచ్చి చేరుదురని సిద్ధాంతము. వారికిగాను బ్రిటిషుప్రభుత్వమువారు కౌన్సిల్ ఆఫ్ స్టేటు అనబడు ఇండియా శాసనసభలలోని శిష్టసభలో ఏర్పరచిన ౧౦౪ స్థానములలో ౫౨ స్థానములకుసరిపోవునన్ని సంస్థానములు అంగీకరించి ఆట్టి సంస్థానముల ప్రజల మొత్తము ఇండియా సంస్థాన ప్రజలలో సగమువంతుగా నున్ననే ఇండియా సంయోగ ప్రభుత్వము ఏర్పడవలసినదని నిర్ణయించినారు. సంస్థానాధీశ్వరుల అంగీకారమును సూచించుటకు వారు ఇన్‌స్ట్రుమెంటు ఆఫ్ ఆక్సెషన్ అను ధ్రువపత్రమును వ్రాసి యియ్యవలసి యుందురు. తమతమ రాజ్యశక్తులు నశింపకుండునట్లు షరతులు కోరుకొనుటకు వారి కవకాశములున్నవి. వారి ప్రజలకును ఈయంగీకారమునకును సంబంధములేదు. ప్రతినిధులను ఏర్పరచి పంపుటయందును వారిప్రజలకేవిధమైన జోక్యమునులేదు. వారంగీకరించినంతవరకే తమ చట్టములను ఆ యా సంస్థానములలో అమలునందుంచుటకు ఈ సంయోగ ప్రభుత్వమువారికి అవకాశమున్నదిగాని ఇతరత్ర వారి రాజ్యపరిపాలనలో జోక్యము కలిగించుకొనుటకు వీలులేదు.

* * * *

ఇంతటి సంయుక్తరాష్ట్ర నిర్మాణమును తలపెట్టిన యీ క్రొత్తశాసనము స్వదేశ సంస్థానాధీశ్వరులను ప్రత్యేకపరచి వారిపై యాజమాన్యమును ఇంగ్లీషురాజునకు నిర్ణయించినది. అతడు వారియెడల తనకుగల అధికారమును నడుపుకొనుటకు ఇండియా రాజ్యాంగ నిర్వహణాధికారియగు గవర్నరుజనరలునుకాక వేరొక ప్రతినిధిని నియమింపవచ్చును. లేదా, గవర్నరు జనరలునే ఆ యధికారమును నడుపుటకుగూడ నిర్ణయించుకొనవచ్చును. సామాన్యముగా ఈ రెండు పదవులును ఒకే పురుషునకే చెంది యుండగలవనియే విశ్వాసము.

* * * *

ఇంగ్లీషురాజు ఇండియాదేశపు సర్వసైన్యాధిపతిని నియమించగలడు. రాజుఉత్తరువునకు లోబడి భూ నావికా ఆకాశ సైన్యవిషయములను విదేశసంబంధవిషయములను, ఎక్లిసియాసిటికల్ అనగా యూరోపియనునౌకర్లకు చెందిన మతవిషయక సందర్భములను, స్వదేశసంస్థానముల సంబంధములను, గవర్నరుజనరలు - రాజప్రతినిధి- శాసనసభ

లతో సంబంధము లేకుండ నిర్వహింపగలడు. గవర్నరుజనరలుగారికి ఇంగ్లీషురాజు జారీచేసిన ఇన్‌స్ట్రుమెంటు ఆఫ్ ఇన్‌స్ట్రక్షన్స్ ననుసరించి సైన్యవిషయకమైన ఖర్చుల పట్టీ తయారుచేయునప్పుడు అతఁడు ఆర్థికశాఖతో ముఖ్యముగా ఆర్థికమంత్రితో సంప్రతింపవలసినదని యున్నది. భారతీయసైన్యములకు అధికారులుగా హైందవులను నియమించువిషయములను భారతదేశపు సైన్యములను బయట వినియోగించునపుడును మంత్రుల అభిప్రాయములను గవర్నర్‌జనరలు మనసులోఁ బెట్టుకొని పనిచేయదగుననియు వ్రాసినారు.

* * * *

తక్కిన అన్నిడిపార్టుమెంటులలోను తుదిపరిపాలనాధికారము గవర్నరు జనరులదే అయినను, ఉద్యోగస్థులను నియమించుటలోను తీసివేయుటలోను సర్వాధికారమును అతనికే చెందియున్నను వాని పరిపాలన నడుపునపుడు శాసనసభలలోని మంత్రివర్గముతోకూడ అతడు కార్యక్రమము నిర్వహింపవలసి యుండును. కాని యిదివరలో గవర్నరునుగురించు వ్రాయునపుడు అతనికిగలదని సూచించిన సర్వాధికారమును గవర్నరు జనరల్ విషయమునను సూచింపదగియున్నది. అతనికి కలయట్లే యితనికిని ప్రత్యేకపు జవాబుదారీలున్నవి. అతనికంటె ఒక్కజవాబుదారీ ఇతనికి ఎక్కువగా కలదు. భారతదేశపుపరపతిని ఇతడు నిలువబెట్టుట ఇతనికి ప్రత్యేకమైన జవాబుదారి. అందుకని యితడు ఇతరాధికారులను నియమించుటతోపాటు ఆర్థికపు సలహాదారునొకనిని నియమించుకొనవచ్చును. మంత్రివర్గమును నిర్ణయించుటలోను గవర్నరుకువలె ఇతనికిని పూర్ణాధికారముగలదు. మెజారిటీ పార్టీనాయకునే ముఖ్యమంత్రిత్వమునకు పిలువవలెనని నియమము లేదని స్థాయిగా మంత్రివర్గములు ఏర్పరుచుకొనగలిగినట్టియు మొత్తముమీద శాసనసభ్యుల ఆమోదముపొందునట్టియు శక్తికలవాడని ఎవడు తనకు తోచునో వానిని ఇతడు సన్మానించి మంత్రివర్గమునిర్మాణమునకు నియమింపవచ్చును. మంత్రివర్గములో స్వదేశ సంస్థాన ప్రతినిధులును అల్పసంఘుప్రతినిధులును ఉండునట్లు చూచుకొనవలెనట. మంత్రివర్గములోని వారందరును సమిష్టిబాధ్యతను అంగీకరించినట్లు చూడవలెనట.

* * * *

గవర్నరు జనరల్‌నకు పరిపాలనయందు సలహానిచ్చు మంత్రివర్గమునకు ఆధారభూతమై శాసననిర్మాణము చేయునట్టి సభలు రెండుండగలవు. ఒకదానికి కౌన్సిల్ ఆఫ్ స్టేట్సుఅనిపేరు. దీనినే శిష్టసభయనవచ్చును. రెండవదానికి ఫెడరల్ అసెంబ్లీ అనిపేరు. దీనిని ప్రజాప్రతినిధిసభయనవచ్చును. శిష్టసభలో రెండువందల అరువదిమంది సభ్యులుందురు. అందులో ౧౫౦ మంది బ్రిటిష్ యిండియా ప్రతినిధులు. ౧౦౪ గురు సంస్థానముల ప్రతినిధులు. ౬ గురిని గవర్నరు జనరల్ తన యిష్టానుసారము పేర్కొనును. వారి ప్రత్యేకపు సలహాదారులును శిష్టసభ ప్రజాప్రతినిధి సభలలో అధికారరీత్యా ఓటులేని సభ్యులుగానుందురు. ప్రజాప్రతినిధిసభలో ౩౭౫ మంది సభ్యులుందురు. అందు ౨౫౦ మంది బ్రిటిష్ ఇండియా ప్రతినిధులను ౧౨౫ మంది స్వదేశ సంస్థానాధీశ్వరులను నియమింతురు. శిష్టసభకు ప్రజలలోనుండి హెచ్చు అర్హతలుగల ఎన్నికవర్గము లేర్పడును. ప్రజాప్రతినిధిసభకు ఎన్నికలు పరోక్షమైన ఎన్నికలు. రాష్ట్రీయ శాసనసభలలోని సభ్యులు ఆయావర్గములవారు ఈ సభలోని ఆయావర్గములకు ప్రతినిధులను నిర్వాచింతురు.

* * * *

శాసనసభలనుండి నిర్ణయింపబడు మంత్రులు, గవర్నర్‌జనరలుకు ప్రత్యేకింపబడిన శాఖలుదప్ప మిగిలిన శాఖల పరిపాలనయందు అతని సలహాదారులుగా నుందురు కాని అందులోను వీరియధికారమును పంచుకొనుటకు రెండు క్రొత్తసంస్థలేర్పడినవి. రిజర్వుబ్యాంకుఆఫ్ యిండియాఅను సంస్థ నోట్లుజారీచేయుటకును, సరాఖ్కు అప్పులు వగైరాలను తీసికొని నిర్వహించుటకును, నాణెముల చెలామణీని నడుపుటకును నియమితమైనది. దీని కార్యనిర్వాహకవర్గమునందుకల ౧౫ గురు సభ్యులలో ఒక అధ్యక్షుఁడు, ఇద్దరు ఉపాధ్యక్షులతోగూడ ౩గురి నేర్పరచే అధికారము గవర్నర్‌జనరలుకు చెందినది. ఈవిషయములకు సంబంధించిన యేచట్టములను పెట్టదలచినను మొదట అతని అనుమతి పొందవలసియున్నది. ఇదికాక స్టాట్యుటరీ రైల్వే ఆథారిటీ యని మరియొక సంస్థ రైల్వేలకు సంబంధించిన సర్వకార్యములను నిర్వహించుటకు నిర్దేశింపబడినది. ఈ సంస్థలో ౭౩ గురు సభ్యులుందురు. ముగ్గురికి తక్కువగాకుండ గవర్నరు జనరలే వీరిని పేర్కొనును - అనగా ౩/౭గురినికూడ అతడు పేర్కొనవచ్చును. ఈసంస్థయొక్క ముఖ్యకార్యకర్తయైన చీఫ్‌రైల్వే కమిషనర్‌ను అతనికి సహాయకుడైన ఫినాన్షనర్ అనగా ఆర్థిక కమీషనరును ఇతర కమీషనర్లను గవర్నరు జనరలే నియమించును.

* * * *

ఈ చెక్కుబందీలకు లోనై ఇండియా ప్రభుత్వమును పోస్టు టెలిగ్రాఫుసుంకములు ఉప్పు వగైరా అన్నివిషయములను ఇండియా శాసనసభలవారు మంత్రులద్వారా ఏలగలరని శాస్త్రనిర్వచనము; కాని రాష్ట్రప్రభుత్వప్రచలామణిలోను శాసన నిర్మాణములోను గవర్నరునకు ఎన్ని ఎన్ని ప్రత్యేకాధికారములున్నవో ఇండియాప్రభుత్వములో గవర్నరుజనరలుకు అన్ని ప్రత్యేకాధికారములున్నవి. ఎనుబదిసందర్భములలో క్రమమార్గమువదలి తన యిష్టప్రకారము నడచుకొనుటకు గవర్నరుజనరలునకు ఈ శాసనమవకాశమిచ్చుచున్నదని రాంకీలర్ ప్రభువు కామన్సు సభలో విమర్శనసందర్భమున నుడివినాడనిన అతనినిరంకుశాధికార స్వరూపము తేటపడగలదు. జనవరిమాసమున 'గవర్నరు అధికారములు' అను శీర్షికక్రింద వ్రాసిన అన్నియధికారములును గవర్నరుజనరలుకు ఇండియా ప్రభుత్వమునందును ఇండియా శాసననిర్మాణసభలయెడలను కలవు. అందులో గవర్నరు అని వచ్చేచోట అంతటను గవర్నరుజనరలు అనేపదము ఉంచుతూ గవర్నరుజనరలు అని వచ్చేచోట ఇంగ్లీషురాజు అనే పదములు ఉంచుతూ చదివితే రమారమిగా సరిపోతుంది.

*　　*　　*　　*

# పుట్టెడుప్రత్తి : పట్టెడుఅన్నము

## శ్రీ గో. సీతారామశాస్త్రిగారు

పుట్టెడుప్రత్తిలో పట్టెడు అన్న మెంతయో కనుగొనవలెను. పుట్టెడు ప్రత్తిఖరీదు ౪౦, ౪౨ రూపాయలు. దానిలోనిగింజలు తీయుటకు షుమారు ౪ రూపాయలగును. ఆ గింజలు ౧౫ మణుగులగును. మిగిలిన ౫ మణుగులు దూది. దానిని చక్కగా, వృత్తివంతులగు దూదేకులవారిచేతగాక, స్వావలంబులచేత ఏకించి, ఏకులు తయారుచేయుటకు ౧౨, ౧౫ రూపాయిలగును. ఆ యేకులను నూలుగా వడుకుటకు ౧౧౦, ౧౧౫ రూపాయలగును. దానితో ఖాదిగుడ్డ నేయుటకు ౭౫ రూపాయలగును. అనగా ప్రత్తి ఖద్దరు అగునప్పటికి ౨౦౯ రూపాయలు మజూరి క్రింద వ్యయమగును.

పుట్టెడువడ్లు దంపించుటకు ౫ రూపాయలు మాత్రమగును. కాన పుట్టెడువడ్లు పండించువానికన్న పుట్టెడుప్రత్తిపండించువాడు కార్మికునకు కాయకష్టముచేయ నేర్చినవానికి హెచ్చు పనిని కలిగించును. హెచ్చుకాలము వృత్తినిచ్చును; హెచ్చుద్రవ్యమిచ్చును; హెచ్చు అన్నమిడును.

పుట్టెడువడ్లు దంపుటకు ఇద్దరు మనుష్యులకు ౧౩ రోజులు పట్టును. రోజుకు తలకొక ౦-౩-౦ గిట్టును.

ప్రత్తిని పరిణమించుటకు ఇద్దరికి ౪౬౬ రోజులు పట్టును. గింజలుతీసినవారికి రోజుకు ౦-౩-౦ లున్ను ఏకినవానికి ౦-౩-౦ లున్ను, వడికినవారికి ౦-౨-౬ యున్ను నేసినవానికిని ౦-౧౨-౬ యున్ను గిట్టును. రెండుప్రత్తిరాటాలకు ౧౦ రోజుల కాలము ౨ చిన్నకమానులకు ౪౦ రోజులును ౨ చర్ఖాలకు ౩౬౮ రోజులును ౨ మగ్గాలకి ౪౮ రోజులు పనికలుగుచున్నది. ఎవ్వరికైనను రోజుకు ౮ గంటలు పనిచేసినచో తిండికి లోటుండదు.

దేశములో పండెడి ప్రత్తికి కొదువలేదు. తిండిలేక పనికై ప్రాకులాడు జనమునకు కొరవలేదు. అట్టిచోట ప్రత్తినిగాని లేక దూదినిగాని ఎగుమతి చేయుట దేశారిష్టము. బట్టలమరలలో స్వదేశములో దీనిని పరిణతిపొందించుటకు విదేశ ఎగుమతికన్న తక్కువగానైనను ఉపద్రవకరమే. బీదల పొట్టలపై దెబ్బ అది.

౨౫ మంది యుక్తవయస్కులుగల సంస్థలో ౬౫ పుట్లప్రత్తిని ఖద్దరుగా ఏడాదిలో తయారుచేయవచ్చును. ౩౧౨౦౦ గజాలగుడ్డ అగును. సగటున ౨౪౦౦ జనమునకు సరిపోవును.

ఎంత హాయియైనపని ఇది! ఎంతలాభదాయకము! ఆంధ్రమహాజనులు యోచింతురుగాత!!

# ఎముకల పరిశ్రమ

హిందూదేశములో ఏటేట కోట్లకొలది పశువులు నశించుచున్నవి. వీటి ఎముకలవలన మన దేశము పొందదగినంతలాభము పొందుటలేదు. ప్రభుత్వమువారుగాని ప్రజలుగాని ఇందువిషయమై తగుశ్రద్ధ తీసికొనలేదు. ౧౯౧౯ సంవత్సరములో వ్యవసాయపు బోర్డువారు ఎముకలును వీటివల్ల తయారగుఎరువులును ఇతర దేశములకు ఎగుమతిచేయుట పూర్తిగా ఆపుట అవసరమని హెచ్చరించిరి. ౧౯౨౫ సం॥లో హిందూదేశపు ఆదాయపు పన్నుల విచారణసంఘమువారు వీటిపై ఎగుమతిపన్ను విధించుట అవసరమని సూచించిరి. హిందూదేశవ్యవసాయపు కమిషను వారి యెదుట ప్రముఖులనేకులు సాక్ష్యమిచ్చుచు ఎముకల ఎగుమతి పూర్తిగా ఆపుచేయుట అవసరమనియు ఆరీతిగా ఎముకలలో నుండు ఫాస్ఫేటులు మనకు దక్కుటలేదనియు మొఱబెట్టిరి. కాని ఆసంఘమువారు ఎగుమతిని ఆపుచేయువిషయములోగాని, ఎగుమతిపన్ను విధించు విషయములోగాని ఏవిధమైనపని చేసియుండలేదు. ఒకసూచనమాత్రముచేసిరి. గవర్నమెంటువారిని ఏపైరులకు ఎముకలు ఎంతవరకు ఉపయోగపడునో, ఉపయోగించిన రైతుకు ఎంత ఖర్చు తగులునో విచారించుట అవసరమనిరి. విద్యుచ్ఛక్తియంత్రముల నమర్చి సహకారసంస్థలవలనగాని వ్యక్తులవలనగాని వీలైన ప్రదేశములలోనెల్ల ఎముకలనుంచి ఎరవులను తయారుచేయవలెనని వారి సలహా. ఇందువలన రైతునకును వ్యవసాయ పరిశ్రమకునుకూడ లాభముమెండు చేకూరెడిది. రాయల్ కమీషన్‌వారు సూచించిన ప్రకారము ఇండియాప్రభుత్వమువారుగాని రాష్ట్రప్రభుత్వములవారుగాని ఈవిషయములో ఏవిధమగు అభివృద్ధిని చూపియుండలేదు. ఈ దేశమునుండి చేయబడుచున్న ఎగుమతులు ఎప్పటివలెనే ఉన్నవి.

కడచిన ౧౦ సంవత్సరములలో చేసిన యెగుమతులు దిగువ నుదహరింపబడినవి

ఎముకలయు ఎముకలపదార్థములయు ఎగుమతులు.

| సంవత్సరములు | టన్నులు |
|---|---|
| ౧౯౨౬—౨౭ | ౧౦౦,౦౭౫ |
| ౧౯౨౭—౨౮ | ౯౮,౧౯౬ |
| ౧౯౨౮—౨౯ | ౯౪,౭౪౭ |
| ౧౯౨౯—౩౦ | ౧౦౯,౭౧౧ |
| ౧౯౩౦—౩౧ | ౩౭,౯౬౮ |
| ౧౯౩౧—౩౨ | ౩౭,౭౭౮ |
| ౧౯౩౨—౩౩ | ౨౧,౫౬౩ |
| ౧౯౩౩—౩౪ | ౨౪,౮౧౯ |
| ౧౯౩౪—౩౫ | ౩౬,౪౭౪ |
| ౧౯౩౫—౩౬ | ౪౨,౮౯౪ |

పై యెగుమతుల ఖరీదు ౨౪ లక్షల రూపాయలు. పాశ్చాత్యదేశములలో ఈపరిశ్రమవిషయములో జరుగుచున్న అభివృద్ధిని గురించిన ఈవిషయములో హిందూదేశపు నిస్సహాయతయు దూరదృష్టిలేమియు తేటతెల్లమగుచున్నది. విదేశములలో గట్టి ఎముకలవల్ల గుండీలును, పళ్ళుతోముకుంచెలును, పియానో దిమ్మలు మొదలగునవి తయారు చేయుచున్నారు. మిగిలిన యెముకలన్నియు పొడిచేసి ముందు దానిలోనికొవ్వునువిడదీయుచున్నారు. ఈ కొవ్వుతో సబ్బులు, గ్లిసరిన్, స్టియరిన్ మొదలగునవి తయారు చేయుదురు. కొవ్వుతీసిన యెముకల పొడినుండి ద్రవ, భస్మ, ఘనరూపములలో ఒక

(శేషము 415 పుట)

# విద్యాగంధము

మన దేశములో ఎంతమంది చదువుటకును, వ్రాయుటకును శక్తులై యున్నారో చూచినచో విషాదకరమైన విషయములు బయల్పడును.

## లెక్కల సాక్ష్యము

మానవ జాతిలో సగముమందికి విద్యాగంధము లేక యున్నది. ప్రపంచములో ఉన్న విద్యాశూన్యులలో మూడవవంతుమన దేశములో ఉన్నారు. భారత దేశములోని ౩౫ కోట్ల జనాభాలో పురుషులలో విద్యాగంధమున్న వారు ౧౦౦ కి ౭.౬; స్త్రీలలో ౧౦౦ కి ౧.౮. ఇప్పుడు స్వదేశసంస్థానములలోని స్థితి బ్రిటీషు ఇండియాలోకంటె మేలుగానున్నది.

| | | | |
|---|---|---|---|
| ౧. బ్రిటీషు హిందూ దేశము | | ౧౦౦ కి | ౭. ౬ |
| ౨. తిరువాన్కూరు | ... | ,, | ౨౫.౭౧ |
| ౩. కొచ్చిన్ | ... | ,, | ౨౧. ౬ |
| ౪. బరోడా | ... | ,, | ౧౪. ౪ |

ఈ క్రిందిలెక్కలను పరిశీలించినచో విదేశములతో మన దేశమును పోల్చిచూచుకొనుటకు వీలగును. అపుడు మన దేశస్థితియెట్టిదో విశదము కాగలదు.

విద్యావంతులు.

| | | |
|---|---|---|
| ౧. ఇంగ్లండు | ౧౦౦ కి | ౯౯.౬౬ |
| ౨. అమెరికా సంయుక్త రాష్ట్రములు | ,, | ౯౬. ౧ |
| ౩. జపాను | ,, | ౧౦౦ |
| ౪. రష్యా | ,, | ౯౦. ౨ |

ఈ పై దేశములలో జన సామాన్యమునకు విద్యాగంధమును గలిగించుటకు ప్రభుత్వము బాధ్యతవహించును. ౧౯౧౫ వ సంవత్సరములో రష్యాలో నూటికి ౩౦ మంది మాత్రము విద్యాగంధము గలవా రుండిరి. ౧౯౩౦ లో నూటికి ౬౭ గురును, ౧౯౩౩ లో నూటికి ౯౦ మందియు విద్యాగంధముగలవారు తయారైరి. చూడుడు. ఎంతత్వరితముగ ప్రజలలో విద్య వ్యాపించినదో ప్రభుత్వము బాధ్యత వహించుటచే ౧౮౬౫ వ సంవత్సరమున నీగ్రోలు అనాగరికులు విద్యాగంధవిహీనులు. కాని వారిలో ౧౯౩౨ వ సంవత్సరమున ౧౦౦ కి ౮౩.౭ మంది విద్యాగంధము కలవారైనారు. పట్టుదలతో పనిచేసినచో ఎంత ఆశ్చర్యమును కొలుపు ఫలమైనను కలుగును. కాని మన దేశములోని అభివృద్ధి పరికింపుడు. ఎంతో విషాదకరముగ నుండును.

౧౮౮౧ వ సంవత్సరములో విద్యాగంధము కలవారు ౧౦౦ కి ౩.౫ గురు. ౧౯౨౧ లో ౧౦౦ కి ౭.౬. అనగా ౪౧ సంవత్సరములలో మన దేశములో అభివృద్ధి ౧౦౦ కి ౪.

## విద్యవలన ప్రయోజనము

ఈపై పరిస్థితులను పరికించినచో దేశాభివృద్ధి కోరువాని కెవనికైనను విషాదముగలుగక యుండునా ? విద్యాగంధమున్నచో ఓటరులలో రాజకీయ విజ్ఞానము ప్రజ్వరిల్లును. అపుడు ఓటర్లలో ప్రతివాడును, యుక్తాయుక్త విచక్షణ జ్ఞానముగలిగి, యెవడు దేశసేవకుడో ఎవనికి తన ఓటీయవలెనో గుర్తెఱింగి, తన ఓటును సద్వినియోగము చేయగలడు. ప్రజాసామాన్యమున విద్యాగంధము వ్యాపించినచో వారు తమ పరిసర ప్రదేశములందు, మండలమునందు, దేశమునందు, విదేశములందు, రాజకీయ సాంఘికార్థిక పరిస్థితు లెట్టుల నిమిష నిమిషమునకును మారుచున్నవో తెలిసికొనుటకు వీలగును. ఇంతేగాక ఆరోగ్య సూత్రములను ప్రజాసామాన్యము

తెలిసికొని తమ పరిసరప్రదేశములను పరిశుభ్రముగ నుంచుకొని, తమ యారోగ్యము నభివృద్ధి పరచుకొనుటకు వీలు కలుగును. దానివలన దేశములోని మరణసంఖ్య తగ్గిపోవును.

ఇక విద్యావిహీనతకు ముఖ్యకారణము లేవో చూతము.

౧ ప్రభుత్వమువారు యూనివర్సిటీవిద్యకును, ఉన్నతవిద్యకును చూపిన శ్రద్ధాభక్తులు, ప్రాథమికవిద్యకై చూపకపోవుట: ఉన్నతవిద్యకు ఖర్చు పెట్టిన డబ్బు ప్రాథమిక విద్యకు ఖర్చుపెట్టక పోవుట.

౨ ప్రాచీనకాలమున కుటుంబముల పెద్దలే ప్రతివానికిని ప్రాథమికవిద్యను బోధించుట కేర్పరచువారు. ఇప్పుడు ప్రాథమికవిద్యావిధానమునందలి కేంద్రీకృత పరిపాలనము మనకొక శాపముగ పరిణమించినది. ప్రాచీనవిధానమును నాశనముచేయుటచే గ్రామములోని విద్యాశాలలు నిరుపయోగములైనవి.

3 తొలుత మెకాలేపండితుడు తన ప్రభువు పరిపాలనలో వారికి సహాయము చేయుటకు జనమును తరబీతుచేయుట కుద్దేశించి విద్యావిధాన మేర్పఱిచె. అదియునుగాక ప్రాథమికవిద్యావిధానము ప్రజాసామాన్యపు నిత్యావసరములకును, వారి పరిస్థితులకును ఉపయుక్తముగ లేదు.

౪ దారిద్ర్యము ముఖ్యమైన కారణములలో నొకటి. దారిద్ర్యము మన దేశమున భరింపరానిదిగా నున్నది. అందుచే బాలురను చదువునకు పంపుటకు తల్లిదండ్రులిచ్చగింపక వారికుటుంబ పోషణమునకు సంపాదించుటకై తమ బాలుర సహాయ మపేక్షించుచున్నారు.

విదేశములలో విద్యాకృషి.

౧౮౧౬వ సంవత్సరమునుండి ఇంగ్లాండు దేశమున ఒక జాతీయప్రజాసామాన్యవిద్యావిధానము నములులో పెట్టిరి. అదిఆబాలగోపాలమునకు వినియోగపడుచున్నది. గ్రామములలోనివారికి వ్యవసాయ సంబంధమైన విద్య ఎక్కువగా నేర్పుచున్నారు. ఇప్పుడు సామాన్య విద్యావిధానమున వృత్తివిద్యనుకూడ ఇముడ్చుచున్నారు.

జర్మనీ దేశమునందు ప్రాథమిక విద్యయే గాక వృత్తివిద్యకూడ నిర్బంధముగ నేర్పవలసినదే. ఉపాధ్యాయులు సామాన్యజనముతో నివసించి వారితో పనిజేయుదురుగాన వారు గ్రామముతో పరిచయము కలిగియుందురు. జపానులో పూర్వము మన దేశములోవలెనే బిడ్డలకు ప్రాథమిక శిక్షణను తల్లియే యిచ్చుట యాచారము. అక్కడ రెండు విధములైన పాఠశాలలు గలవు. ౧ ప్రాథమిక పాఠశాల ౨ ఉన్నతప్రాథమిక పాఠశాల. ప్రాథమికవిద్య ౬-౧౨ సంవత్సరముల వయసుగల బాల బాలికలందరు తప్పక నేర్వవలసినదే! వారు సాధారణముగ ఒకబడిలోనే చదువుదురు. నీతివిద్యయు వ్యాయామవిద్యయుకూడ విద్యావిధానమున చేరినవే. ఫిలిప్పైన్ ద్వీపములలో 'బనాయి' ప్రాంతములో నిరక్షరత్వ నిర్మూలనోద్యమము ప్రారంభించిరి. అచ్చటి ప్రజలు 'యూదు'లు. చదువువచ్చిన ప్రతివ్యక్తిని తన కుటుంబమునకు గురువుగ నియమించిరి. అక్షరపటములు చిన్నసైజులో ప్రజలందరికి తక్కువ ధరకు అందుబాటులో ఉండునటుల అచ్చువేసిరి. ఈవిధముగ చేసినందున అక్కడ ౧౦౦కి౭౦మంది ౫ సంవత్సరములలో చదువను వ్రాయను నేర్చుకొనిరి.

మనము చేయవలసినదేమి ?

ఇప్పుడు ప్రస్తుతము మన దేశమునందు వర్తమాన పరిస్థితులకును, అవసరములకును తగిన

15



విద్యావిధానము కావలెను. ప్రాథమిక విద్యా శాసనములు ప్రతిరాజధానిలోను ప్యాసు అయినవి. నిర్బంధ ప్రాథమికవిద్యావిధానము స్థానిక సంస్థల అధికారముక్రింద నున్నది.

ఈ సమస్య ముఖ్యముగా గ్రామములకు సంబంధించినది. కావున గ్రామప్రదేశములలోని విద్య కెక్కుడు శ్రద్ధ వినియోగింపబడుచున్నది. గ్రామపరిసరముల కనువగునటుల విద్యావిధానము మార్చబడుచున్నది. వయోజన విద్యా వ్యాప్తికై స్త్రీలకు ప్రత్యేకపు తరగతులును, మ్యాజిక్ లాంతరు ప్రదర్శనములును, రాత్రిపాఠశాలలును, గ్రామగ్రంథాలయములును ఏర్పాటు చేయబడుచున్నవి.

నిర్బంధప్రాథమికవిద్య అమలులోనికి రావలెనని ప్రతివారు సంగీకరించు విషయమే. అది ఉచితముగకూడ ప్రజాసామాన్యమునకు లభ్యము గావలెను. అందు స్త్రీ పురుషులు కలసి చదువుకొనుటకు వీలుండవలెను.

జర్మనీలోవలె ఉపాధ్యాయుల శిక్షణసంస్థలు నగరములనుండి గ్రామములకు మార్చవలెను. అపుడే ఉపాధ్యాయులు గ్రామస్థుల ఆర్థిక జీవనమును వారి పద్ధతులను వారి సభ్యతను పరికించి, వారికి తగు సహాయము జేయగలరు. రాత్రిపాఠశాలలు ఎక్కువగ స్థాపింపవలెను. ప్రతిస్కూలు ఫైనలు విద్యార్థియు, తాను అథమపక్షము ఒక విద్యా విహీనుని విద్యావంతునిగ జేసినటుల స్కూలు హెడ్మాస్టరుదగ్గిరనుండి ధ్రువపత్రము సంపాదించినగాని విశ్వకళాపరిషత్తువారు వానికి పరీక్ష ప్యాసు అయినటుల ధ్రువపత్రి మియ్యకుండ నుండునటుల నియమ మేర్పరచిన మన దేశ మచిరకాలములోనే విద్యాగంధయుతమై తనరారగలదు

ముఖ్యముగా మనదేశమున జ్ఞాన మభివృద్ధి కావలెనన్నచో మనమందరమును ఎవరికివారలే నడుముగట్టి పనికి పూనుకొనవలెను. ప్రతివిద్యావంతుడును తన కుటుంబములో నున్న ప్రతివారిని విద్యాయుతులుగచేసి; ఇరుగు పొరుగువారికి విద్యనేర్పిన యెడల అచిరకాలములోనే అనగా ౫-౬ సంవత్సరములలో మన దేశ మిప్పటికంటె పెక్కురెట్లు విద్యావంతులతో గూడి స్వరాజ్యమును సంపాదించుకొనగల స్థితిలోనికి రాగలదని నిబ్బరముగా చెప్పనగును.

---

(412 వ పేజీ తరువాయి)

విధమగు జిగురు తయారుచేయుదురు. ఈ జిగురు గ్లూ పెట్టెలు, వడ్రింగము, నిప్పుపుల్లలు, మెరుగు కాగితములు, ఎమిరిగుడ్డ, తయారుచేయుటలో ఎక్కువగా ఉపయోగపడుచున్నది. కాగితము, నేరపరిశ్రమలలో.కూడ ఉపయోగపడుచున్నది.

మనవారు తమంతటతాము పై తెలంగున తయారుచేసికొనలేక, పై దేశములవారిదగ్గఱనుండి కొని, తమడబ్బు పోగొట్టుకొనుచున్నారు. ఇప్పుడైనను మనవారు తెలివి తెచ్చుకొని, మేలొందెదరు గాక !

# ఆంధ్రదేశ గ్రంథాలయసంఘము - విజ్ఞాపనము

జాతీయ పునర్నిర్మాణము జాతీయ వికాస వ్యాప్తిని బట్టి పెంపొందునని లోకమెల్ల బాగుగా గుర్తించినది. వికాసవ్యాప్తికి ప్రధానాధారము గ్రంథాలయమగుట సర్వజనాంగీకృతమే. కాబట్టి దేశక్షేమమును కోరు సర్వోద్యమములకును పునాదిగా ఏర్పడఁదగినది గ్రంథాలయోద్యమమే. దీనిదే ప్రధాననిర్మాణకార్యక్రమము. దీనిని భారతభూమిలో కొంతవిరివిగా మొట్టమొదట సాగించిన ప్రాంతములు ఆంధ్రదేశము బరోడా సంస్థానము. ఆంధ్రదేశగ్రంథాలయ సంఘము 1914 లో ప్రారంభమైనది. బరోడాలోని యుద్యమము రాజాశ్రయమున త్వరత్వరగా పెరిగి, విజృంభించినది. ఆంధ్రదేశ గ్రంథాలయోద్యమము జనాశ్రయమున మెలమెల్లగా నభివృద్ధి నొందినది. కాని ఆకాశవిమానవేగముతోను రేడియో విద్యుచ్ఛ్రవణ వేగముతోను నడచునట్టి యుగమున మన యుద్యమమును బలవత్తరముగా సాగించుట అత్యవసరము. ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘము తలపెట్టిన కార్యక్రమమునకు సేవాతత్పరు లనేకులు కావలసి యున్నారు. కార్యక్రమవివరణము లీక్రిందనిచ్చుచున్నాము.

౧. ప్రజాసామాన్యమునందు విజ్ఞాన వ్యాప్తి చేయుటకును అక్షరానభిజ్ఞతను రూపుమాపుటకును తగిన ప్రబోధము కలిగించు కరపత్రములు పోస్టరులు ధర్మగ్రంథాలయప్రయోజనమును తెలుపు చిన్ని పొత్తములు గ్రంథములు ప్రకటించుట.

౨. గ్రంథాలయ శాస్త్ర బోధకములును, విజ్ఞాన వికాస సహకారులును నగు వ్యాసములతో గ్రంథాలయసర్వస్వ పత్రికను ప్రకటించుట.

౩. రాష్ట్ర, మండల, తాలూకా, గ్రామ సమావేశములు, సభలు, యాత్రలు జరుపుచు, సంఘములుస్థాపించుచు, బొమ్మల లాంతరు, సంచార గ్రంథాలయములు మొదలగు సాధనముల మూలకముగా వైజ్ఞానిక ప్రచారము చేయుట.

౪. విజ్ఞాన శాఖలయందు శిక్షణముపొంది గ్రంథాలయ శాస్త్రమునందును సుశిక్షితులైన నిత్యసేవకబృందము నేర్పఱచి, గ్రంథాలయోద్యమాదర్శముల నమలులో పెట్టుట.

౫. ఆంధ్రదేశమున కంతటికిని కేంద్రగ్రంథాలయమును స్థాపించుట, అదేరీతిని మండల గ్రంథాలయములను స్థాపించుట.

ఈ సందర్భమున నొకవిషయమును కృతజ్ఞతా పూర్వకముగా ప్రకటించుచున్నాము. ఉదారులగు కొందఱు గ్రంథప్రకాశకులు కేంద్ర గ్రంథాలయమునకును మండల గ్రంథాలయమునకును ధర్మార్థముగా గ్రంథముల నిచ్చుట కంగీకరించినారు.

౬. 'పబ్లిక్ లైబ్రరీ' పరిపాలన శాస్త్రవిధులను ఆచరణమువలన పరిపాకమునకు తెచ్చుట.

బరోడాలో ఏర్పడి, గుజరాతు మహారాష్ట్రములలోకొన్నిసంవత్సరములతరబడిని అమలులోనికివచ్చిన గ్రంథవర్గీకరణవిధానమును తెలుగునకు సరిపఱచి నిర్మించితిమి.

గ్రంథాలయ శాస్త్రశిక్షణమునకు పాఠవిధానమేర్పఱచి 1934 జూనులో బెజవాడ

యందు శిక్షణమిచ్చితిమి. ౨౮గురు అభ్యర్థులను పరీక్షించి వారికి యోగ్యతాపత్రము లిచ్చితిమి.

ఈశాస్త్ర విషయక పాఠ్యగ్రంథములులేని కొరత ఈయనుభవమువలన తెలియవచ్చినది. అట్టిగ్రంథ సామగ్రి సిద్ధము చేయించుటకు పూనుకొనినాము.

౭. దేశములోని పిల్లలు పెద్దలు స్త్రీలు పురుషులు రోగులు అంగవికలులు విద్యార్థులు ఉపాధ్యాయులు వ్యాపారస్థులు కర్మకరులు మున్నగు నెల్లరకు వారివారికి తగినరీతిని విరివిగా అన్ని రకముల గ్రంథాలయములు స్థాపింపించి నడపించుట.

౮. చదువులేక గ్రామములలోని నూటికి తొంబదిమందిచొప్పుననున్న మనసోదరులకాలో పమును తుడిచివేయుటకు మార్గాన్వేషణము చేయ పరిశ్రమించుట.

౨౦ వ మద్రాసు రాష్ట్రీయ సహకార మహాసభవారు, సహకార సంఘముల క్షేమనిధి నుండి ద్రవ్యమువెచ్చించి సహకార విషయజ్ఞానమును ఇతరవిజ్ఞానమును కలిగించు గ్రంథాలయములు నెలకొల్పి ఇతర మార్గములనుగూడ సర్వజనవిద్యావ్యాప్తికి తోడ్పడవలెననియు,

గ్రంథాలయ నిర్మాణ వ్యాప్తులకై చెన్నరాష్ట్రములో ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘమును మద్రాసు సంఘమును చేయుచున్న కృషి ప్రశంసింపదగిన దనియు,

కో ఆపరేటివు సంస్థలు పై రెండు సంఘములలో తమతమ ప్రాంతము ననుసరించి సభ్యులుగా చేరి, గ్రంథాలయ పోషణ నిర్వహణములకు వాని సేవ నుపయోగించుకొనవలసినదని సలహా చేయుచున్నామనియు, తీర్మానించిరి.

౧౯౧౮ వ సంవత్సరమాదిగా మాసంఘము చేసిన ప్రచారమువలన ఈ క్రింది లాభములు చేకూరినవి. అవి లభించుటకు మాకు తోడ్పడిన యందఱకును కృతజ్ఞులము.

౧ గ్రంథాలయములకు స్థానికసంస్థలు విరాళము లియ్య వీలులేదని నిరోధింప నుద్యుక్తులగుచుండిన మద్రాసు ప్రభుత్వమువారు తామే లైబ్రరీగ్రాంటు లిచ్చుచు వానిని స్థానికసంస్థల ద్వారా పంచిపెట్టించుచున్నారు.

౨ ఈ ఆంధ్రగ్రంథాలయ సంఘమువారు ఏర్పరిచిన అఖిలభారత గ్రంథాలయమహాసభను మద్రాసులో జరిపిన పిదప, దేశ రాష్ట్ర మండల గ్రామసమావేశము విరివిగా జరిగి, గ్రంథాలయోద్యమమునకు బలముకలిగి అభిమానము ప్రబలంజొచ్చినది. విరివియగు అభిమాన ముదయించినందున దీక్షాబద్ధనిబిడ ప్రయత్నము అవసరమైనది.

ఇదిగాక గుంటూరు, నరసారావుపేట, ఒంగోలు, కర్నూలు, బెజవాడ మొదలగు మునిసిపాలిటీలును, పడమటి గోదావరి, గుంటూరు కర్నూలు జిల్లాబోర్డులును గ్రంథాలయోద్యమమును తామే నిర్వహించుటకు నడుముగట్టినవి. కృష్ణా జిల్లాబోర్డువారు కొంత ఉదారమగు విరాళమీయ నారంభించి మార్గదర్శకులైనారు.

ఇంతటి కార్యక్రమము ద్రవ్యములేక జరుగదు. కాబట్టి దేశములోని సహకార సంఘములు, మునిసిపాలిటీలు, జిల్లాబోర్డులు, పంచాయతులు, పాఠశాలలు, కళాశాలలు, అన్నివిధములగు గ్రంథాలయములు, ఇతరసంస్థలు మాకు తోడ్పడి, మమ్ములను కృతకృత్యులను గావింప

వలెనని కోరుచున్నాము. మాకు తోడ్పడు మార్గములు రెండు.

౧ మాసంఘములో సభ్యులగుట,*

౨ జాతీయ పునర్నిర్మాణ కార్యక్రమమున ప్రధానభాగమయిన ఈ యుద్యమమునకు భూరివిరాళములిచ్చుట.

ఈ మహోద్యమమునకు తప్పక తోడ్పడి, ప్రోత్సహింతురని ఆశించుచున్నాము.

3-8-32,
బెజవాడ.

గాడిచెర్ల హరిసర్వోత్తమరావు,
మారేపల్లి రామచంద్రశాస్త్రి,
అయ్యంకి వేంకటరమణయ్య.

---

* సంస్థలకు సం॥నకు సభ్యత్వపు చందా రు 8 లు, వ్యక్తులకు సం॥నకు చందా రు 3 లు
జీవితపు చందా రు ౧౦౦ లు

రాజపోషకులు:—
ఈసంఘమునకు గాని, అనుబంధ సంస్థలకుగాని రు ౨౫౦౦ ల విరాళము దయచేయువారు.

ప్రధాన పోషకులు:—
పైరీతినే రు ౧౦౦౦౦ లు మొ ౨౫౦౦౦ ల వఱకు విరాళము దయచేయువారు.

పోషకులు: —
సంవత్సరమునకు రు౧,౦౦౦ లు విరాళము దయచేయువారు.


# వీణ

తెనుగు మాసపత్రిక

సాలుచందా డిసెంబరువరకు రు 2 లు

తెలప్రోలు - కృష్ణాజిల్లా.

# ప్రతిభ

త్రిమాసపత్రిక

సంవత్సరచందా రు 2 లు

నవ్యసాహిత్యపరిషత్తు, గుంటూరు.

# ప్రకృతి - బెజవాడ

ఆరోగ్యవిషయిక సచిత్ర వైద్యమాసపత్రిక.

మానవుడు ఆరోగ్యవంతుడుగ నుండుట, రోగములు రాకుండుట, నీరు, గాలి, మట్టి, సూర్యకిరణ, స్వాభావికాహార, యోగవ్యాయామ, ఉపవాస, విద్యుత్కాంతశక్తి, మొదలగువాని సహాయమున రోగములను కుదుర్చువిధానములను తెలుపును. చందాదారులకు ప్రకృతివైద్యపుస్తకములన్నియు తగ్గింపుధరల కియ్యబడును. చందా రు 3 లు.

# లోకవార్తాలహరి

## స్పెయినులోని గందరగోళము

స్పెయినులోని గందరగోళము ఎన్నిమాసములు కడచినను త్వరలో ముగియునట్టి మార్గమునలేదు. మేడ్రిడ్ పట్టణపు ముట్టడి సాగుచునే యున్నది. కాని ఒక్కసుగుణము మాత్రి మీసందర్భమున గనుపింపదగినదికలదు. తిరుగుబాటుదారులను ఒకప్రక్కన కొన్ని మైళ్ళ వరకును ప్రభుత్వపు సైన్యములు పారదోలినవి. మేడ్రిడ్ వెలెన్షియా రోడ్డును నిరోధింప నిశ్చయించిన తిరుగుబాటుదారుల ప్రక్రియము పొసగినది కాదు.

* * * *

అయినను తిరుగుబాటుదారుల బలము తగ్గినదనుకొనరాదు. వారు బాంబులు మేడ్రిడ్ మీద పడవేయుచు వినాశము కల్పించుచునే యున్నారు. పట్టణములోనికట్టడములలో నాల్గవ వంతో, అథవా మూడవవంతో కూడ, నేలగలసినవి. తినుటకుతిండి, కట్టుటకుగుడ్డ, తలదాచుకొనుటకు నీడలేక ఈ ప్రజ యల్లాడుచున్నారు. అందులోను తిరుగుబాటుదారులు కూలిచేసుకొని బ్రతుకు బీదల ఇండ్లనే ఏరి ధ్వంసమొనర్చుచున్నారు. సైనికులు యుద్ధమునకు వినియోగించు భవనములుకూడ తప్పించి బీదలనే వారు వేధించుచున్నారు. కారణము మరేమీ కాదు. సాధారణ ప్రజలను బెదరగొట్టి చెదరగొట్టి ప్రభుత్వము వారికిగల నైతిక బలమును వీరు చెరుపజూచుచున్నారు. యుద్ధానర్హప్రజముదుసలులు స్త్రీలు బిడ్డలు మేడ్రిడ్ వదలిపెట్టిపోవుటకు తగినంతయానసాధనములులేవు. ఒకవేళ కష్టపడి ప్రజను తొలగించినను వారికి దారినిగాని చేరిన ఏవెలెన్షియాబోటి చోటునగాని క్షేమము లేదు. రెండుమాసములు స్పెయినులోని భాగ్యవిహీనులకుసహాయపడి పనిచేసిన 'మేడంప బ్యాన్‌మన్సు' అను స్వీడను స్త్రీ సాక్ష్యమునుబట్టి యొకచిత్రహింసనంగతి బయల్పడు చున్నది. ఒక్క పర్యాయమొక రైల్వేట్రైయినులో 250 గురు స్త్రీలను శిశువులను తీసికొని పోవుచుండినారు. తిరుగుబాటుదారులు దానిపై బాంబులు వేసిరి. చాలమంది చచ్చిరి. పాపమీస్థితియందు నిస్సహాయులై మేడ్రిడ్ ప్రజ యెంతటి కష్టములు గలిగినను అధైర్యపడక హోరాహోరి పోరు సాగించుచున్నారు.

* * * *

స్పెయిను ప్రభుత్వము వారు తిరుగుబాటుదారుల వశమునందుండు 'ఒవీడో' వంటి పట్టణములను స్వాధీనపరచుకొనుటకు చేయుచుండు ప్రయత్నములును ఫలించుటలేదు. ఎదుటిపార్టీ నాయకుడు జనరల్ అరాండా అనునతడు జనరల్ ఫ్రాంకో కంటే మొనగాడట. యుద్ధరంగమున త్రవ్విన కందకములలో ఎలెక్ట్రిసిటీతో దీపములు పెట్టి చలికి సంరక్షణగా వేడికలిగించి మహానుకూలముల నన్నిటిని ఫ్రాంకో పరముగా చేసినారు. తిరుగుబాటు దారులకు ఇట్టిపరికర సౌకర్యములు మెండు. స్పెయిను ప్రభుత్వమునకివిలేవు. ప్రజలలోని అజేయమగు స్వతంత్రేచ్ఛ ఉత్సాహములు తప్ప వేరుదిక్కులేదు. ఎట్లుండగలదు ?

* * * *

తిరుగుబాటుదారులకు ఇటలీ జర్మనీలు చక్కగా సహాయము చేయుచున్నవి. ఇటీవల జరిగిన యుద్ధములం దొక్కదానిలో వేలకొలది ఇటాలియను సైనికులు పరికరములతో కూడ దొరికిరి.

స్పెయిను ప్రభుత్వము వారు మొరపెట్టిరి. ఇంగ్లీషు విదేశాంగమంత్రి యీడెను, ఫ్రెంచి విదేశాంగమంత్రి బ్లుమ్ములు నిరంతర పరిశ్రమచే శాంతిపేరిట నేర్పడిన తాటస్థ్యస్థాపక కమిటీ వారు ఇటలీ వాలంటీరులను ఆపలేక పోయినారు. ఇటలీని ప్రశ్నింపగా తాము ఆపే ప్రయత్నము చేయ వీలులేదనినారు. దానికి ఈ కమిటీవారు తలయూచుచు పైగా వాలంటీరుల విషయము నందు ఇదివరలో అక్రమము జరుగలేదనియు ఇక జరుగునని తోచలేదనియు నిర్వచించిరి. తిరుగుబాటుదారులకీరీతిని వారిమిత్రులు సాయపడగా ఈడెను బ్లుమ్ములు సముద్రముమీదను భూమి మీదను కాపలాలుపెట్టి స్పెయిను ప్రభుత్వమునకు తమప్రజలద్వారా యేవిధమైన మేలును జరుగకుండ నిషేధించు చున్నారు.

* * * *

అయిన ఏదేశములో జూచినను కర్మకరులు స్పెయిను ప్రభుత్వమునకు సాయము చేయువారుగా నున్నారు రుష్యా, ఫ్రాంసులమాట యట్లుండ నార్వే, స్వీడను, హాలండు, బెల్జియము, స్విట్జర్లండు, డెన్మార్కు మున్నగు అన్ని రాష్ట్రములలోను స్పెయిను దేశపు కర్మకరుల యెడ సానుభూతియెక్కువగా కలదు. కమిటీ లేర్పడి సహాయ పరికరములను సరఫరా చేయు చున్నారు.

* * * *

ఏమున్ననేమి? స్పెయినులోని పోరాటమును పుట్టించుటకు సాగించుటకు బలవంతులైన పెట్టుబడి దారులు, కాథలిక్ మతపు పీఠాధిపతులు కారణ భూతులని లోకమునకు విశదమైనది. రాయల్ డచ్ షెల్ పెట్రోలియంకంపెనీవారును (స్టాండర్డు ఆయిల్ కంపెనీకి ప్రతిస్పర్థులు) 1935 లో జర్మనీలో తయారై ఇటలీమిత్రులనుగూడ చేర్చుకొని స్పెయినులోని భూగర్భసంపదనంతటని హస్తగతము చేసికొనుటకు ఎక్కుపెట్టిన బ్యాంకింగు పారిశ్రామిక కంపెనీల సంఘమువారును 1936 ఎలెక్షనులలో స్పెయినులోని రాజ పక్షపాతులు అధిక సంఖ్యాకులుగా ఎన్నుకొన బడుదురనియు గిల్‌రోబుల్సు నాయకు డగుననియు అన్ని కంట్రాక్టులు తమవే యగుననియు ఎదురు చూచిరి. అది జరుగలేదు. ప్రజాసత్తాకము పక్షము విజయమందినది. ఫేసిస్టులగు ఇటలీ జర్మనీల పెట్టుబడి దారులా ప్రజాసత్తాకము నాశ్రయించువారు ? సైనికాధికారోన్మత్తుడు ఫ్రాంకో జయించిన తమకులాభమని వీరతనికి అండ యయినారు. స్పెయినులో కేథలిక్కు మతాధిపతులకును భావస్వాతంత్ర్యమును కోరు ప్రజాహితులకును ఎప్పుడును పోరాటమే. రాజులతో చేరుకొని మతాచార్యులు ప్రజానాయకులను చిత్రహింసలు చేయువారు. రాజులు పోయినతరువాత రాజస్థానమునకు ప్రత్యామ్నాయ మగు నియంతృత్వము సాధింప సమకట్టిన ఫ్రాంకోకు బాసటయైనారు. ఈరీతిగా స్పెయిను పోరాటము ఫేసిస్టు (ధనిక సామ్రాజ్యక) సిద్ధాంతమునకు ప్రజారాజ్య సిద్ధాంతమునకు సంఘర్షణగా పరిణమించినది. ధనిక, సామ్రాజ్యక సిద్ధాంతములకు ఇంకను తావలమగు ఇంగ్లండు ఫ్రాంసులు ఎట్లుగట్టిగా ఫ్రాంకో నెదుర్కొనగలవు ! ఫ్రాంసు, ఇంగ్లండు, రుష్యాలు గట్టిగానెదిరినచో ఫ్రాంకో నిలచునా ? యనువారెందరో కలరు. తుదితీర్మాన మేమగునో యెవ్వరును చెప్పలేరు.

# ఖద్దరుసంస్థానము-గుణదల

## ఆదర్శ గ్రంథాలయ ప్రారంభోత్సవము

ఆదర్శ గ్రంథాలయ ప్రారంభోత్సవము ది.౨౮-3-3౭ తేదీని పైగ్రంథాలయ ప్రారంభోత్సవమున అధ్యక్షత వహించిన శ్రీయుత మారేపల్లి రామచంద్ర శాస్త్రి గారు ఇట్లు ఉపన్యసించిరి:

ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘము ౧౯౧౮ సం॥ మున నెలకొల్పబడి గ్రంథాలయోద్యమమును నడపుచున్నది. ఆసంఘ కృషివిశేషములు గ్రంథాలయ సర్వస్వములో ప్రకటింపబడుచున్నవి. ఆకృషికిఫలముగా ఇప్పటికి ఆంధ్ర దేశములో గ్రామములలో సుమారు ౨౦౦ గ్రంథాలయములును, పట్టణములలో సుమారు 3౦౦ గ్రంథాలయములును ఏర్పడి యథాశక్తిని పనిచేయుచున్నవి. ధనవంతులును విజ్ఞానవంతులును, స్థానిక సంస్థలును, సాయము చేయుటచే పట్టణములలోని గ్రంథాలయములు పొందుచున్న అభివృద్ధిని పట్టిచూడ గ్రామాదులలోని అభివృద్ధి తక్కువ యని చెప్పక తప్పదు. అయినను, కొన్ని గ్రంథాలయములు ఊళ్లలో కూడ వానికి తగినట్లు పనిచేయుచునే యున్నవి. కాని ఆపని మొత్తముమీద చూచినచో చాల తక్కువ.

మనదేశములోని ప్రజలలో నూటికి ౮౦ మంది గ్రామములలో ఉన్నారను విషయము మనము ఎప్పుడును ఏసందర్భములోను మఱవరాదు. ఏఉద్యమములోనైనను మన దేశములో గ్రామాదులను వదలి పట్టణవాసులు ఫలప్రదముగా నడపగలుగుదురని ఊహించుటయైనను పొరపాటే. మనదేశమున గ్రామముల పరిస్థితులు తెలిసికొనక ఎంత గొప్ప ఉద్యమమును ఎంతగొప్పవారు ప్రారంభించినను అది విఫలమగునని చరిత్ర చాటుచున్నది. విజ్ఞానవంతులును పట్టణవాసులును తమకుగల సాధనసంపత్తితో తమంతట తాము కొన్నిప్రత్యేక సందర్భములలో తమప్రయత్నములు ఫలించెనని సంతోషపడగలిగినను గ్రామాదులను కూడ తమతో కలుపుకొని రాగలమను ధైర్యము కలిగినప్పుడే వారికృషి సరిగా ఫలింపగలదని నాతలంపు.

మనదేశములో ఉన్న ప్రత్యేక పరిస్థితులలో మనలోని విజ్ఞానవంతులు పరదేశపరిస్థితులు తెలిసికొనుటవలనను, పుస్తకములను వార్తాపత్రికలను చదువుటవలనను, ఈ దేశమునకు సరియగుదారి చూపింపజాలరని మనవారు ఇప్పుడిప్పుడే గ్రహించుట శుభచిహ్నము. ఇప్పుడు దేశక్షేమమును కోరు ప్రతివారి దృష్టియు గ్రామాదులవంక తిరిగియున్నది. ఈ అవకాశమును చేకొని, గ్రామాదులలోని ప్రజలుకూడ తమ అభివృద్ధికొఱకు అవలంబింపదగిన విధానమును సూచించి తోడ్పడనియెడల, ఏవిధమైన అభివృద్ధియు గ్రామములు పొందజాలవు.

గ్రామప్రజలు తమపైగల భారమును క్రమముగా నిర్వర్తింపనియెడల, తమమేలుకోరు ఎల్లర కృషియు వృథయగుటయేకాక గ్రామప్రజలకు ఉపయోగింపని ఇతర మార్గములను త్రొక్కుటయు తటస్థింపగలదు. ఇది మహా సందిగ్ధ సమయము. ఇప్పుడు గ్రంథాలయోద్యమము ఒక పెద్ద బాధ్యత వహింపవలసిన తరుణమువచ్చినది. గ్రామాదులలో నిరక్షరత్వమును, దారిద్ర్యమును, నిరుద్యోగమును ప్రబలియున్నవి. ఇవి నివారించుటకు కేవలము ఉపన్యాసములవలనను వార్తాపత్రికలవలనను అభివృద్ధి చేయు మార్గములలో కల కష్టములను మనము గుర్తింపవలసి యున్నది. ఇట్టిక్లిష్టపరిస్థితులలో దేశములోని వివిధ గ్రంథాలయముల వారు అవలంబింపవలసిన విధానమును సూచించుటకొఱకు ఒక ఆదర్శ గ్రంథాలయము నేర్పడుట అత్యావశ్యకమని ఎంచి అట్టి యీ గ్రంథాలయమునకు ప్రారంభోత్సవము జరుపగలిగినందులకు సంతసించుచున్నాను. ఈ గ్రంథాలయాచరణమే గ్రామములలోని అన్నిగ్రంథాలయముల వారును గుర్తించుచుండవలెనని నాకోరిక. ఇట్టిమహా బాధ్యతను పెట్టుకొని నడపుచున్నవారికెంతయు సాయమీయవలయునని అందరను వేడెద

మనదేశములో గ్రామముల దుస్థితిని గుఱించి చిలుకపలుకులవలె స్మరించిన ప్రయోజనము లేదు. ప్రజలును, నాయకులును, అందఱును ఆదుస్థితిని దాని మూలకారణములను గ్రహించియే యున్నారు. ఆదర్శమగు గ్రామములోనే కాని ఆదర్శమగు గ్రంథాలయము ఏర్పడజాలదు. ఈ రెండింటికిని అవినాభావసంబంధ మేర్పడి యున్నది. ఇట్టితరుణమున ఆదర్శ గ్రంథాలయ మేర్పాటుచేయుటతో పాటు ఆదర్శగ్రామమును సైతము తయారుచేయవలెనని ఖద్దరుసంస్థానమువారు నిశ్చయించుటచే గ్రంథాలయ సంఘకృషికి ఎక్కువ సహకారము చేకూరినది.

ఖద్దరుసంస్థానము పదిసంవత్సరముల క్రింద స్థాపింపబడి శాంతిసాధనములకొఱకు విశేషకృషి చేసియున్నది. ఆకృషికి ఇక్కడివారు విశేషముగా తోడ్పడి యున్నారు. వారికృషిచూడ దేశములో మహామహులగు గాంధిమహాత్ముడు, బాబురాజేంద్రప్రసాద్, శంకర్‌లాల్ బాంకర్, మీరాబేన్, ప్రకాశము, పట్టాభిసీతారామయ్య, కుమా

రప్పు, సీతారామశాస్త్రి మొదలగు పెద్దలు ఈ ప్రదేశమును సందర్శించియున్నారు. అట్టివారిదర్శన భాగ్యమునకు కృషి చేసి, దినదినాభివృద్ధి కాంచుచున్న ఖద్దరు సంస్థానమునకు ఆదర్శ గ్రామమును నిర్మాణము చేయుటగాని, ఆదర్శ గ్రంథాలయమును నిర్మాణము చేయుట కాని అంత పెద్ద పని కాదనియే చెప్పవచ్చును. వారికృషిని దేశమంతయు ముఖ్యముగా గ్రామములవారును, మఱింతముఖ్యముగా గ్రామాభివృద్ధికోరు అన్నిశాఖలవారును కనిపెట్టుట అత్యావశ్యకము.

కావున అనావశ్యకవిషయ పరిశోధనములతో కాలము కడపక. ఆచరణయోగ్యమగు విధానమును అవలంబింపవచ్చును.

మొదట బ్రతుకుతెరువుకొఱకు అవసరమగు వృత్తులవలంబింపవలె; దానికి తోడు లోకజ్ఞానము కలుగుటకు వలయు చదువు సైతము పెంపొందింపవలెను.

ఇందును గురించి జరుగుకృషి అంతయు గ్రంథాలయోద్యమము వారు తమతమ విజ్ఞానముతో విమర్శించి దేశాభివృద్ధికి చక్కనిదారి చూపించవలెనని కోరుచున్నాను.

అధ్యక్షుని ఉపన్యాసానంతరము ఖద్దరు సంస్థాన ధర్మకర్త శ్రీ ఉప్పులూరి వేంకటకృష్ణయ్యగారు ఈ క్రింది తెలుంగున ఉపన్యాసమొసగిరి:—

ఖద్దరుసంస్థాన గ్రంథాలయమును ఆదర్శముగ చేయ నిశ్చయించిన ఆంధ్రదేశ గ్రంథాలయసంఘమువారి సంకల్పము మన అదృష్టమని భావించెదను. ఇందువలన మనపై పెద్దబాధ్యతపడినది. మనకు శక్తియున్నను లేకపోయినను పెద్దల ఆశీర్వాదముతోను, దేశీయుల తోడ్పాటుతోను ఇది నెరవేరుననియే నానమ్మకము. అన్నిటికిని ముందు మనము నెరవేర్పవలసిన ఆదర్శమును తెలిసికొనుట అవసరము. ఇప్పటి పరిస్థితులుకూడ గుర్తింపవలసి యున్నది.

నేను పదునైదు సంవత్సరములనుంచి చేయుచున్న పరిశోధనల ఫలితములనుబట్టి మన ముందు కార్యక్రమము నిస్సంశయముగా నెరవేర్పగలమని నమ్మకము కలుగుచున్నది. మానవునకు శాంతిని పెంపొందించునదే విజ్ఞానము. అహింసాసత్యములు లేనిది మానవునకు శాంతి ఏర్పడదనుటలో సందేహమెంతమాత్రమును లేదు. అహింసా సత్యములు ప్రజలలో స్థిరముగా నిలువవలెనన్న పాతివ్రత్యమును, ఏకపత్నీవ్రతమును, యుక్తాహార (శాకాహార) విహారములును ముఖ్యములని నేను నమ్ముచున్నాను. ప్రజలందరు ఈవిధానములో ఉత్తీర్ణులైనను కాకపోయినను ఈలక్ష్యమునకు ప్రధానగౌరవమిచ్చిన దేశములలోనే శాంతి స్థాపనమునకు తావు ఏర్పడగలదు.

ఇప్పుడు మానవులలో స్వేచ్ఛ పెంపొందింపవలెనని అనేకోద్యమములు ప్రబలుచు, వైలక్ష్యమునకు ముప్పును కలుగచేయుచున్నవి. ఇందువలన స్త్రీ పురుషాదులలో వైలక్ష్యమునకు విరుద్ధములగు విధానములు వాడుకలోనికి రావలెనని హెచ్చుప్రచారము జరుగుచున్నది. ఇదికూడ మానవశాంతికొఱకు అవలంబింపవలసిన విజ్ఞానమార్గమని కొందరు నమ్ముచున్నారు. ఇట్టితరి ఎట్టి విజ్ఞానమునకు ప్రాధాన్య మివ్వవలెనో ఎట్టి గ్రంథములను వాడుకలోనికి తేవలెనో మనము నిర్ణయించుకోవలసియున్నది. లక్ష్యమును నిర్ణయమును లేకుండ కలగూరగంపగా ఉద్యమములు నడపునెడల చదువరులలో భిన్న భిన్నములగు ఆలోచనలును భిన్న భిన్నతర్కములును ప్రణి నిర్మాణకార్యక్రమమునకు భంగము కలుగునే కాని సక్రమముగ అభివృద్ధి కలుగ నేరదని నాఅనుభవమై యున్నది.

నేను ఇట్లు చెప్పుటలో ఇతర విజ్ఞానమును తెలిసికొనరాదని కాదు; రెండురకముల విజ్ఞానములును తెలిసికొనిన తరువాత అన్నిబాపతుల గ్రంథములను సేకరించినను, అర్హతలనుబట్టి గ్రంథముల నందజేయుచుండవలెనని నా అభిప్రాయము.

మానవశాంతికొరకు అహింసయు, సత్యమును, పాతివ్రత్యమును, ఏకపత్నీవ్రతమును, యుక్తాహార(శాకాహార) విహారములును అత్యవసరములనియు ఆ ఉత్కృష్ట సాధనములనుమానవులు తెలిసికొని తెలియక కానిపొరపాటుననైనా తప్పక అనుసరించుటకు వీలుగల విజ్ఞానమును వెదచల్లుట గ్రంథాలయముల కర్తవ్యమనియు, ఆ కర్తవ్యమును ఈ గ్రంథాలయములో ప్రత్యక్షపరీక్ష చేసెదరనియు నేను నమ్ముచున్నాను.

# గ్రంథాలయ వృత్తాంతములు

## రేపల్లె తాలూకా

### శ్రీ పట్టాభిరామ గ్రంథాలయము, పమిడిమఱ్ఱు.

'బెల్లంవారిపాలెం' గ్రామవాసియగు వెలగపూడి బసవయ్య చౌదరిగారు రు 30-0-0 లు విలువగల ౬౦ పుస్తకములు బహూకరించి వారికి గ్రంథాలయోద్యమము నందుగల అభిమానమును వెలువరించిరి.

### శ్రీ. బాలగంగాధరతిలక్ పుస్తకాలయము, నూతన గ్రంథాలయ ప్రదర్శన ప్రారంభోత్సవము, పెదపులివఱ్ఱు.

పై ప్రదర్శన ప్రారంభోత్సవము ది ౭-౩-౩౭ తేదీని శ్రీయుత మారేపల్లి రామచంద్రశాస్త్రి కవిగారు జరపిరి. రేపల్లెతాలూకాలో జరిగిన గ్రంథాలయప్రదర్శనములలో ఇది రెండవది. ఇదివఱకు వార్షికసభలతోపాటు ఏర్పరుపబడిన ప్రదర్శనమువలెగాక ఇది ప్రత్యేకముగా ఏర్పాటు చేయబడినది. ఈప్రదర్శనమును ఏర్పాటు చేయుటకు ఈ గ్రంథాలయ కార్యదర్శియు, రేపల్లె తాలూకా గ్రంథాలయ సంఘ కార్యదర్శియు అగు శ్రీ కొండూరి సీతారామయ్యగారు విశేష కృషి సల్పియుండిరి. వీరు రెండు మాసముల పందొమ్మిది దినములు కష్టపడి పనిచేసి ప్రదర్శనమునకు కావలసిన తెనుగు, ఇంగ్లీషు, హిందీ పత్రికలును గ్రంథాలయములకు సంబంధించిన పటములును లెక్కల పట్టీలును సేకరించిరి. ఈ ప్రదర్శనములో ఉంచిన పత్రికలు మొదలగువాని వివరములు:—

| | |
|---|---|
| తెనుగు పత్రికలు | ౮౯ |
| ఇంగ్లీషు పత్రికలు | ౨౬ |
| హిందీ పత్రికలు | ౧౬ |
| గ్రంథాలయ భవనములయు, వార్షికోత్సవములయు, సేవకులయు పటములు | ౨౦౦ |
| సాహిత్యసభలు మొదలగువాని పటములు | ౮౫ |
| పురాతన శిల్పచిత్రములు | ౧౨౪ |
| కాంగ్రెసు నాయకుల అధ్యక్షుల పటములు | ౩౭౫ |
| ఇతర చిత్రములు | ౫౬౦ |
| మొత్తము | ౧౪౭౫ |

ఇవిగాక ఇతరదేశములకు మనదేశమునకు వివిధవిషయములలో గల వ్యత్యాసములను తెలుపులెక్కల పట్టీలు ౧౮ ప్రదర్శింపబడినవి. ౧౯౩౦ సం॥ము నుండి ఇప్పటివఱకు గ్రంథాలయోద్యమమును గుఱించిన వివిధోపన్యాసములును, మహాసభలకు సంబంధించిన ఒక ఫైలును ప్రదర్శింపబడినవి.

విజ్ఞానవ్యాప్తికి ఇట్టి ప్రదర్శనముల అవశ్యకతను గుఱించి అధ్యక్షులవారును, శ్రీయుత కస్తూరి కుటుంబరావు, చావలి కోటేశ్వరరావు, యార్లగడ్డ శ్రీకృష్ణచౌదరి గార్లును ఉపన్యసించిరి.

## తాడేపల్లిగూడెం తాలూకా

### నూతనగ్రంథాలయ ప్రారంభోత్సవము, కొండ్రుప్రోలు.

ఈ గ్రామములో ౨౨-౩-౩౭ వ తేది సాయంకాలము ౪ గంటలకు శ్రీయుత విశాల వీరభద్రరావు పంతులుగారి అధ్యక్షతను శ్రీబాలాత్రిపురసుందరి గ్రంథాలయము అను పేరట నూతన గ్రంథాలయ ప్రారంభోత్సవము, అత్యంతోత్సాహముతో జరుపబడెను. సభకు షుమారు ౫౦౦ హాజరయిరి.

ప్రారంభముననే, గ్రామస్థులు మేళ తాళములతో, గ్రంథాలయనాయకులను ఊరివెలుపలను ఎదుర్కొని, వీధులలో నగరసంకీర్తనముతో సభాస్థలికి చేర్చిరి.

బాలికలచే దైవప్రార్థన గావింపబడినపిమ్మట, ఆహ్వానసంఘాధ్యక్షులు శ్రీయుత తల్లాప్రగడ వీరవెంకయ్యగారు గ్రంథాలయావశ్యకతనుగురించియు, గ్రంథాలయాభివృద్ధికి గ్రామస్థుల బాధ్యతనుగురించియు తెలిపి, అధ్యక్షులను సభ జరుపగలందులకు కోరిరి.

అధ్యక్షులు, వీరభద్రరావుపంతులుగారు, సుమారొక గంట ప్రజానురంజకముగా గ్రంథాలయములు, గ్రామపునర్నిర్మాణమునకును జాతిపునర్నిర్మాణమునకు ఉపయోగించుననియు గ్రంథాలయోద్యమము అన్ని ఉద్యమములకు పునాదియై విజ్ఞానము పెంపొందించుననియు రాజకీయ విజ్ఞానము దేశస్వాతంత్ర్యమునకు తోడ్పడుననియు నూతన రాజ్యాంగ మార్పులలో కాంగ్రెసుమంత్రులు గ్రంథాలయములకు ఎక్కువ తోడ్పడుదురనియు ఉపన్యసించిరి.

తాలూకా గ్రంథాలయ సంఘ కార్యదర్శి డాక్టరు తేతలి సత్యనారాయణమూర్తిగారు గ్రంథాలయ నిర్వాహ

కుల విధులను వివరించి గ్రంథాలయాభివృద్ధికి గ్రామస్థుల సహకారము, ఐకమత్యము ముఖ్యమని తెలిపిరి. శ్రీయుత తుమ్మలపల్లి నాగరాజాగారు అధ్యక్షులకును ఉపన్యాసకుల కును కృతజ్ఞతావందనముల నర్పించిరి.

పిమ్మట డాక్టరు సత్యనారాయణగారు మ్యాజికులాంతరు సహాయముతో ౧. అంటరానితనమునుగురించియు ౨. దేశ స్వాతంత్ర్యమునకు పాటుబడుచున్న దేశనాయకులనుగురించియు 3. సహకారోద్యమమును గురించియు ఉపన్యసించిరి. సభ రాత్రి 9 గంటలకు ముగిసెను.

శ్రీయుత తుమ్మలపల్లి కామరాజుగారు అతిథులకు రాత్రి విందొసంగి సత్కరించి ఆహ్వానసంఘమువారు చక్కటి యేర్పాటులను గావించిరి.

## శ్రీ పోతనపుస్తక భాండాగారము,

## నిడమర్రు.

౧౭-3-3౭ తేదీని పోతన పుస్తక భాండాగార కార్య నిర్వాహక వర్గపు ఎన్నికలు— శ్రీయుత శృంగారకవి పాపారావుగారిఅధ్యక్షతను జరిగినవి.

శ్రీయుత మంగు వెంకట చలపతిరావుగారిని అధ్యక్షులుగను, నిడమర్తి వెంకట ఉమామహేశ్వరావుగారిని ఉపాధ్యక్షులుగను, శృంగారకవి నరశింహంగారిని కార్యదర్శిగను, నిడమర్తి కృష్ణమూర్తిగారిని, నిడమర్తి లక్ష్మీనారాయణగారిని కార్యనిర్వాహక సభ్యులుగను ఎన్నుకొనిరి. భాండాగారమును అభివృద్ధికి తెచ్చుటకును, త్వరలో రిజష్టరీ చేయించుటకును ౮-౪-3౭ తేదీని రానున్న భాండాగార యాత్రికులకు స్వాగత మిచ్చుటకును తగిన యేర్పాట్లు చేయుటకును, తీర్మానించియున్నారు.

## అనంతపురంజిల్లా

## శ్రీసర్వతీనిలయము, ధర్మవరము.

పై గ్రంథాలయపు పదునాఱవ వార్షికోత్సవము ౨౮-౨-3౭ తేదీని శ్రీజాషువకవిగారి అధ్యక్షతను అత్యంతవైభవముగ జరిగెను. శ్రీ శివశంకరం, హట్టి శంకరరావు, అక్కి పెద్దిసుబ్బయ్యపంతులుగార్లు మొదలగువారు సభలో పాల్గొనిరి. అధ్యక్షుడు తన తొలితుది ఉపన్యాసములను శ్రోతలు రంజిల్ల తాను రచించిన మృదుమధుర పద్యములలో నిమిడ్చి వినిపించి అమితానందమును చేకూర్చె.

## కర్నూలుజిల్లా

## శ్రీ సీతానాథ్ గ్రంథాలయము

## తిమ్మానాయునిపేట.

(౪-౮-3౫ మొదలు, ౨౮-౨-3౭ వరకు, ప్రథమ నివేదికా సంగ్రహము.)

౪-౮-3౫ తేదీని ఈ గ్రామమునందు విద్యాభిమానులయిన ఉప్పలూరు గ్రామకరణం శ్రీ వెంకట సుబ్బయ్య, సీతానాథ్ గార్ల ప్రోత్సాహము చేతను బ్రహ్మశ్రీ ఆచికూచి వెంకటసుబ్బయ్య బి. పి. యం. గారి యాజమాన్యము క్రిందను కొందరి మిత్రుల సహాయముననుపై నామముతో నొక గ్రంథాలయము స్థాపింపబడినది.

## కార్యనిర్వాహకవర్గము

బ్రహ్మశ్రీ ఆచికూచి వెంకట సుబ్బయ్య, బి. పి. యం అధ్యక్షుడు, (౨) శ్రీమాన్ మున్నంగి వెంకటాచార్లు, (3) మ. రా. శ్రీ బి. రామచంద్రశర్మ, కార్యదర్శి, (౪) భీమగొని ఈడిగ మునెయ్య, (౫) రాయింకి నరసింహయ్య, రామకృష్ణాపురము, (౬) బెల్లంకొండ సుబ్బయ్య, (౭) డాక్టర్ వరికూటి రామయ్య, (౮) బెల్లంకొండ సుబ్బన్న, సహాయకార్యదర్శి.

పైగ్రంథాలయమునందు సభ్యులుగ చేరుటకు ప్రవేశ రుసుము రు ౨-౦-౦ నెలచందా ౪ అణాలు.

ఇప్పుడు గ్రంథాలయమునందు ౨౭౧ గ్రంథములు ఉన్నవి. ఈగ్రంథము లన్నియు గ్రంథాలయ కార్యనిర్వాహక సంఘసభ్యులవల్లను గ్రంథాలయసభ్యులవల్లను గ్రంథాలయ స్థాపకునివల్లను ఇతర భాషాభిమానులవల్లను ఉచితముగ సమకూర్పబడినవి.

## గ్రంథాలయమునకు వచ్చుచున్న వార్తాపత్రికలు

| | |
|---|---|
| దినపత్రికలు : | ఆంధ్రపత్రిక, జనవాణి |
| వారపత్రికలు : | ప్రజామిత్ర, త్రిలిఙ్గ |
| నెలపత్రికలు : | భారతి, గ్రంథాలయసర్వస్వము |

జనవాణి, ప్రజామిత్ర, త్రిలిఙ్గ పత్రికలను కార్యదర్శి బి. రామచంద్రశర్మగారు తెప్పించి ఇచ్చుచున్నారు.

ప్రస్తుతము ధనాభావమువలన ఆంధ్ర, భారతిపత్రికలు తెప్పించుటలేదు.

## గ్రంథాలయమునకు వచ్చి చదువుకొన్న పాఠకులు

౪-౮-3౫ నుంచి ౨౮-౨-3౭ వరకు 3౦౭౧ మంది.

ఇండ్లకు పంపబడిన గ్రంథములు.

సభ్యులవల్ల ౧౮౫ గ్రంథములును, ఇతరులవల్ల ౧౫౨ గ్రంథములును చదువబడినవి.

గ్రంథములును వార్తాపత్రికలును, పంపబడుచున్న పాఠకుల నివాసగ్రామములు ౮.

ఆదాయవ్యయములు.

జమ.

| | |
|---|---|
| ౩౬- ౦-౦ | ప్రవేశరుసుము |
| ౩౧-౧౦-౦ | చందాలు |
| ౨౫-౬-౦ | విరాళములు |
| ౯౩- ౦-౦ | మొత్తము |

ఖర్చు.

| | |
|---|---|
| ౧౨-౦-౦ | చెక్కబీరువ |
| ౨౧-౦-౦ | పత్రికలకు చందాలు |
| ౬ ౦-౦ | ఇంటిబాడుగ |
| ౩ -౦-౦ | తపాలఖర్చులు |
| ౩ -౦-౦ | కూలి చిల్లర ఖర్చులు |
| ౪౫-౦-౦ | మొత్తము |

ప్రస్తుతము నిలువ రు ౪౩-౦-౦ లు.

౨౮-౨-౩౨ వరకు గ్రంథాలయమునకు రావలసిన చందాలు బనూలు కాక, రు ౨౦-౦-౦ లు.

# జీవకారుణ్య ప్రచారము

## శృంగవరపుకోట ౧౪-౩-౩౨

ప్రతిసంవత్సరము ఈ గ్రామములో మహాశివరాత్రికి ౫దినములు మహోత్సవము జరుగుచున్నది. యాత్రికులు వేనకువేలు బండ్లపై చాలాదూరగ్రామములవారు వచ్చుచు పోవుచునుందురు.

ఈ యాత్రకు వచ్చువారు ౧౦౦ కి ౯ మంది మాంసాహారులే.

అనకాపల్లి శ్రీసుజనసమాజకార్యదర్శి మ॥ రా॥ శ్రీ పీలా అప్పలనరసయ్యనాయుడుగారు ౧౦-౩-౩౨ తేదీ బుధవారము ఉదయమునకే యిచ్చటికి దయచేసి, కొన్ని సభలు జరుపుచు, మాంసాహారము చే మానవునకుకలుగు కష్టనష్టములను గూర్చియు, కోపతాపములను గూర్చియు, పాపములను గూర్చియు, మద్యపాననిషేధమునుగూర్చియు, ఉపన్యసించుచు, వారిచే రచించబడిన "అహింసాశారదా పాట" అను పుస్తకములును, పలువిధములైన కరపత్రములును, ఉచితముగా పంచిపెట్టిరి.

ఈ గ్రామములో వీరిచే నొకసంఘమును స్థాపింప ప్రయత్నించుచున్నాము.

మోపాడ సత్యనారాయణ,
గ్రామ మునసబు.

## గురంపాలెము ౮-౩-౩౨

౨౫-౨-౩౨ తేదీ మొదలు ౭-౩-౩౨ తేదీ వరకు అనకాపల్లి సుజనసమాజ ప్రచారకులు శ్రీయుతులు వేలం వెంకటరమణగారు విశాఖపట్టణము తాలూకాలో, పెందుర్తి, సరిపల్లి. జంగాలపాలెము, చింతలపాలెము, ముసిడివాడ, వేపగుంట, వెంకటాపురం, సౌభాగ్యపుర అగ్రహారము, గోపాలపట్టణము, సింహాచలము మొదలగు గ్రామములలో ప్రచారముచేసి, నేడు మాగ్రామము వచ్చి జీవకారుణ్యోపన్యాసము నొసగిరి. సదరు ప్రచారకులు మాంసాహారము మానవునకు సహజమైన ఆహారము కాదని శాస్త్రము ననుసరించియు, మానవ దేహేంద్రియ నిర్మాణము ననుసరించియు, యుక్తియుక్తముగ బోధించిరి. వీరి ఉపన్యాస ఫలితముగ పైగ్రామ ప్రజలలో ౨౦ మంది మద్యపాన మత్స్య మాంసాహారములను హృదయపూర్వకముగ విసర్జించుచున్నామని ప్రమాణపత్రములను కూడ నిచ్చిరి.

కాపుగంటి వెంకటస్వామి.

# ౩ వ పశ్చిమ గోదావరిజిల్లాసభ,

# ౪ వ భీమవరముతాలూకా గ్రంథాలయ మహాసభ

ది ౨౪-౧-౧౯౩౭ తేది ఆదివారము పగలు ౨ గంటలకు పాలకోడేరు గ్రామములోని మహాదేవ గోవింద రానడే గ్రంథాలయభవనమందు పైమహాసభలు శ్రీయుత మారేపల్లి రామచంద్రశాస్త్రి, డాక్టరు తేతలి సత్యనారాయణమూర్తిగార్ల అధ్యక్షతలను మహావైభవముతో జరిగినవి. అన్నితాలూకాలనుండియు గ్రంథాలయ ప్రతినిధులును, గ్రంథాలయాభిలాషులును సుమారు ౩౦౦ మంది సభలకు దయచేసిరి. జిల్లా గ్రంథాలయమహాసభాధ్యక్షులు, ఎటుల గ్రంథాలయములు ప్రజోపయోగములో, ఎవ్విధమున, ప్రజల దృక్పథమును సక్రమమార్గమున మార్పగలవో, ఎవ్విధమున విజ్ఞానసాంఘికాధ్యాత్మికాభివృద్ధి కలుగునో మొదలగు విషయములతో విపులముగ మహోపన్యాసము గావించిరి. డాక్టరుగారు గ్రంథాలయాభివృద్ధికి చేయు ప్రయత్నములలో ఎట్టి ఆటంకములు కలుగునో, ముఖ్యముగ జిల్లాబోర్డు పంచాయతీ గ్రంథాలయములు ఎట్టి హీనస్థితిలోయున్నవో, అందరకు విజ్ఞానముకలుగ చేయు వార్తాపత్రికలు సహితము పంచాయతీ గ్రంథాలయములు తెప్పించుకోవలయుననిన ఎంత కృషిచేయవలెనో, అట్టి ఖర్చులకు పూర్వమే యినస్పెక్టరు ఆఫ్‌లోకలుబోర్డ్సు అనుమతి జిల్లా పంచాయతీ ఆఫీసరుద్వారా పొందుట ఎంత కష్టమో, జిల్లాపంచాయతీ ఆఫీసరుగారి ఆఫీసులో మాసముల తరబడి యిట్టి దరఖాస్తులు ఎట్లు నిలువబడియున్నవో గ్రంథములు కొనుటలో కూడ విద్యాశాఖాధికారిఅనుమతి పొందుటలోని కష్టములెట్టివో, యీ విద్యాశాఖాధికారులు గ్రంథాలయములనుండి వారు కొనదలచిన గ్రంథముల పట్టికలో ఏవిధమైన సబబులేక ఒకపట్టికలో ఆమోదించిన గ్రంథములను ఇంకొక పట్టికలో తీసివేయుట కలుగుచున్నదో మొదలగు విషయములతో స్వానుభవముమీద ఉపన్యాసమిచ్చిరి.

ఈ మహాసభలను ప్రారంభించుచు, శ్రీయుత మండలపర్తి ఉపేంద్రశర్మగారును, ఆంధ్రదేశగ్రంథాలయ సంఘకార్యదర్శి శ్రీయుత అయ్యంకి వేంకటరమణయ్య పంతులుగారును గ్రంథాలయావశ్యకత, వానినడవడిక, వానిఅభివృద్ధి మొదలగు విషయములను విపులముగా నుపన్యసించిరి.

తరువాత శ్రీ ఆత్మకూరి గోవిందాచార్యులుగారు రైతు, పన్నుభారము, శాసనసభల బాధ్యతలను గురించియు, ఇతర విషయములను గురించి తాడిమేటి కుటుంబశాస్త్రిగారు, వితాల వీరభద్రరావుగారు మొదలగు పెక్కుమంది ఉపన్యాసములిచ్చిరి.

రాబోవు సం॥ రము జిల్లా గ్రంథాలయ మహాసభను శ్రీ చందారెడ్డి గ్రంథాలయమువారు, నిడదవోలికి ఆహ్వానించిరి. భీమవరముతాలూకా గ్రంథాలయ మహాసభను శ్రీ రామమోహన గ్రంథాలయమువారు జువ్వలపాలెమునకు ఆహ్వానించిరి.

# విజ్ఞప్తి

ప్రాచీన హిందూదేశ రాజ్యాంగ చరిత్ర కొరకు గుంటూరుమండల గ్రంథాలయ సంఘోపాధ్యక్షులు, కస్తూరి కుటుంబరావుగారు, కనగాల, అని వ్రాయుచున్నారు. పై పుస్తకము కావలసిన గ్రంథాలయములవారు రేపల్లె తాలూకా గ్రంథాలయ సంఘము, రేపల్లె. అని వ్రాయవలెను. లేసియెడల సకాలమునకు పుస్తకములు రావు.

రేపల్లెతాలూకా గ్రంథాలయ సంఘము,
11—3—37.

ఇట్లు
కాండూరి సీతారామయ్య,
కార్యదర్శి.

# భీమవరంతాలూకా గ్రంథాలయ సంఘసభ

ఈ సభ 24-1-1937 తేదీన శ్రీ మారేపల్లి రామచంద్రశాస్త్రిగారి అధ్యక్షతక్రింద జరిగినది.

## కార్యదర్శి నివేదిక

భీమవరము తాలూకా గ్రంథాలయ మహాసభ ది ౩-౫-౩౬ తేదిని జరిపియున్నారము. అప్పటికి పాలకోడేరు గ్రామంలోని శ్రీ మహాదేవ గోవిందరేనడే గ్రంథాలయమువారు ఆహ్వానించినందున వారి ఉత్సాహమువలన ఈ సంఘ మహాసభ ఈ సం॥రము జనవరినెలలోనే జరపవలసి వచ్చినది. అందువల్ల సంవత్సరము పూర్తి కాలేదుగనక ఈ నివేదిక ౩-౫-౩౬ నుండి ౨౪-౧-౩౭ వరకు అనగా సుమారు ౮ మాసములదిమాత్రమే యని మనవిచేయుచున్నాడను. ఈ తాలూకాయందు ఈ సం॥రము నూతనముగా ౧ కలసెపూడి గ్రామములో శ్రీరామ గ్రంథాలయమును, ౨ అయిభీమవరము గ్రామములో నారాయణరాజ గ్రంథాలయమును, నెలకొల్పబడినవి. మొత్తము మన తాలూకాయందు ౫౮ గ్రంథాలయములు కలవు. వెనుకటి సంవత్సరమున ౩౨ గ్రంథాలయములు తాలూకా సంఘమునకు చందా చెల్లించియుండగా ఈ సం॥రము ౧౪మాత్రమే చెల్లించియున్నవి. తతిమ్మా సంఘములన్నియుకూడ తాలూకా చందా చెల్లించిగాని, గ్రంథాలయ సర్వస్వమునకు చందాదారులుగా చేరిగాని ఈఉద్యమమును ప్రోత్సాహించగలందులకు కోరనైనది.

ఈ గ్రంథాలయములు ఏకోన్ముఖముగాను, సక్రమముగాను పనిచేయుటకు, తరుచు తాలూకా సంఘమువారు చూడవలసియున్నది. ఇందుకుగాను ఈ సంఘకార్య నిర్వాహక వర్గమువారిని కొన్ని గ్రంథాలయములు తరుచు చూడగలందులకు కోరియున్నాము. కాని చురుకుగా పనిజరగలేదనియే చెప్పవలెను. చాల గ్రంథాలయముల యందు శ్రద్ధతక్కువగానే ఉన్నది. కొన్ని గ్రామముల యందు పత్రికలైనను గ్రంథాలయములకు చేరుటలేదు. గ్రామములోని ఏపెద్దలో ఆపత్రికలను దారిలోనే తీసికొని, వారి గుమ్మమువద్దనే కూర్చుండి చదువుకొనెదరు. అందువలన గ్రంథాలయములలో గ్రామస్థులు చేరుటలేదు. ఈ విషయములన్నియుచూచియే కార్యక్రమము సక్రమముగా జరుగుటకును, గ్రంథాలయాభిలాషను ప్రజలలో కలిగించుటకును, తరచు గ్రంథాలయయాత్రలు ఏర్పాటు చేయబడుచున్నవి.

ఈ ౮ నెలలలోను సుమారు ౮ గురు యాత్రికులు ౧౬ రోజులలో ౩౭ గ్రంథాలయములను దర్శించిరి. రెండు నూతన గ్రంథాలయములను స్థాపించిరి. అన్ని గ్రంథాలయములలోను కునూతనోత్సాహము కలుగచేసి సుమారు ౩౧ గ్రామములలో బహిరంగసభలు జరిపిరి. ఇందు వృద్ధులయ్యు మిగుల ఉత్సాహముతో సంచారము చేయుచున్న యీగ్రంథాలయ సంఘాధ్యక్షులగు శ్రీయుత భూపతిరాజు తిరుపతిరాజుగారి నెక్కువగ కొనియాడతగియున్నది. వారికంటె చిన్నవారమగు మాబోటిసేవకులు వారి పట్టుదలను ఉత్సాహమునుచూచి సిగ్గుపడవలసియున్నది. ఈసాలువ హజారాజిల్లా గ్రంథాలయసంఘకార్యదర్శియగు శ్రీ దత్తుగారును వారి సతీమణియు, ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘ కార్యదర్శికూడ మాతాలూకాలో ౧౨ గ్రంథాలయములను చూచిరి. మాకు యాత్రలలో ఎక్కువ సహాయముచేసి అనేక కష్టములకు పాల్పడిన శ్రీయుతులు మారేపల్లి రామచంద్రశాస్త్రి కవిశేఖరులకును, ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘ కార్యదర్శియగు అయ్యంకి వేంకటరమణయ్యగారికిన్ని గుంటూరు హిందూకళాశాలోపన్యాసకులగు మండలపర్తి ఉపేంద్రశర్మ బి ఏ. ఆనర్సుగారికిని తాలూకా గ్రంథాలయ సంఘకార్యదర్శియగు వే. సూరపరాజుగారికిని,వ. రాజారావుగారికిని ఆంధ్రవిశ్వవిద్యాలయములో గ్రంథాలయశిక్షణముపొందువిద్యార్థి శ్రీధర నారాయణమూర్తిగారికిన్ని ఈ సంఘపక్షమున అనేకవందనములర్పించుచున్నాను. వీరందరును తిరిగి యీ సం॥రముకూడ ఉత్సాహముతో యాత్రలుజరిపి గ్రంథాలయోద్యమమును పెంపొంద చేయ ప్రార్థితులు.

అన్ని గ్రామములలో ఈ గ్రంథాలయములు పనిచేయుటకు ఈతాలూకాకు మంచిఅవకాశములుకలవు. ఈగ్రంథాలయములే గ్రామ పునర్నిర్మాణమునకును ప్రజల భావిభాగ్యోదయమునకును మూలాధారములని గ్రహించవలసియున్నది.

## తీర్మానములు

౧ ఆదాయవ్యయ పట్టికను ఆమోదింపనైనది.

౨ జిల్లా గ్రంథాలయసంఘమువారిచే తయారు కాబడిన ప్రణాళికను త్వరలో ఆచరణయందుంచుటకు తగిన ప్రయత్నములు చేయగలందులకు జిల్లా గ్రంథాలయసంఘమువారిని కోరనైనది.

౩ తాలూకా కేంద్రస్థానమందలి జిల్లాబోర్డు పబ్లిక గ్రంథాలయమును తాలూకా గ్రంథాలయసంఘమునకు పరిపాలననిమిత్తము స్వాధీనపర్చ గలందులకు ఏలూరు జిల్లాబోర్డు అధ్యక్షులను కోరనైనది.

౪ తాలూకాయందలి బీద గ్రంథాలయములకు ఆంధ్ర పత్రికకు సాలీనా చందా రు ౧౮/-లకు తగ్గించినందులకు ఈసభవారికృతజ్ఞతావందనములు ఆంధ్రపత్రికాధిపతులగు శ్రీ దేశోద్ధారక విశ్వదాత కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారికి అర్పించుచూ, భారతిమాసపత్రికకు కూడ సాలీనా చందా రు 4/-లకు తగ్గించగలందులకు కోరనైనది.

౫ తాలూకాలోని గ్రామ గ్రంథాలయములు తాము గ్రంథములు కొనదలచినప్పుడు తాలూకా సంఘమువారి సలహాతీసికొనగలందులకు కోరనైనది.

౬ తాలూకాలోని అన్ని గ్రంథాలయములును గ్రంథాలయసర్వస్వమునకు చందాదారులుగ చేరి, అందువల్లనే తాలూకా, జిల్లా, ఆంధ్రదేశగ్రంథాలయసంఘములలో సభ్యులు కాగలందులకు ఆ గ్రంథాలయనిర్వాహకులను కోరనైనది.

౭ గ్రంథాలయములవారందరును వార్షికోత్సవములు జరిపి, వార్షిక నివేదికలు తాలూకా గ్రంథాలయసంఘమునకు పంపవలెనని కోరనైనది.

౮ ఈ దిగువవారిని ౧౯౩౭-౩౮ సం॥రమునకు కార్య నిర్వాహకవర్గ సభ్యులుగా ఏర్పర్చి, వారిగ్రూపు పేర్ల యెదుట వ్రాసిన గ్రంథాలయములు వారితనిఖీక్రింద ఉండునట్లు ఏర్పర్చి, వారుగ్రంథాలయాభివృద్ధి చేయవలెనని కోరనైనది.

(౧) భూపతిరాజు తిరుపతిరాజుగారు, కుముదపల్లి (౨) వేగేశ్న సూర్పరాజుగారు, పాంమువ్వ (౩) పెద్దాడ వరసింహమూర్తిగారు, భీమవరము (౪) పస్తుల సాగరంగారు, చెన్నరంగనిపాలెము (౫) వల్లపరాజు వెంకటతిరపతిరాజుగారు, శృంగవృక్షము (౬) రాయనిశ్రీరామమూర్తిగారు, నాదూరు (౭) ఇందుకూరి సోమరాజుగారు, పెదఅమిరము (౮) కొండేపూడి వెంకటచలపతిరావుగారు, బొండాడ (౯) పిన్నంరాజు రామరాజుగారు, దుంపగడప (౧౦) గోకరాజు శ్రీరామరాజుగారు, జువ్వలపాలెం (౧౧) గాదిరాజు సుబ్బరాజుగారు, మహదేవపట్నము (౧౨) కొత్తపల్లి వెంకటాద్రిజుగారు, పాలకోడేరు (౧౩) పాలకోడేటి సత్యనారాయణశర్మగారు, భీమవరము.

ఇందులో వేగేశ్న సూర్పరాజుగారిని అధ్యక్షులుగాను పాలకోడేటి సత్యనారాయణశర్మగారిని .కార్యదర్శిగాను గోకరాజు శ్రీరామరాజుగారిని సహాయ కార్యదర్శిగాను ఎన్నుకొన నైనది.

గ్రూపులు

భీమవరముగ్రూపు

రాయలము, కొమరాడ, గొరగనమూడి, కుముదవల్లి.

చెన్నరంగని పాలెము

గునుపూడి, తాడేరు, ఎనమదుర్రు, దిర్సుమర్రు.

శృంగవృక్షము

కొండేపూడి, వేండ్ర, గొర్లమూడి, విస్సాకోడేరు, వీరవాసరము.

కోణితివాడ

నాదూరు, అండలూరు, నేలపోగుల, రాయకుదురు, తోలేరు, సూర్పరాజుపేట

పెదఅమిరము

చినఅమిరం, వాండ్రము, పెదపుల్లేరు.

బొండాడ

కోపల్లె, జక్కరము, వేంపాడు, సీసలి.

దుంపగడప

సిద్ధాపురము, ఆకివీడు

జువ్వలపాలెము

అయిభీమవరము, చెరుకుమిల్లి, కాళ్ళకూరు, కాళ్ళ, కోలనపల్లి.

మహాదేవపట్టణము

ఉండి, చిలుకూరు, చెఱుకువాడ, కలిసిపూడి.

పాలకోడేరు

మోగల్లు, కోరుకొల్లు, గొల్లలకోడేరు, గరగపర్రు, లైప.

## భీమవరంతాలూకా గ్రంథాలయయాత్ర

కవిశేఖరుడు, దేశనాయకుడు, గ్రంథాలయ సేవకాగ్రేసరుడునగు శ్రీయుత మారేపల్లి రామచంద్రశాస్త్రిగారి నాయకత్వమున ఈయాత్ర 16-4-37 వ తేదీన కోపల్లి గ్రామమున ప్రారంభింపబడినది. ఈయాత్ర 27-4-37 తేదీవరకు జరుగును. దినమునకు రెండుగ్రామములు ప్రతి గ్రంథాలయమునకు వార్షికోత్సవముగూడ ఏర్పాటు చేయబడినది. భీమవరంతాలూకా తాడేపల్లిగూడెం తాలూకాలలోని సుప్రసిద్ధనాయకులు అధ్యక్షత వహించుచున్నారు.

# దివి తాలూకా

## ద్వితీయ గ్రంథాలయ మహాసభ,

### పెదకళ్లేపల్లి - కృష్ణాజిల్లా.

పై సభ ది 11-3-37 తేదీన మధ్యాహ్నం 1-30 గంటలకు పెదకళ్లేపల్లి గ్రామమునందు కృష్ణాజిల్లా సెషన్సు జడ్జీగారగు టి. యస్. రామచంద్రన్ యం. ఏ., ఐ. సి. యస్. బార్ అట్ లాగారి అధ్యక్షతక్రింద జయప్రదముగా జరిగినది.

మార్గమధ్యమున శ్రీజడ్జీగారికి మాజేరు భోగిరెడ్డిపల్లి పూషడం లంకపల్లి గ్రామముల గ్రంథాలయములవారు పుష్పమాలలను సమర్పించిరి. శ్రీవారు లక్ష్మీపురం పెదకళ్లేపల్లి గ్రామములయందలి గ్రంథాలయములను దర్శించిరి.

శ్రీయుత బుద్ధకుటుంబరావుగారి చేకోరబడి అధ్యక్షులు అధ్యక్షపీఠ మలంకరించిరి. దివితాలూకా గ్రంథాలయ సంఘాధ్యక్షులగు పేకమళ్ళ రామచంద్రరావు పంతులు ఎం. ఏ. బి. ఎల్. గారిచే స్వాగత మీయబడెను. అధ్యక్షుని తొలిపలుకులు సంఘకార్యదర్శి మాజేటి రామచంద్రరావుగారిచే నివేదిక చదవబడియె. శ్రీయుతులు డాక్టరు గుంటూరు సుబ్బారావు, బుద్ధ కుటుంబరావు బి. ఏ. బి. యిడి, పుచ్చా శివరామకృష్ణశాస్త్రి బి. ఏ. ఎల్. టి. కొజ రాధాకృష్ణ శాస్త్రిగా ర్లుపన్యసించిరి. యీదిగువ తీర్మానములు గావింపబడిన పిమ్మట అధ్యక్షుల ముగింపు ఉపన్యాసము శ్రీయుత బుద్ధ కుటుంబరావుగారి అభివందనములతో సభ జయప్రదముగా ముగిసినది.

#### తీర్మానములు

1. దివితాలూకా ప్రజల తరఫునను గ్రంథాలయముల తరఫునను శ్రీషష్టమ జార్జిచక్రవర్తిగారి పట్టాభిషేకమున తమ రాజభక్తిని వెల్లడించుచున్నారు.

2. ఈతాలూకాయందలి అన్నిగ్రామములందును సర్వజనీన గ్రంథాలయములను స్థాపించుటకు ఆయాగ్రామవాసులను యీసభవారు హెచ్చరించుచున్నారు.

3. ఈతాలూకాకును దేవరకోట ఎస్టేటుకును కేంద్రస్థానమగు చల్లపల్లియందు తాలూకా కేంద్ర గ్రంథాలయమును వెంటనే స్థాపించవలెనని శ్రీచల్లపల్లి రాజాగారిని తూర్పు కృష్ణాజిల్లాబోర్డువారిని, యీసభవారు కోరుచున్నారు.

4. గ్రామసేవాపద్ధతులందును, అందుముఖ్యముగ గ్రంథాలయవిషయములందును తరిబీతుపొందుట గ్రామగ్రంథాలయములవారికి అత్యవసరమనియు, ఇందుకుగాను బందరు అకాడమీ ఆఫ్ కల్చరువారిచే ఏటేట ఏర్పాటు చేయబడుచున్న వేసవి తరగతులలో చేరుట యుక్తమనియు యీ సభవారు తీర్మానించుచున్నారు.

5. ప్రతి గ్రామమందును పనిచేయుచున్న బోర్డు ఉపాధ్యాయులు విద్యావ్యాప్తికొరకై గ్రంథాలయములలో కార్యనిర్వాహక సభ్యులుగ నుండుటకు తగిన అవకాశము దయచేయించ గలందులకు తూర్పు కృష్ణాజిల్లా బోర్డువారిని యీ సభవారు కోరుచున్నారు.

6. తాలూకాలోని గ్రంథాలయములు 1 స్థలమును, 2 భవనమును, 3 గ్రంథములను 4 గ్రంథాలయసేవకులను కలిగి యుండుటకు అవసరమగు ఏర్పాట్లను చేయవలెనని 1 జిల్లాబోర్డువారిని 2 శ్రీచల్లపల్లి రాజాగారిని దివితాలూకా గ్రంథాలయ సంఘమువారు కోరుట యుక్తమని యీసభవారు తీర్మానించుచున్నారు.

7. దివితాలూకాలోని పరిశ్రమల విషయమై తూర్పు కృష్ణాజిల్లా బోర్డువారు నియమించిన ఉపసంఘమువారు దివితాలూకా గ్రంథాలయ సంఘముతో సంప్రతించుట అవసరమని యీసభవారు అభిప్రాయపడుచు జిల్లాబోర్డువారిని దివితాలూకా గ్రంథాలయ సంఘమువారిని యీవిషయమై తగు కృషి చేయవలయునని కోరుచున్నారు.

8. దివితాలూకా తృతీయగ్రంథాలయమహాసభ నంగేగడ్డలో జరుపుటకు డాక్టరు గుంటూరి సుబ్బారావుగారి అహ్వానము అంగీకరించడమైనది.

---

## విశాఖపట్నముజిల్లా.

### అచ్యుతరామ గ్రంథాలయం,

### శాసనము, టెక్కలిపోస్టు.

ఈ గ్రంథాలయపు 17వ వార్షికోత్సవము 27-3-37వ తేదీని మండపాక పార్వతీశ్వరశాస్త్రిగారి అధ్యక్షతక్రింద జయప్రదముగా జరిగినది మొత్తము 350 పుస్తకములు కలవు. సంవత్సరాదాయము రు. 26 లు. సదరుత్సవమునకు నూటికిపైగా సభికు లేతెంచిరి. పైగ్రామస్థులు, స్త్రీలు కూడ వచ్చిరి. కార్యనిర్వాహక సంఘమునకు రావి ఫల్గుణరావుగారు కార్యదర్శిగను, నిష్టల కామేశ్వరరావుగారు అధ్యక్షులుగను, మల్లపరెడ్డి బైరాగినాయుడుగారు కోశాధ్యక్షులుగను నెన్నుకొనబడిరి.

# తాడేపల్లిగూడెం తాలూకా

## గ్రంథాలయ సంఘము
### త్రైమాసిక నివేదిక

**(1—1—37 నుండి 31—3—37 వరకు)**

**2-1-37** (జగన్నాథపురం) శ్రీమల్లేశ్వర గ్రంథాలయము ప్రథమవార్షికోత్సవము శ్రీయుత జటావల్లభుల పురుషోత్తంగారి అధ్యక్షతను జరిగెను.

**4-1-37** (కస్పాపెంటపాడు) డాక్టరు పి. ఆర్. రాజగోపాల్ నాయుడుగారును, నేనును, పంచాయితీబోర్డు అధ్యక్షులతో, గ్రంథాలయము తెరుచుటకు ప్రయత్నించవలసినదిగా హెచ్చరించితిమి.

**4-1-37** (యానాలపల్లి) డాక్టరు పి. ఆర్. రాజగోపాలనాయుడుగారు, గ్రూపు డైరెక్టరుఅగు డాక్టరు రామాప్రగడ వెంకటరావుగారును వెళ్లితిమి. శ్రీలక్ష్మీవిలాస గ్రంథాలయమును జూచి సభయందు వ్యాజికోలాంతరు ఉపన్యాస మిచ్చితిని.

**18-1-37** (మాధవరం) శ్రీ భారతి గ్రంథాలయము వద్ద స్థానిక దివ్యజ్ఞాన సమాజమువారి వార్షికోత్సవము, శ్రీయుత రావుబహుదరు మంత్రిప్రగడ నరశింహం పంతులుగారి అధ్యక్షతను జరుపబడెను.

**24-1-37** (పాలకోడేరు) భీమవరంతాలూకా గ్రంథాలయ మహాసభ కధ్యక్షతవహించితిని.

**28-2-37** (వుంగుటూరు) శ్రీ సదాశివరెడ్డి గ్రంథాలయముయొక్క ప్రథమ వార్షికోత్సవము ప॥గోదావరి జిల్లా కలెక్టరుగారగు యస్. వెంకటరామను యం. ఏ. ఐ.సి. ఎస్. గారి అధ్యక్షతను జరుపబడెను.

**28-2-37** (పెదనిండ్రకొలను) శ్రీరామకృష్ణ గ్రంథాలయముయొక్క ప్రథమ వార్షికోత్సవము ప॥గోదావరి జిల్లా కలెక్టరు గారగు యస్. వెంకటరామను యం. ఏ. ఐ. సి. ఎస్. గారి అధ్యక్షతను జరుపబడెను.

**22 3-37** (కొండ్రుప్రోలు) శ్రీబాల త్రిపురసుందరి గ్రంథాలయము శ్రీయుత వితాలవీరభద్రరావుగారి అధ్యక్షతను తెరువబడెను.

తే॥ సత్యనారాయణమూర్తి,
తాలూకా కార్యదర్శి.

## గ్రంథాలయ యాత్ర
### తాలూకాసభ — వార్షికోత్సవములు.

8-4-37 వ తేది ఉదయం 9 గంటలకు తాలూకా గ్రంథాలయ యాత్రను శ్రీయుత అయ్యంకి వెంకట రమణయ్య పంతులుగారు మారంపల్లి గ్రామములో ప్రారంభించిరి. 8-4-37 వ తేది మధ్యాహ్నము 2 గంటలకు నందమూరు గ్రామములో ఈతాలూకా చతుర్థ గ్రంథాలయ మహాసభ శ్రీయుత మారేపల్లి రామచంద్రశాస్త్రి గారి అధ్యక్షతక్రింద జరిగినది. శ్రీయుత గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు సభను ప్రారంభించిరి. ఆరోజుననే మధ్యాహ్నము 1 నుండి 2 గంటలవరకు నందమూరులో తాలూకా గ్రంథాలయ సంఘసమావేశము జరిగినది.

యాత్రికులు ఎనిమిదిదినములలో పదునారుగ్రామములలో గ్రంథాలయములవార్షికోత్సవములనుజరపిరి. ఒకగ్రామమున గ్రంథాలయమును స్థాపించిరి. ఈ యాత్రలో సుప్రసిద్ధ గ్రంథాలయనాయకులు ఉపన్యాసముల నిచ్చిరి. వ్యాజికులాంతరు ప్రదర్శనములు ఆంధ్రనాట్య కళాపరిషత్తువారి నాటకములు ఏర్పాటు చేయబడినవి. యువకులకు గ్రంథాలయ ఉద్యమమునందు శిక్షణ యివ్వబడినది. గ్రంథాలయ పరిపాలకులును, గ్రంథాలయ డైరక్టర్లున్నూ, తదితర గ్రంథాలయోద్యమాభిమానులును ఈకార్యక్రమమునందు పాల్గొని యాత్రను జయప్రదముగా నిర్వహించిరి.

తేతలి సత్యనారాయణమూర్తి,
తాలూకా కార్యదర్శి, 16-4-37.

విజ్ఞానసంపత్తి
దేశాభ్యుదయదాయకము

# తూర్పుకృష్ణాజిల్లా గ్రంథాలయ మహాసభ

18-4-37 తేదీ సాయంకాలము దివితాలూకా మాజేరు గ్రామమున కృష్ణాజిల్లా మెడికల్ ఆఫీసరుగారగు కె. వి. రమణారావు, ఐ. ఎం. ఎస్. గారి అధ్యక్షతక్రింద జరిగినది. జిల్లాయందలి వివిధగ్రంథాలయములనుండి ప్రతినిధులే తెంచిరి. రాబోవు సభ గుడివాడతాలూకాకు ఆహ్వానింపబడినది.

ఆహ్వాన సంఘాధ్యక్షులగు అయినంపూడి గుర్నాధరావుగారి యుపన్యాసము.

గ్రంథాలయోద్యమంపై గల అభిమానంతో వ్యయప్రయాసలు గడించకుండా ఈ కుగ్రామానికి దయచేసిన మీకెల్లరకు ఈ మహాసభ యొక్క ఆహ్వానసంఘ పక్షమున హృదయపూర్వకమైన స్వాగతమును పలుకుటకు సంతసించుచున్నాను. ఏవిశాలభావంతో హర్షపూర్వకంగా మీరీపరిశ్రమపథంలో ప్రవృత్తులైనారో అట్టివిశాలభావముతోనే మాస్వాగత సత్కారాల్లోని లోపాలవల్ల కలిగేకష్టపరంపరనుగూడ లెక్కింపకుందురని నావిశ్వాసం.

సుమారేబదిసంవత్సరాల క్రిందట విశాఖపట్నంలో ఒక ఉపాధ్యాయునిచే నెలకొల్పబడిన చిన్ని గ్రంథాలయమొకటి, ఆయజ్ఞాతసేవకుని సంకల్పబలముచేత, నేడు సహస్రశాఖాసమన్వితమైన ఆంధ్రగ్రంథాలయమహాసౌధానికి మూలబంధమై మనకెల్లరకు చిరస్మరణీయమైన దనుమాట విస్మరింపదగ్గదికాదు. అత్యల్పకాలంలో శ్రీయుతులు అయ్యంకి వేంకటరమణయ్య, నాళం కృష్ణారావు, మారేపల్లి రామచంద్రశాస్త్రి ప్రభృతుల కృషినిమిత్తముగా విశేష వ్యాప్తిని పొందిన ఈ ఉద్యమం తన ప్రాశస్త్యాన్ని చెప్పకయే చెప్పుచున్నది. దేశంలో విజ్ఞాన ప్రచార బాధ్యత వహింపదగ్గ ప్రభుత్వముయొక్క ఉపేక్షాభావ మొకవైపున, ప్రజాసముదాయాన్ని ఆవేశించి విడిచిపెట్టకుండా ఉన్న అవిద్యాపిశాచం ఒకవైపునా, క్రుంగదీస్తున్నా ఈఉద్యమం ఇంతటి పురోభివృద్ధిని గాంచడం ఆశ్చర్యకరమనుటలో సందేహములేదు. కాని మొగమోటమి విడిచి ఒకమారు స్థితిగతులను పర్యాలోచించి చూస్తే ఈ ఉద్యమప్రచారకులు చేస్తున్నశ్రమకు అనురూపమైన ఫలితం కన్పించకుండా ఉన్నదని అంగీకరింపక తప్పదు. ప్రజావిద్యయొక్క వికాసానికి అర్హప్రయత్నాలుజరగకపోవడం, జరుగుచున్న కొద్దిప్రయత్నం దౌర్భాగ్యవశంచేత తప్పుతోవలు పట్టడం గ్రంథాలయోద్యమంయొక్క నిజమైనఔన్నత్యానికి ప్రబలాటంకములని నానిశ్చితాభిప్రాయం.

జాతీయ సౌధానికి విద్యాసంస్థలు పునాది. గ్రంథాలయాలు పైకప్పు. గ్రంథాలయోద్యమానికి ఎడమీయని విద్యాప్రణాళిక గాని విద్యాసంస్కృతికి తలపెట్టని గ్రంథాలయోద్యమంగాని యెన్నిటికీ సమగ్రంకాజాలదు. హార్టాగ్ కమిటీయొక్క మదింపుప్రకారం ప్రారంభవిద్యకై వ్యయింపబడుచున్న మొత్తంలో నూటికి అరవైవంతులు దుబారాయగుచున్నది. మొదటితరగతిలో ప్రవేశించిన నూరుమంది విద్యార్థుల్లో నాల్గవతరగతి వచ్చునప్పటికి 18 మంది మాత్రమే నిల్చుచున్నారు. గ్రంథపఠనాభ్యాసం లేకపోవడంచేత వీరిలో ఎందఱుతిరిగి అవిద్యాపధానపడుతున్నారో చెప్పనక్కరలేదు. అక్షరాస్యులందఱినీలెక్కిస్తేనే నూటికిపది లేనపుడు గ్రంథాలయాలకు వెళ్లి తత్ సమగ్ర ప్రయోజనం

పొందడానికి సమర్థతగల విద్యావంతుల సంఖ్య ఇంకను అల్పంగా ఉండకతప్పదు. కాబట్టివిద్యా సంస్థలను సమీచీనపద్ధతులపై నడిపించడానికి ప్రజాందోళన జరగాలి. అవకాశం ఉన్నంతలోనే విద్యావిధానాన్ని గ్రామజీవితాని కనుకూలంగా పారులేకుండా ఉండేటట్టు సంస్కరించడానికి విద్యాశాఖకు బాధ్యతవహించిన అధికారులు అనధికారులు అందరు పూనుకొనుటకు ప్రజల వైపుననుండి ఒత్తిడి కలగాలి.

బరోడాలోని గ్రంథాలయోద్యమం ఆదర్శప్రాయంగా ఎందుకు పరిగణింప బడుతున్నది? 1906 లో నిర్బంధోచితప్రారంభవిద్యను అమలు జరిపి తద్వికాసమునకై 1914 లో అమెరికా పండితుల సంచాలకత్వంక్రింద గ్రంథాలయోద్యమానికి పునాదివేసినాడా మహారాజు తత్ఫలితంగా ఆసంస్థానంలో సుమారు వెయ్యిగ్రంథాలయాలను సంస్థానప్రజలలో నూటికి సుమారు 74 గురు ఉపయోగించుకొనగలుగుతున్నారు. అట్లు కాకుండా విద్యాసంస్థలలోని కుళ్లును అట్లే యుంచి ఎన్నిగ్రంథాలయాలు నెలకొల్పినా, తన్మార్గమున ఇంకేవిధమైనకృషిసల్పినా పర్యాప్తమైన ప్రయోజనం లభించడం అసాధ్యమని నాయూహ.

కాబట్టి గ్రంథాలయ సంఘాలయొక్క కార్యప్రణాళికలో విద్యాప్రచారానికికూడ యథోచితమైన స్థానం యిచ్చి విద్యాప్రచారంపేరిట నేడు దేశంలో జరుగుచున్న కపటనాటకానికి భరతవాక్యం పలికించి ఎంత త్వరలో అనుకూల వాతావరణం కల్పిస్తే అంత శ్రేయస్సు కలుగుతుంది దేశానికి; గ్రంథాలయోద్యమం విజృంభించడానికి అపుడెంతో సౌలభ్యం ఏర్పడుతుంది. ఉపాధ్యాయులకు తగిన శిక్షణా, ప్రోత్సాహమూ ఉంటే గ్రంథాలయోద్యమానికీ గ్రామ పునర్నిర్మాణోద్యమానికీ అల్పప్రయత్నంతో అనల్పమైన దోహదం లభించగలదు ఈ విషయాలన్నింటినీగూర్చి ఈ గ్రంథాలయ సంఘం అర్హరీతిని సమాలోచన చెయ్యాలని నా ప్రార్థన.

గ్రంథాలయోద్యమం సఫలం కావాలంటే బడికిహాజరుకాలేని వయస్కులలో విద్యాప్రచారం చాలఅవసరమని అందరు అంగీకరించిన విషయం ఈ వయోజనవిద్యకోసం యూరప్ దేశాలలో గడచినశతాబ్దమునుంచి జరుగుతున్న కృషి ఇంతా అంతా అని చెప్పడానికి వీలులేనిది. ఒకఇంగ్లాండులోనే కొన్ని వేల రాత్రి పాఠశాలలు దేశౌన్నత్యాన్ని హృదయపూర్వకముగా కోరి పనిచేస్తున్నకమిటీల ఆధిపత్యంక్రింద నడుపబడుచున్నవి. మనదేశమునకట్టిసౌభాగ్యంలేదు. గడచినపదిపండ్రెండు సంవత్సరాల్లోసక్రమంగా పనిచేయడం లేదనేకారణాన్ని పురస్కరించుకొని ప్రత్యేకం పగలు తీరిక లేని వారికి ఉద్దేశింపబడిన రాత్రి పాఠశాల లన్నింటికి స్వస్తిచెప్పబడ్డది. అంతటితో వయోజన విద్యకై కావింపబడుతున్న కించిద్యత్నంకూడ నిర్మూలమగుట తటస్థించింది. తిరిగి రాత్రిపాఠశాలలు, వేసంగిబడులు ఏర్పాటుచేసి అవి సక్రమంగా పనిచేసే మార్గాలు ఆలోచించి కృషిచేయవలసిన అవసరం ఉన్నది.

జబల్పూరులో రాబర్టసన్ కాలేజి విద్యార్థులు ఉపాధ్యాయులు సెలవుదినాల్లో పరిసర గ్రామాలకు వెళ్ళి వయోజనులందు విద్యాప్రచారం చేయడానికి పూనుకొనడం చాల ప్రశంసనీయమైన విషయం. మన ప్రాంతాలలో కూడ విద్యార్థులంతా ఇట్టి మహత్కార్యానికి పూనుకుంటే అనతికాలంలోనే వయస్కు

33



లందు విజ్ఞానవ్యాప్తి కల్గడం చాల సులభం. ఇట్టివి మరియింకను అర్హమని తోచినట్టివియు నగు మార్గాల ననుసరించి ప్రయోజన విద్యా వ్యాప్తికి కృషిచేయడం అవసరం.

ఇక ప్రజాగ్రంథాలయాలను ఏరీతిగా నిర్వహించవలెనో, గ్రామస్థులందు గ్రంథ పఠనాభిలాషను ఏరీతిగా అభివృద్ధిపరచవలెనో ఇత్యాది ఆవశ్యక విషయాలు చర్చింపదగిన వెన్నో గలవు. కాని కాలహరణమునకు వెఱచి ఆ విషయాలన్నింటినీ విజ్ఞానధనులైన ప్రతినిధుల సమగ్ర చర్చకు వదలి గ్రంథాలయోద్యమాభిమానులందరు సమరసభావంతో ఆచరణయోగ్యమైన యొక కార్య ప్రణాళిక ననుసరించి ఇతోధికంగా కార్యోన్ముఖు లయ్యెదరని విశ్వసించుచున్నాను.

పూజ్యులు విద్యాధికులు నగు లెఫ్టినెంటు కల్నల్ కె. వి. రమణారావు ఐ. యం. ఎస్. గారిని మహాసభాధ్యక్ష స్థాన మలంకరించడానికి వినయపూర్వకంగా అర్థించుచున్నాను.

---

# ప్రపంచపుగుట్టు

(ధర్మకర్తయు లోకసంచారియు ప్రవేశింతురు)

ధర్మ:-లోకసంచారీ! నిన్ను నియమించి ౧౫ సంవత్సరములైనది. ప్రపంచము శాంతిమార్గము కొఱకు తహతహ లాడుచున్నది. శాంతిస్థాపన ప్రయత్నములు ఆపుటకు ఇక వీలులేదు. నీవు గ్రహించిన విషయము లేవో వెంటనే చెప్పుము.

లోకసం:-మీ ఆజ్ఞప్రకారం ప్రపంచశాంతి మార్గముల కొఱకు అప్పటినుండి పరిశోధనలు చేయుచున్నాను. అనేకమంది చిత్తవృత్తులు పరిశోధించినాను. పెక్కు రహస్యములు గ్రహించితిని. అన్నీ బయలుపెడితే లోకుల దూషణకు పాల్పడతానేమోనని భయమగుచున్నది.

ధర్మ:-మానవశాంతికొఱకు నీపరిశోధనలు ఉపయోగపడే యెడల నీవట్టి దూషణకు పాత్రుడవు కాజాలవు. కాన నీ పరిశోధనల వివరముల తెలియబఱపుము.

లోకసం:-సరే! వినండి. ప్రపంచములో ప్రతి దేశమునకు ఇతర దేశములతోను, వాటివిజ్ఞానములతోడను సన్నిహితసంబంధము ఏర్పడి ఉన్నది. ఏదేశమువారు ఆదేశపరిస్థితులు మాత్రము చూచుకొని సరిచేసుకొందామంటే పూర్వమువలె వీలులేదు.

ధర్మ:-ఇందువలన ప్రమాదములేదు. శాంతికాముకులకు ఒక దేశము నుద్దేశించి పనిచేయుటకంటె ప్రపంచ మంతటిని గూర్చి చేయుటలో ఉత్సాహము హెచ్చుగా ఉండునుగదా! నేను ఒకమాట అడుగుతాను. దానికి సమాధానము చెప్పుము. ప్రజలలో ఈశ్వరవాదము హెచ్చా? నిరీశ్వరవాదము హెచ్చా?

లోకసం:-ఈశ్వరవాదమే హెచ్చు; నిరీశ్వరవాదము కొద్దిగామాత్రమున్నది. ఇప్పుడు సుమారు 200 కోట్ల ప్రజలలో నాల్గోవంతు క్రైస్తవ సిద్ధాంతములకిందను, ఎనిమిదవవంతు హిందూ సిద్ధాంతములకిందను, ఎనిమిదోవంతు

మహమ్మదీయ సిద్ధాంతముల క్రిందను, నాల్గో వంతు వివిధమతముల క్రిందను ఉండి భగవంతుని కొలుస్తున్నారు. ఇక బౌద్ధులు నాలుగో వంతున్నారు. వారు ఈశ్వరవాదులు కాకున్నను, అహింసాది సద్ధర్మపరాయణులు.

ధర్మ:-ఈ వివిధ మతములవారు సహనబుద్ధితో ఒకరికొకరు తోడ్పడుచుందురా? లేక ఒకరితో ఒకరు కలహములకు కాల్దువ్వుచుందురా?

లోక:-సహనబుద్ధిఉంటే లోపమేమి? అది చాల తక్కువ. ఇందువలన మతద్వేషములు పెరిగినవి. అవి మితిమీరి తుదకు మతములును వర్ణములును అంతరించవలెననే ఆందోళన బయలుదేరుచున్నది.

ధర్మ:- అట్లయిన ఇందునుగురించి ప్రపంచములోని ప్రభుత్వములు ఏమి చర్య తీసికొనుచున్నవో కనిపెట్టితివా ?

లోక:- కనిపెట్టకేమి, కనిపెట్టితిని. ప్రభుత్వములన్నీ ఆర్థిక విధానమునకు కట్టువడి పోయినవి మతవర్ణములు తటస్థభావము వహిస్తున్నవి. ఇటు మత నిర్మూలనమునకు గాని అటు మతసౌష్ఠవముకొరకుగాని చర్య తీసికొనుటకు తగినస్థితిలో లేవు.

ధర:- అయితే ప్రజానాయకులు ఏమిచేయుచున్నారు ?

లోక:-ఏమిచెప్పుదును. వారిలో అనేక చిత్తవృత్తులు కలవారున్నారు. అయినప్పటికీ మానవశాంతి కొరకు సత్యమును, అహింసయు అత్యవసరములని అహర్నిశాలు తంటాలు పడుచున్నవారు కొందరున్నారు.

ధర్మ:-నీమాటలనుబట్టి చూస్తే మానవశాంతి మొదట ఊహించినంత సులభంగా లభించేటట్టులేదు. ఇక కార్యరంగానికి దిగుదాము. నీవు చేసిన పరిశోధనలలో నేనుకూడా కొంత అనుభవం సంపాదించాలి. కాబట్టినన్నుకూడా నీవెంట పరిశోధనలకు తీసుకొనిపోతావా.?

లోక:-నాదొకమనవి. నాకోభయము కలుగుతున్నది. మీరు నావెంటఉంటే సహజముగా పనులు సాగవు. మీధర్మకర్తృత్వము చూస్తే నక్కవినయములతోను దొంగనటనలతోను పెక్కుమంది పొద్దుపుచ్చుతారు.

ధర్మ:-అట్లయిన నేను అదృశ్యుడనై ఉంటాను. నీకుతప్ప ఇతరులకు నేను కనబడను. నీపరిశోధనఫలితములు నాకు చూపెట్టవలెను. అవి కన్నులార చూస్తేనేకాని నాకు తృప్తి కాదు.

లోక:-చిత్తము, బయలుదేరండి.

[ఇరువురును వెళ్లుదురు.]

---

ఆంధ్రవ్యాస శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారికి

## సన్మానము

కవి పండితుల్ని ఆదరించే భాగ్యం ఒకప్పుడు మహారాజులది; ఇప్పుడు ప్రజాసామాన్యానికి కలిగింది. ది 11-4-37 న బెజవాడ రామమోహన గ్రంథాలయ భవనంలో బ్రహ్మశ్రీ కవిరాజు శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రిగా సన్మానం జరిగింది. వారిమీద పద్యాలు చదివారు; ఉపన్యాసాలిచ్చారు. వారికి వెయ్యినూటపదార్లూ నూతన వస్త్రాలే కాకుండా "ఆంధ్రవ్యాస" అనే బిరుదుకూడా అర్పించుకున్నారు. ఆదికవుల ముగ్గురి ప్రయాసం తామొక్కరు వహించి కృష్ణభారతాన్ని మనకందిచ్చిన కవిరాజుగారికి ఈసన్మానం ఉడుతభక్తి. సన్మానించినవారిని సన్మానం పొందినవారిని మేము అభినందిస్తున్నాము.

# సంపాదకీయములు

ఖద్దరు సంస్థానమువారి కె. యస్. బ్రాదర్సు కంపెనీ, బెజవాడ (వస్త్రమార్పిడి శాఖ)లో రిజిస్టరు చేసికొన్న చందాదారులకు వస్త్రరూపక మగు చందామీద మాపత్రిక అందగలదు.

మేనేజరు,
గ్రంథాలయ సర్వస్వము.

---

# గ్రంథాలయ సర్వస్వము

౧౧—౮—౩౨

## ఆంధ్రనాటకకళ

ఆంధ్రనాటకకళాపరిషత్తువారి ఆరవ వార్షికోత్సవము గతమాసము 27 వ తేదీన బెజవాడలో జరిగెను. ఆసందర్భమున శ్రీ పింగళి లక్ష్మీకాంతం ఎం. ఏ. గారధ్యక్షత వహించి సూత్రధారత్వము పూని నాట్యకళ ఆంధ్రదేశమున పొందిన పరిణామమును గురించి మొగమోటమిలేని యుపన్యాసము కావించిరి. నేటిస్థితిని వర్ణించుటలో యజమానులు రచయితలు పాత్రధారులు ఎల్లరను పాత్రల గావించిరి. వారియుపన్యాససారము వీరందరును సక్రమశిక్షణ పొందవలసి యున్నారనుట. మన దేశమున వృత్తులకైనను కొంత శిక్షణ యంగీకరించు నాచారము కలదు కాని కళలకు అసలు శిక్షణయే కోరునట్లు కన్పించదు. అందులో కవిత్వమునకు నాటకమునకు పద్దెమల్లగలవాడు, రంగు పూసికొనగలవాడు అయిన చాలునను సిద్ధాంత మేర్పరచుకొనినారు. అట్లగుటచేతనే యీ కవులు, ఈ నటులు సినీమాలకుపోగా ఆంధ్రదేశప్రఖ్యాతికే కొంత కొరంత కలిగినది. లక్ష్మీకాంతంగారు చెప్పినట్లు ప్రజల రుచులు మన యధోగతికి కొంత కారణము కావచ్చును గాని ప్రజలరుచులను దిద్దు ధర్మము కవిది, నటులది యనుమాట మరువదగదు. షేక్స్పియరు కాళిదాసులు తమ కాలపు రుచులను దిద్దినవారుగాని వానిననుసరించినవారుగారు. కవియు నటులును సుశిక్షితులయి ప్రజాప్రబోధము తమధర్మమని తెలిసికొనిననే నాటకకళవలన ప్రయోజనముండును. అది నాటకకళయగును. కావున సుశిక్షిత కవులను సంగీత సాహిత్య నాట్యశాస్త్రకుశలులగు నటులను తయారుచేసుకొను భార మాంధ్రావనిపై నున్నదని మనము తెలిసికొనదగును.

## దేశభాషలలో సార్వజనిక గ్రంథములు

గ్రంథాలయోద్యమమునకు కావలసిన యుపకరణములలో సార్వజనిక గ్రంథములు చాల ముఖ్యములు. అట్టి విప్పుడు మన దేశభాషలలో మిక్కిలి తక్కువ యనుట అందరెరుగుదురు. ఆ కొరతతీర్చుటకు ప్రయత్నము లిదివరలో విజ్ఞాన చంద్రికబోటి గ్రంథ ప్రచురణసంఘముల ద్వారా కొంతజరిగినవి. కాని నేటిదినమట్టివియు ప్రవృద్ధిమార్గమున లేవు. ఆంధ్రవిశ్వకళాపరిషత్తువంటి పరిషత్తు లేర్పడియు నిట్టి పనిని చక్కగా నిర్వహించుటకు దారి కన్పడలేదు. మద్రాసు గ్రంథాలయసంఘమువారేనాడో యీ విషయమున విన్నపము చేసికొనిరనియు విషయము డైరెక్టరు ఆఫ్ ఇన్స్ట్రక్షన్సువారి యాలోచనలో నున్నదనియు ఆసంఘపుసాంవత్సరికనివేదికలో గలదు. ధారాళముగా వ్యయము

పెట్టుట కేర్పరచిననేగాని సార్వజనిక ప్రచురణ ప్రయత్నము చక్కగా సాగజాలదు. గ్రంథాలయములకు భృతులక్రింద సంవత్సరమునకు ఎక్కడా చాలని పదివేలు నిర్ణయించిన ప్రభుత్వము ఇట్టి ప్రయత్నమునకు ద్రవ్యము తగినంత మంజూరుచేయుననుట దూరపుమాటయై తోచును. దక్షిణ దేశమునందు విద్యావ్యాప్తియందును గ్రంథాలయ కార్య వ్యాప్తియందును అభిమానముకల సంఘములు ప్రముఖులు చేరి యాలోచించి గట్టిగాపనిచేసి కార్యసాధన చేయవలసి యుందురు. గ్రంథాలయోద్యమము విరివిగా కలది ఆంధ్రదేశమునందే. ఈయుద్యమ కర్తలు నిర్వాహకులు అభిమానులు మహాప్రజలోనివారు. అధికారవర్గమునకు చెందినవారు కారు. ఆంధ్రదేశగ్రంథాలయ సంఘము 1914వ సంవత్సరమునుండి ఉద్యమ ప్రచారముకొరకు తన శక్తినంతయు వినియోగించి పనిచేయుచున్నది. ఆసంఘమువారును నిన్ననేడేర్పడి కొంత అధికారవర్గపు ప్రాపున పనిచేయుచుండు మద్రాసు గ్రంథాలయ సంఘమువారును ఇతరాభిమానులును పరస్పర మీవిషయమున సంప్రతించుకొని పనిచేయుదురు గాక యని కోరుచున్నాము మద్రాసు గ్రంథాలయ సంఘము వారు తాము వేరువేరు విషయములను గురించి నగరమున నిప్పించుచుండు ఉపన్యాసములను గ్రంథరూపమున దేశభాషలలో వెలువరింప నిశ్చయించుట సంతోషప్రదము. వారు ఇప్పటికి రెండుగ్రంథములు సర్వాంగసుందరముగా ప్రకటింతు మనినారు.

## పనిలేనివారికి పని

కలకత్తా విశ్వవిద్యాలయమువారు క్రొత్త దారులు త్రొక్కుటలో ప్రవీణులు. నిరుద్యోగ సమస్యను కొద్దిగానైనను తీర్చుటకువారు క్రొత్త దారి త్రొక్కిరి. ఆనగరములోని వ్యాపార వాణిజ్యవ్యవహార కార్యాలయములతో సంప్రదింపు కావించి వ్యాపారము పరిశ్రమలు వాణిజ్యము ఈమూడు శాఖలయందును తగినతరిబీతిచ్చి ఆవిశ్వవిద్యాలయ పుత్రులలో నిరుద్యోగులైన వారికి ఉద్యోగము లిప్పించుటకు నిర్ణయించిరి. ఉద్యోగములబోర్డు నొకదానిని నియమించిరి. ౩౬ వేల రూపాయలు వ్యయములకుగాను మంజూరుచేసిరి. డాక్టరు బి. సి. రాయ్ ఈవిషయమై మాట్లాడుచు పరిశ్రమలకు సంబంధించిన రాసాయనిక శాస్త్రశిక్షణము కొందరకు ప్రత్యేకించి విశ్వవిద్యాలయములో ఇయ్యదలచితి మనిరి. విశ్వవిద్యాలయము ఉద్యోగములను సంపాదించి ఇచ్చు సంఘము కాదనుట నిజమే కాని ఇప్పటి పరిస్థితులలో కొంతవరకు నిరుద్యోగ సమస్యాపరిష్కారమును విశ్వవిద్యాలయములైనను ఆలోచించి తీరవలసియున్నది. వ్యాపారములలోను పరిశ్రమలలోను వ్యవహారములలోను దక్షులైన వారితో సంబంధము పెట్టుకొని సర్వకాలమును సంఘజీవనదృష్టితో కూడ తన సమస్యలను నడపుకొనవలసియున్నది.

ఈతత్వమును కలకత్తా విశ్వవిద్యాలయము గ్రహించినందుకు సంతసించుచున్నాము. ఇతర విశ్వవిధ్యాలయములును ఈమార్గ మనుసరించును గాక! యని కోరుచున్నాము.

## ఐదేండ్ల పిల్లలకు గ్రంథములు ఎరవిచ్చుట

స్కాట్లండులోని ఎడింబరో పట్టణమునుండి క్రొత్తవార్త వచ్చినది. చిఱుపయస్సులోని పిల్లలకు గ్రంథములు ఎరవిచ్చు విధానమున నూతన పథమును త్రొక్కినది. అచ్చటి మునిసిపలు

గ్రంథాలయములలో ఇకముందు అయిదు సంవత్సరములవయస్సుగల పిల్లలకు గ్రంథము లెరవిత్తురు. కొన్ని సంవత్సరముల క్రిందట పంద్రెండేండ్లకు లోబడిన బాలుర కెవ్వరికిని గ్రంథము లెరవిచ్చుచుండుటలేదు. ఇటీవలనే ఆమితిని ఇంగ్లండులో పదియేండ్లకు దించిరి. గ్లాస్గోవారి ఈ క్రొత్తతీర్మానము చాలమందికి ఆశ్చర్యము కొలుపగలదు. కాని బిడ్డచదువుటకు నేర్చినతోడనే, లేదా, బొమ్మలు చూచుట కభ్యాసపడినతోడనే క్రాయ్‌డన్ మునిసిపాలిటీలో అట్టి బిడ్డల పరముగా తల్లిదండ్రులకు గ్రంథములిచ్చు అలవాటున్నది. అట్టి బిడ్డల యుపయోగార్థము అచ్చట లైబ్రిరీలో ప్రత్యేకపుగదు లేర్పఱచి, వసతులేర్పఱచియున్నారు. ౧౦౦ కి ౯౧ రికి అక్షరములేరాని ఈ దేశమున ఈ వివరణమే యందురు కాబోలు! మన దేశపుపరిస్థితులు ఎంత త్వరిత గతిని విద్యుద్వేగ మనోవేగములతో మారవలసియున్నవో సూచించుటకని మాప్రత్యుత్తరము.

## హిందీభాష - భారతీయసాహిత్యము

గతమాసము కడపటిదినములలో మద్రాసు నగరమున అఖిలభారత హిందీసాహిత్య సమ్మేళనము భారతీయ సాహిత్య సమ్మేళనము దక్షిణ హిందీప్రచారసభ స్నాతకోత్సవము ఇన్నియును వైభవముగ జరిగినవి. భారత దేశీయనాయకులు పలువురిందు పాల్గొనిరి. మహిళామణి శ్రీ సి. వీ. రామర్సతి అఖిలభారత హిందీ సాహిత్యసమ్మేళనమున కాహ్వాన సంఘమున కధ్యక్షురాలుగానుండి స్వాగత కార్యమును చక్కదిద్దినది. జమ్నాలాల్ బజాజ్ హిందీసమ్మేళనమున కధ్యక్షులు. స్నాతకోత్సవమున తాండన్ గారాచార్యత్వము వహించిరి. భారతీయసాహిత్య సమ్మేళనమునకు గాంధిమహాత్ముడే నాయకత్వము భరించె. ప్రకృతిశాస్త్ర, తత్త్వశాస్త్ర, చరిత్రశాస్త్రములాదిగాగల శాస్త్రసంబంధులగు ప్రత్యేక సమావేశములును జరిగినవి.

* * * *

కాంగ్రెసుమంత్రుల కార్యక్రమమునకు గవర్నరులు తమ ప్రత్యేకాధికారములప్రయోగముచే అడ్డురామని వాగ్దానము చేయవలసినదనియు తాము ఇండియా రాజ్యాంగశాసనమునకు లోబడి పనిచేయుదుమనియు కోరుటయు దానిని గవర్నరులు ఒప్పుకొనక పోవుటయు కాంగ్రెసువారు బహుళసంఖ్యాకులుగా వోట్లచే తామరతంపరగా శాసనసభలకు ఎన్నుకొనబడియు మంత్రిత్వములు అంగీకరింపక తోసిపుచ్చుటయు నేడు ప్రతిపల్లెటూరికిని తెలిసిపోయినదిగదా! ఆసందర్భమున మద్రాసుగవర్నరుకును మద్రాసుశాసనసభల కాంగ్రెసుపార్టీనాయకుడు రాజగోపాలాచారిగారికిని సంభాషణలు జరుగుచున్నప్పుడే ఈనాయకులందరును 'హిందీ'మహోత్సవమును దక్షిణదేశమున పైన పేర్కొనిన విధమున జరుపుటకు విచ్చేసి యుండిరి. అప్పటిలో ఆరాజకీయ విషయమెంత విరివిగా పత్రికలను నించినదో అంతిగా నీ 'హిందీ' మహోత్సవప్రశంసయు ప్రకటితమైనది.

* * * *

జరిగిన వృత్తాంత మంతయు వ్రాయడమునకుగాని ఉపన్యాసములను ప్రకటించుటకు గాని మాకు తావుచాలదు. కాని ఇంతటికార్యక్రమమునకును సూత్రధారుడై భారతజీవన సమస్యల కన్నిటికిని ఆచార్యత్వము వహించిన గాంధీజీపలుకులే అందరి పలుకుల సారమగుటచేత అతనియభిప్రాయములనే యిచ్చుట ప్రసంగింప దలచితిమి.

* * * *

గాంధీజీ 'హిందీ'ని అఖిల భారతీయులకు సామాన్యభాష కావించుటకు కంకణము కట్టినాడు. తన భాషయగు గుజరాతీమాట యటుంచి బంగాళీ, మహారాష్ట్రము, ద్రావిడభాషలను వేరువేరుగా తీసికొని యివియేవియు సర్వభారత భాషకాజాలవని నిరూపించినాడు. 'హిందీ' తప్ప ఇంకొక భాషను సర్వభారత భాషగా కాంగ్రెసు సంఘమువారు అంగీకరించరాదని కాంగ్రెసు సమావేశములలో ఇంగ్లీషునకు తావీయక హిందీనే వాడవలసినదని తీర్మానింపించినాడు. అధవా, హిందీరాని సభ్యులున్న యెడల వారు మాతృభాషయందుపన్యసించి హిందీలోకి ఇతరులచేత తర్జుమాచేయించుకొనవలసినదని నిర్ణయింపించినాడు.

* * * *

అయినా గాంధీజీకిగాని ఇతర నాయకులకు గాని భారత జీవితములోనుండి ఇంగ్లీషును పూర్తిగా తోసివేయవలెనను దృష్టిలేదు. ప్రపంచ భాషగా దీనికి ప్రచారము కలదు కాబట్టి యిది యభ్యసింపదగినదే యందురు. ప్రపంచ విజ్ఞాన సాధనకు ఇది యవసరమనియు నంగీకరింతురు.

* * * *

దేశభాషల నంగతి యేమి? గాంధీజీ వీనికి హిందీతో సమమగు స్థానమును సూచించినాడు. దేశభాషల ప్రవృద్ధి లేనియప్పుడు 'హిందీ'కిని ప్రవృద్ధిలేదనినాడు. అవి విజృంభించిననే దీనికిని విజృంభణమనినాడు. అవి కృశించిన నివియు కృశించునని యతనినిర్ణయము.

* * * *

లిపివిషయమున నన్నిటికిని ఒకలిపి సాధించవలెననుట అతనిమతము. ఆలిపి నాగరలిపిగావలెను కాని వేరు కాదని అతనిసూచన. లిపినాగరియైనంత మాత్రమున దేశభాషల కపాయము రాదని యతని యభయము. యూరోపులో అన్నిభాషలున్నను—ఫ్రెంచి, లాటిను, గ్రీకు, ఇంగ్లీషు, స్పానిషు, జర్మను ఇత్యాదులు—అన్నిటికిని రోమను లిపియే సరిపోవుచున్నదని యుదహరించి అవి ప్రత్యేకము ఒక్కటికంటె నొక్కటి బలవత్తరాభివృద్ధి నొందుచున్నవని ఉదహరించినాడు. ఏక లిపి అన్నిభాషలకేర్పడినచో ఒక్కభాషవారు మరియొకభాషను నేర్చుకొనుట సులభతరమగునని హెచ్చరించినాడు.

* * * *

దక్షిణభారతదేశమున జరిగిన హిందీప్రచారమునకు గాంధీజీ సంతసించినాడు. హిందీ యననేమో యేయొక రిద్దరయినను ఎరుగని ఈప్రాంతములలో నాలుగు లక్షలరూపాయిల వ్యయముతో ఆరేడులక్షల జనులకు హిందీ పట్టువడుట గొప్ప సాధనయే యని ప్రశంసించినాడు.

* * * *

అంతయు బాగున్నది. చేసిన ప్రయత్నమునకు సంతసింప వలసినదే. చేయవలసిన ప్రయత్నముకూడ చేయదగినదే. కాని కంటికికనిపించు అంతరాయములను ఆలోచింపకపోవుట ధీరలక్షణముగాదు.

* * * *

ఇన్నిమాటలు చెప్పినా గాంధియంతటివాడు ఊరక 'హిందీ' యని వ్యవహరింపక 'హిందీ హిందూస్థానీ' యని నవీనసృష్టి చేసి వ్యవహరింపవలసివచ్చినది. హిందీ ఉర్దూలకుగల వైషమ్యము దీనికి కారణము. యాకుబ్ హసన్ సేటుగారు నిజము ప్రకటించిరి. హిందూస్థానీ యను భాష హిందూ ముసల్మానులకు సమభాషగానుండినది. ఒకవైపు సంస్కృత జటిలముగా మాట్లాడువారును (అనగాహిందువులన్నమాట)

ఒకవైపు అరబ్బీ పర్షియన్ జటిలముగా మాట్లాడువారునే చేరి ఆసమభాషను అసమభాషగా మార్చివేసినారు. హిందీ ఉర్దూలు దూర దూరమైపోయినవి. వీనిపరస్పరవివాదము లెన్నటికైన తీరునా ? ఎవరు చెప్పగలరు ?

* * * *

భాషయెడల పాటించునంతటి యావేశము లిపియెడలను పాటించుచున్నారు. ఉర్దూనాగరి లిపులకు ఉత్తర హిందూస్థానమున నిజముగా వైరుధ్యమే. గాంధీజీ చెప్పినంత మాత్రమున హిందీ హిందుస్థానీ యని తాను వ్యవహరించే భాషలో భాగమగు హిందూస్థానీముసల్మాను నాగరలిపిని అంగీకరించుననుట కలలోని వార్త. హైదరాబాదు నైజాముగారు ఉర్దూభాషకు ఉస్మేనియా విశ్వకళాపరిషత్తు మూలకముగా కలిగించుచుండు ప్రచార మెరింగినవారి కెవ్వరికిని గాంధీజీకి కలిగిన విశ్వాసమెన్నడును కలుగబోదు.

* * * *

రామకోటేశ్వరరావుగారు తెలిపిన రీతిని ఆంధ్ర కర్నాటకలిపిగాని తమిళలిపిగాని తమ ప్రత్యేకత్వమును వదలుకొనజాలవనియే తోచును. ఉత్తర హిందూస్థాన భాషలు గుజరాతు, మహారాష్ట్రము, ఓఢ్రము ఇన్నిటికి నాగరలిపి దగ్గరిచుట్టముగానుండి కూడ అచ్చటనే. ఉర్దూ పోరాటముకలుగుచు ఇతర భాషలవారు తమ తమ లిపులను సంస్కరించుకొననప్పుడు ద్రావిడ భాషలు లిపిమార్పునకు సిద్ధపడుననుట నమ్మరానిమాట. మన దేశమున అన్నిటికిని వలెనే లిపికిని మతసంబంధమగు ఇష్టారిష్టములు వర్తించుచున్నవి. కాబట్టి యాచిక్కులేవియులేని యేరోమనులిపినో సామాన్యలిపిగా అంగీకరింపుమన్న విలువ యుండునేమో! కాని అంతటి విప్లవమును లిపిసందర్భమున సూచించుటకు గాంధీజీకి నైనను సాహసమున్నట్లు కన్పడదు.

* * * *

ఇక గాంధీజీమతమున నేమి, యితరుల మతమున నేమి! భారత దేశమున పుట్టినవాడు మూడు భాషలైనను నేరువవలెననుట స్పష్టము. దేశీయ భాషగా హిందీ, ప్రపంచభాషగా ఇంగ్లీషు, తల్లి భాషగా ప్రాంతభాష. అన్ని భాషలకు తల్లి సంస్కృతము. అది తప్పక అభ్యసనీయ మనువారు హిందువులలో నున్నారు. ఉర్దూ అరబ్బీలు లేకున్న ముసల్మాను మతము నశించును. వీనిని పిల్లలు చదవితీరవలెననువారు ముసల్మానులలో నున్నారు. ఈ భాష లన్నియు ఏవయసులో ఆరంభించవలె? ఎంతకాల మభ్యసింపవలె? ఏమాత్రమిందులో పాండిత్యము పొందవలె? అను ప్రశ్నలు తీర్పుట విద్యావ్యాపనయం దభిమానముగల ఉపాధ్యాయులయు తలిదండ్రులయు కార్యము. మాతృభాష అన్నిటికిని బునాది. అందు పరిశ్రమ బాగుగా జరిగిన పిదప తక్కిన భాష లభిమానభాషలుగా ఐచ్ఛికముగా నేరువవచ్చుననన్న యెడల విద్యాప్రచారమునకు నష్టములేదు. అట్లుగాక హిందీ నిర్బంధము, ఉర్దూ నిర్బంధము, ఇంగ్లీషు నిర్బంధము, సంస్కృతము నిర్బంధము అని చిన్నతనములో ఇన్ని నిర్బంధములయ్యెనా మన పిల్లల మెదడులు పెద్దవైనను ప్రథమావస్థలోనే యుండక తప్పవు. కాబట్టి ఐచ్ఛికముగా ఇదివరలో జరిగినరీతిగా హిందీప్రచారము జరుగుటయందు దోషముండదుగాని ఆవేశముచేత దానికి బాలబాలికల జీవితములో నిర్బంధస్థానము కల్గెనా, దేశభాషలకు. పిల్లల విద్యాభివృద్ధికి రెంటికిని నష్టమగునని హెచ్చరింపకతప్పదు. దక్షిణ దేశములో హిందీయెడల కొంత విముఖత్వ

మున్నదంటే కారణము ఇది కాని వేరుకాదు. తల్లిబాసయగు తెలుగును వదిలి పరస్పరము మాట్లాడుకొనడములో ఇంగ్లీషును తల ధరించినామేయని సిగ్గుపడి తెలుగే ప్రచారానికి తెచ్చుకొనుటకు ప్రయత్నించుచున్నప్పుడు మళ్ళీ తెలుగుబంధువులు మిత్రులు తెలుగు మానుకొని హిందీ పరస్పరము ఉపయోగించుకొనవలెనంటే కష్టములు సంఘటిల్లుచున్నవి. గాంధీజీ మాట్లాడడంలోనె యీ విషయంలోని విషాదం కొంతబయలుపడినది. తన కింటిలో అరవము ఉపయోగించి అభ్యాసము మరల చేయవలెనని ఉన్నదటగాని రాజగోపాలాచారికూతురు తనకోడలు హిందీయే కావలెనంటుందట !

* * * *

అయితే 'హిందీ'ప్రచారమునకు ఒక్కయనుకూలమున్నది. దేశములోఅన్ని భాషలతో సమంగానే హిందీలోకూడ సంస్కృత పదాలు ప్రాతిపదికాలుగా విశృంఖలంగా చేరిఉన్నవి. ముసల్మానుల రాజ్యకాలంలో పరిపాలనా సౌకర్యమునకై దేశమంతటను జొచ్చిన ఉర్దూ అరబిక్ పరిషియాపదములును అన్ని భాషలలోనుమెండుగా నున్నవి. ఇంగ్లీషుసంపర్కముచేతను నేటి ప్రకృతిశాస్త్రముల బోధకొరకును ఆభాషాపదములును దేశమంతటసమముగానున్నవి. ప్రాంతపు వాడుకభేదములచేత అర్థములు తారుమారగుట కొన్ని సందర్భములలో సంభవించినదికాని పదసంపదలో ఆసేతుహిమాచలము మనసభ్యత్వపు ప్రత్యేకత్వము సూచితమగుచునే యున్నది. కాబట్టి భారతీయ సాహిత్య సమ్మేళనము వారు ప్రకృతి శాస్త్రములు, అర్థశాస్త్రము, న్యాయశాస్త్రము ఇత్యాది శాస్త్రములలో ప్రయోగితమగు పదములకును పరిపాలనలోని అన్ని శాఖలలోను ప్రయోగితమగు పదములకును అన్ని దేశభాషల పండితుల సహాయముతో నిఘంటువు లేర్పరచి దేశమంతటను వీనిని ఏకార్థప్రతిపాదకములొనర్చ కలిగిన్న యెడల ఎనటికైనను దేశమున కంతటికిని ఏకభాష యేర్పడుటకుబునాదివేసినవారగుదురు. అంతేకాదు, అన్ని భాషలలోను ప్రయోగమును పొందుచుండు సంస్కృతఅరబిక్ పర్షియన్ పదములకు సంభవించియుండు అర్థభేదములనువివరించిఏకపదమున కేర్పడిన నానార్థముల నన్ని భాషలవారును గ్రహించునట్లు ఒకపత్రికను అన్నిభాషలలో ఏకకాలములో నడుపుటయో ఏఒకగ్రంథమును అన్ని భాషలలో ప్రకటించుటయో జరుపవలసియుండును ఈ కార్యములు సాగినయెడల అన్ని భాషలను నైఘంటికకార్యముల కొక యాధారభూమిమీదికి తెచ్చినవారమగుదుము. అన్ని భాషలును దగ్గరిచుట్టములని ఒండొంటిని సమీపించుటకు సహాయము చేసినవారమగుదుము. ఈకార్య నిర్వహణములో ఎంతదనుక ఏకలిపి ప్రయోగింపవచ్చునో అంతవరకు లిపిసాధనయు చేయవచ్చును. అప్పుడు 'హిందీ' అన్నిభాషలకును దగ్గరిచుట్ట మయిపోయి దేశమున సామాన్యభాషగా పరిణమించును. అట్లుగాక ఇది ప్రత్యేక పరిశ్రమచే నేర్పాదగిన నాలుగుభాషలలో నొక భాషగా బలవంతపెట్టబడు నెడల దేశభాషల కిది పోటీయను భావము తప్పించుట సులభసాధ్యము కాదు.

విశ్వమానవాభ్యుదయమునకు
వయోజనవిద్యయే ఉనికిపట్టు

# ఏలూరు అన్నదానసమాజము — Annadanasamajam, Ellore.

ఏలూరు, అన్న, వస్త్ర, వైద్య, విద్యాదానసమాజము 1913 సం॥ రమున స్థాపింపబడెను. ప్రభుత్వమువారు స్థలము ధర్మముగ నొసంగిరి. మ. రా. శ్రీ బొమ్మా రత్నంగారి ద్రవ్యసహాయమున భవనము నిర్మింపబడెను. ఇందు ప్రతిదినము అశక్తులకు అన్నదానము జరుగుచున్నది. ప్రతిసంవత్సరము 15 డిశంబరున బీదలకు వస్త్రదానము జరుగుచున్నది. వేసవికాలమున మంచినీళ్లు చలివేంద్రలు పెట్టబడుచున్నవి. వైద్యదానము ప్రతిరోజు సాయంకాలము సమాజమువద్ద జరుగుచున్నది.

ఒకరోజు అన్నదానమునకు రు 60 లు ధర్మమిచ్చిన స్థిరాస్తులవల్ల వచ్చే ఆదాతో వారు కోరిన తేది 1 రోజున బీదలకు అన్నదానము జరుగును. వస్త్రదానము శాశ్వతనిధి ధర్మము రు 10 లు లగాయతు ఈయవచ్చును. ధర్మములకు రశీదులను, శాశ్వతనిధి ధర్మములకు రసీదులతోసహా పట్టాలను 5 గురు శాశ్వతధర్మకర్తలు (రు 500 దాతలు) సంతకములతో నిచ్చెదరు. ఎల్లరు సహాయపడ గోరుచున్నాము. ఇతర వివరములకు :—

| | |
|---|---|
| రావుబహద్దరు, మోతే గంగరాజు జమీందారుగారు | శాశ్వతధర్మకర్తలలోనివారు |
| కొత్తమాసు సీతారామయ్యగారు, (సోల్‌ట్రస్టీలు) | |
| పనుమర్తి పురుషోత్తంగారు, (ప్రెసిడెంటు) | |
| మద్దుల వెంకట చినరాజుగారు, (వైస్‌ప్రెసిడెంటు) | |
| నున్నా గంగరాజుగారు, (వైస్‌ప్రెసిడెంటు) | |
| కందుల రామయ్యగారు, (సెక్రటరీ) | |

---

# ఏలూరు, హిందూ యువజనసంఘము
## Youngmen's Hindu Association, Ellore.

ఈగ్రంథాలయము 1904 సం॥రమున స్థాపింపబడెను. 1918 సం॥రము సంఘమురిజష్టరు అయినది. 1928 సం॥రము మ. రా. శ్రీ రా. బ. మోతే గంగరాజు జమీందారుగారి ద్రవ్యసహాయమున నూతన దివ్యభవనము (రు 50,000 లు వెచ్చింపబడి) నిర్మింపబడినది. ఇందు దిన, వార, పక్ష, మాసపత్రికలు, ఆంగ్ల, ఆంధ్రభాషలయందు వచ్చుచున్నవి. ఆంగ్ల, ఆంధ్ర, సంస్కృత గ్రంథములు సుమారు 13 వేలవరకు గలవు. మ్యాజిక్‌లాంతరు, వ్యాసరచన పోటీపరీక్షలు, విషయనిర్ధారణ సభలు, వక్తృత్వపోటీపరీక్షలు ప్రతిసంవత్సరము జరుపుచు అందు తీర్ణులకు బహుమతు లొసంగబడుచున్నవి. ఇంకను గ్రంథములు, పత్రికలు తెప్పించవలసినవి యున్నవి. ఎలక్ట్రిసిటి, రేడియో అవసరము. ప్రతిసంవత్సరము ఆదాయమునకు మించిన వ్యయమగుచున్నది. కాన ఎల్లరు శక్తికొలది సహాయపడుడు. ధర్మములకు రశీదులను శాశ్వత ధర్మములకు రశీదులతోపాటు పట్టాలను, 5 గురు శాశ్వతధర్మకర్తల (రు 500 దాతలు) సంతకములతో నిచ్చెదరు. క్యాటలాగులు అచ్చువేయబడెను.

ఇతర వివరములకు:—

రావుబహద్దరు, మోతే గంగరాజు జమీందారుగారు, (ధర్మకర్తృసభాధ్యక్షులు)
మద్దుల వెంకట చినరాజు శ్రేష్ఠిగారు, (ధర్మకర్తృసభాగౌరవకార్యదర్శి)

RSVM01 A 165 42

Grandhalaya Sarvasvam—Registered No. M **1714.**

వృద్ధాప్యమునందు మీకుగాని, తదనంతరము మీ యార్జనాసౌకర్యములను గోల్పోయిన మీ దారాపుత్రాదులకుగాని, సునాయాసము, సుఖప్రదమునగు జీవితము నేర్పరచునదియు, మిక్కిలిగ యాధారపడతగినదియునగు పెట్టుబడి

## "ప్రాణ భీమా"

గనుక, వెంటనే మీ జీవితములను 'ఓరియంటల్' కంపెనీలో భీమా చేయించి, మిమ్మును, మీ యనుజీవులకును భవిష్యత్తు నేర్పరచుకొనుడు:—

వివరములకు:—

## ది ఓరియంటల్

### గవర్నమెంటు సెక్యూరిటీ లైఫ్ ఎష్యూరెన్సు కంపెనీ, లిమిటెడ్.

స్థాపితము 1874 లేక హెడ్ ఆఫీసు, బొంబాయి

బ్రాంచి సెక్రిటరీ, ఉత్తరసర్కార్లు, గోడేవారివీధి, విశాఖపట్నము లేక

కంపెనీతాలూకు దిగువ నేయే ఆఫీసున కయినను వ్రాయుడు—

ఆగ్రా, అజ్మీర్, అహమ్మదాబాద్, అలహాబాదు, అంబాల, అమృతసార్, బెంగుళూర్, బెరియేలీ, బెల్లారి, కలకత్తా, కాలికట్, కోయంబత్తూరు, కొలంబో, ఢక్కా, ఢిల్లీ, గౌహతీ, గుంటూరు, జల్గాను, జల్పాయగురి, జోధ్పూర్, జబ్బల్‌పూరు, కరాచీ, కోలాలంపూర్, లాహోరు, లక్నో, మద్రాస్, మాండలీ, మధుర, మెర్కారా, మొంబాసా, ముల్తాన్, మైసూరు, నాగపూరు, పాట్నా, పెషావరు, పూనా, రాయపూర్, రాజషాహి, రాంచీ, రంగూన్, రావల్పిండి, సింగపూరు, సుక్కూర్, తిరుచునాపల్లి, త్రివేండ్రము, వెల్లూరు.

విలువ పెరుగుచున్నది.

1936 వ సంవత్సరంలో రు 10,26,30,496 ల కిమ్మతుగల 59,296 పాలసీలు.

1935 సం॥లో రు 8,89,89,149 ల కిమ్మతుగల 48 ౭౫౭ పాలసీలు.

పెంపుదల: పాలిసీలు 7,438; కిమ్మతు 1,36,41,347.

# Ellore Gosamrakshana Samithi.

## ఏలూరు గోసంరక్షణ సమితి, స్థాపితము 1918.

ది 22-9-36 న ఈ సంఘము రెజిస్టరయినది.

ఈ సమితియందు దిక్కులేని గోవులు రక్షింపబడును. పాలు ఉన్నయెడల చంటిబిడ్డలకు, దైవపూజలకు, బదలకు ఉచితముగ నిచ్చెదరు. పచ్చిగడ్డినిమిత్తము బీడుభూమి కొనవలసియున్నది. మంచిస్థితిలోనికివచ్చిన గోవులను గృహస్థులకు అమ్మెదరు. గోశాలనిమిత్తము స్థిరమైన స్థలము అవసరము. ధర్మములకు రశీదులు, శాశ్వతనిధి ధర్మములకు రశీదులతోసహా అయిదుగురకు తక్కువగాని శాశ్వత ధర్మకర్తల [ రు 500 దాతలు ] సంతకములతో పట్టాలనిచ్చెదరు. అభిమానులెల్లరు శక్తికొలది శాశ్వతనిధిధర్మములేకాక వార్షికమామూళ్లుగను, నెల చందాలుగను వరిగడ్డి, తవుడు, విరాళములుగను సహాయపడి యీ సమితిఅభివృద్ధికి తోడ్పడ గోరుచున్నాము.

గోసంరక్షణసమితి ప్రచురణములకు, రూల్సుబుక్కులకు, రిపోర్టులు మున్నగువానికి:—

ఏలూరు
5—10—1936.

రా॥ బ॥ మోతే గంగరాజు జమీందారుగారు, ( ప్రెసిడెంటు, ట్రస్టి. )
మద్దుల వెంకట చినరాజుశ్రేష్ఠిగారు, ( వైస్ ప్రెసిడెంటు, ట్రస్టి. )
పోలిశెట్టి గోపాలస్వామిగారు, ( సెక్రిటరి, ట్రస్టి. )

| | |
|---|---|
| | మనసు ఫౌండేషన్<br>పుస్తకాల పరిశీలనాపట్టిక |

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | RSVMO1A105 |
| పుస్తకం పేరు | [illegible] |
| తారీఖు | 7/6/24 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 45 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | NO |
| లేని పేజీలు | NO |
| తయారు చేసినది | Hema |
| పేజీలు విడదీసినది | Hema |
| స్కాన్ చేసినది | Sandhya |
| పరీక్ష చేసినది | pragati |
| పేజీలు పరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| స్కాన్ చెయ్యనివి | |
| తప్పులు | NO |
| పరిస్థితి | Good |